ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 17.08.2026 | సంపుటి :13 సంచిక : 28 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## కల్తీ ఆహారం, డ్రగ్స్‌పై ఇక ఉక్కుపాదం


- తెలంగాణలో టీజీ-సేఫ్ ఏర్పాటు
- ఫుడ్‌సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌ను విలీనం చేస్తూ ఉత్తర్వులు
- కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఆహార కల్తీ, డ్రగ్స్ వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామని స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ - టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేసింది.ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌ను విలీనం చేసి టీజీ-సేఫ్‌ను ఏర్పాటుచేసిన ప్రభుత్వం, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డైరెక్టర్ జనరల్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అవినాష్ మొహంతిని టీజీ-సేఫ్ కమిషనర్‌గా నియమించింది. ఫుడ్ సేఫ్టీ స్టాండ్ యాక్ట్-2026 ప్రకారం టీజీ-సేఫ్ కమిషనర్ అధికారాలు, విధులు

మిగతా 2లో..



# ప్రతిపక్షనేత సభకు రావాలి



“ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మొదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలను తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. మల్లూరు నరసింహస్వామి దేవాలయానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తాం. ములుగు ప్రాంత అభివృద్ధికి ఏం కావాలో చెబితే నిధులు మంజూరు చేస్తాం” - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### సలహాలు,సూచనలు ఇవ్వాలి • తీసుకొచ్చే బాధ్యత కేటీఆర్,హరీశ్ తీసుకోవాలి

“బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దామని కేటీఆర్, హరీశ్‌రావు కోరుతున్నారు. సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. కేసీఆర్‌తో పాటు వారిద్దరూ సభకు రావాలి. కేంద్ర మంత్రిగా, సీఎంగా విధులు నిర్వహించిన కేసీఆర్ అనుభవం, సలహాలు మాకు కావాలి. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ఆదాయం సరిపోతోంది. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాం. ఈ 32 నెలల్లో మూడు రోజులైనా సెలవు తీసుకున్నానా? యువత ఆత్మబలిదానాలు చేసి తెలంగాణ సాధించుకున్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబం యువతను రెచ్చగొట్టింది. నిరుద్యోగులు ధర్నాలు, ర్యాలీలు చేసి సమయం వృథా చేసుకోకండి. ధర్నాల్లో పాల్గొంటే కేసులతో భవిష్యత్ నాశనమవుతుంది. నిరుద్యోగుల కోసం నేనున్నా.. మీకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తా. కేసీఆర్.. ‘ఫ్యామిలీ జస్టిస్’ చేస్తే.. నేను సోషల్ జస్టిస్ చేశాను. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబానికే లాభం.. నేను ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది” - సీఎం రేవంత్

- సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు పెడుతున్నాం
- ప్రతీ ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీచేసి తీరుతాం
- వరంగల్ పోరాటాల గడ్డ
- సొంత చెల్లెనే బయటకు నెట్టారు
- రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా?
- పరకాలలో రూ.484 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు
- అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగం



### ‘రామప్ప’తో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయ అభివృద్ధి

- ములుగు అభివృద్ధి,గిరిజన సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలో రూ.868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శ్రీకారం
- మేడారం వనదేవతల సమక్షంలో కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందజేత
- హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కవిష్కరించిన ముఖ్యమంత్రి

వార్త 2 లో

**ములుగు బ్యూరో (జనంసాక్షి):** కేటీఆర్, హరీశ్‌రావు శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, మీ పాలనపై, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దామని రేవంత్ సవాల్ విసిరారు. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు పెడుతున్నామని, కేసీఆర్‌ను కూ డా తీసుకురావాలని సూచించారు. సీఎంగా, కేంద్ర మంత్రిగా చేసిన కేసీఆర్ అనుభవం, సల హాలు తమకు కావాలని తెలిపారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట కోసం

మిగతా 2లో..



## సోనియా వందేమాతరాన్ని అవమానపరిచారు

క్షమాపణలు చెప్పండి • అమిత్ షా డిమాండ్



**జైపూర్(జనంసాక్షి):**కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శలు గుప్పించారు. శనివారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ కళ్లారా చూశారని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని మండిపడ్డారు. ఆ పార్టీని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని అన్నారు. వందేమాతంన్ని అవమానించినందుకు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు సిగ్గుచేటని విమర్శించారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గడ్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.అమిత్ షా పర్యటనకు ముందు కాంగ్రెస్ నాయకులతో పాటు పలువురు విద్యార్థులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమిత్‌షా ర్యాలీ నేపథ్యంలో నిరసన చేపట్టడానికి విద్యార్థులతో పాటు ఇరవై నాలుగు మంది కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. పేపర్ లీక్‌లు, ఢిల్లీలో విద్యార్థులపై దాడులపై కేంద్రమంత్రి స్పందించాలని డిమాండ్ చేస్తూ.. నిరసన చేపట్టారు. దీంతో వారిని అక్కడి నుంచి బలవంతంగా

మిగతా 2లో..

## అది కమ్యూనికేషన్ గ్యాప్

భాజపా ఆరోపణను తోసిపుచ్చిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన స్వాతంత్య్రదిన వేడుకలపై దుమారం రేగింది. జెండావందనం సందర్భంగా..వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని భాజపా ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియో దృశ్యాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ సామాజిక మాధ్యమాల్లో

మిగతా 2లో..

## ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో మా జోక్యం పరిమితం

- రైతుబంధు చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు
- ప్రభుత్వ ఆపీల్‌కు ధర్మాసనం అనుమతి



**హైదరాబాద్(జనంసాక్షి):**ఆర్థిక, సంక్షేమ విధానాలకు సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రాధాన్యాలను కోర్టులు నిర్ణయించలేవని హైకోర్టు తేల్చి చెప్పింది. ఆర్థిక విధానాల్లో కోర్టుల జోక్యం పరిమితమని, ప్రభుత్వ విధానం ఏకపక్షం, వివక్షాపూరితం, రాజ్యాంగ, చట్టనిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు రుజువైతే తప్ప జోక్యం చేసుకోవాలని స్పష్టం చేసింది. కోవిడ్? 2019 ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతుబంధు పథకం నిధులు విడుదల చేయకపోవడం ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగమేనని పేర్కొంది. బడ్జెట్ కేటాయింపులు లేని మొత్తాన్ని చెల్లించాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొంది. 2019 రబీ, ఖరీఫ్ సీజన్‌లో నిలిపివేసిన రైతుబంధు సొమ్ము చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది .కొవిడ్ సమయంలో 2019లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు రైతుబంధు చెల్లించకపోవడాన్ని సవాలు చేస్తూ ఖమ్మం జిల్లా తల్లాడ మండలం తల్లాడ, తెలగారం గ్రామాలకు చెందిన టి.వెంకటనారాయణ మరో నలుగురు రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రైతుబంధు చెల్లించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. అప్పీలుపై విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.కొవిడ్ సమయంలో తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రభుత్వం సమర్పించిన వివరాల ద్వారా స్పష్టమవుతోందని ధర్మాసనం తెలిపింది. 2019 వానా కాలంలో 1.42 లక్షల మంది రైతులకు రూ.850.82 కోట్లు, యాసంగిలో 9.46 లక్షల మందికి రూ.2132.95 కోట్లు నిధులు విడుదల చేయలేదని స్పష్టం చేసింది. అయితే దీన్ని ఆధారంగా పిటిషనర్లు మాత్రమే ప్రత్యేకంగా వివక్షకు గురయ్యారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు అని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ నిధుల కేటాయింపులపై న్యాయ సమీక్ష పరిధిని

మిగతా 2లో..

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ కుట్ర

- హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేయాలని చూస్తున్నారు
- కళ్యాణ లక్ష్మిని పూర్తిగా రద్దు చేసే ప్రయత్నం జరుగుతోంది
- ఈ అన్యాయాన్ని బీఆర్ఎస్ తప్పక నిలదీస్తుంది
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నిరసనలకు కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్(జనంసాక్షి):**పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసా కు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేం దుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంతో పాటు కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజల ముం దుకు తీసుకెళ్లేందుకు రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు,

మిగతా 2లో..





## కాల్వలోకి దూసుకెళ్లిన కారు..

నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి.. ఒక గల్లంతు

పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలంలో తీవ్ర విషాదం

**తణుకు(జనంసాక్షి):** పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాల్వలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందగా.. ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఇరగవరం మండలం అయితంపూడి లాకుల సమీపంలో ఆదివారం ఉదయం అదుపు తప్పిన కారు నరసాపురం పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రానికి నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి కోసం గాలిస్తున్నారు.ఈ ప్రమాదంలో కోనసీమ

## రష్యాపై డ్రోన్ల వర్షం

- మాస్కోలోని పలు కీలక ప్రదేశాలే లక్ష్యంగా విరుచుకుపడ్డ ఉక్రెయిన్
- దాడుల కారణంగా రాజధాని లోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూసివేత

**మాస్కో(జనంసాక్షి):** రష్యాపై ఉక్రెయిన్ వెయ్యికిపైగా డ్రోన్లతో విరుచుకుపడింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు చేసిన దాడుల్లో ఎనిమిది వందల డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మాస్కోలోని పలు ప్రదేశాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. మాస్కో ఆయిల్ రిఫైనరీకి సమీపంలోనూ ఈ దాడులు జరగడంతో అక్కడ పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. భారీగా పొగ వ్యాపించింది. ఈ దాడుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. దాడుల కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దవ్వగా..మరికొన్ని ఆలస్యంగా



నడిచాయి. గత ఐదేళ్లలో కీవ్.. మాస్కోపై చేసిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటని రష్యా మీడియా కథనాలు వెల్లడించాయి. క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. క్రిమియాలోని క్షిపణి వ్యవస్థలపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. మరోవైపు తెల్లవారుజామున కీవ్‌లోని అనేక ప్రాంతాలపై రష్యా డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక నివాసాలు, దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి.

## మేధోమావోయిస్టులని విపక్షాలనుద్దేశించి అనలేదు

వివరణ ఇచ్చుకున్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ‘దిమాగీ నక్సల్స్’ అంటూ కొత్త చర్చకు తెరలేపారు ప్రధాని మోదీ. దేశంలో సాయుధ నక్సలిజాన్ని నిర్మూలించామని, అయితే మేధో నక్సలిజం ఇంకా పొంచి ఉందని, దాని నుంచి ప్రమాదం పోలేదని ప్రధాని హెచ్చరించారు. దీంతో అధికార పక్షంపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. ప్రధాని మోదీ ప్రతిపక్షాలనుద్దేశించి అనలేదని, మావోయిస్టు, వేర్పాటువాద భావజాలం ఉన్నవారిని ఉద్దేశించి అన్నారంటూ కేంద్రమంత్రి

మిగతా 2లో..

## కేరళలో భాజపాకు షాక్

పార్టీ ఉపాధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి నటుడు దేవన్ రాజీనామా



**తిరువనంతపురం(జనంసాక్షి):** భాజపా కేరళ ఉపాధ్యక్ష పదవికి నటుడు ఎస్.దేవన్ రాజీనామా చేశారు. అదేవిధంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని వదులుకుంటున్నట్లు చెప్పారు. అలప్పుళలోని ఓ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ప్రసంగం ముగింపు సమయంలో రాజీనామా విషయాన్ని ప్రకటించారు. తన నిర్ణయానికి సరైన వేదిక ఇదేనని భావిస్తున్నానని చెప్పారు.

మిగతా 2లో..

## షేక్ హసీనాను అప్పగించండి

మరోసారి భారత్‌ను కోరిన బంగ్లా

2లో..

# కల్తీ ఆహారం,డ్రగ్స్‌పై ఇక ఉక్కుపాదం

నిర్వహించనున్నారు. ఫుడ్ సేఫ్టీ ఉల్లంఘనలపై మరింత సమన్వయంతో చర్యలు తీసుకునే దిశలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో నకిలీ, నాణ్యత లేని మందుల అక్రమ రవాణా, విక్రయాలు, హోటళ్లు, దుకాణాల్లో జరిగే ఆహార కల్తీలకు టీజీ సేఫ్ అడ్డుకుంటోంది. టీజీ సేఫ్ పరిధిలో డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి.అధికార యంత్రాంగం ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా ఆహార కల్తీ ఆగడం లేదు. ఇంట్లో వండే ఆహార పదార్థాలే కాదు హోటళ్లలో కూడా కల్తీ బయటపడుతోంది. ఇటీవల కొన్ని హోటళ్లలో నాలుగైదు రోజులుగా నిల్వ చేసిన మటన్, చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటికీ ప్రజల నిర్లక్ష్యం కూడా కొంత కారణం అవుతోంది. ఇటీవల హైదరాబాద్ కాటేదాన్ కేంద్రంగా సాగుతున్న మసాలాల కల్తీ రాకెట్‌ను హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం బయటపెట్టింది. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేసి, ఏకంగా 25,300 కిలోల కల్తీ మసాలా దినుసులను స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ నగరంలో పుట్టగొడుగుల్లా కల్తీ ఆహారం పదార్థాల తయారీ కేంద్రాలు వెలిశాయని వీటిపై ఉక్కుపాదం మోపేందుకే సీపీ సజ్జనార్ సూచనతో 'హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్' ఏర్పాటు చేశారు. దానితో పాటు టీజీ సేఫ్‌ను సైతం ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత దేశవ్యాప్తంగా ఏకీకృత ఆహార ప్రమాణాలను నిర్దేశించేందుకు ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 స్థానంలో ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం-2006 ఎఫ్?ఎస్?ఎస్?ఏఐ వంటి సంస్థల ఏర్పాటుకు తోడ్పాటును అందించింది. అధికారులకు తనిఖీలు, నమూనాల సేకరణకు చట్టపరమైన అధికారాలను ఇచ్చింది. అయితే ప్రస్తుతం ఉన్న సవాళ్లను తట్టుకునేందుకు ఈ చట్ట పరిధి సరిపోవడం లేదు. అందువల్ల ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006ను యథాతథంగా కొనసాగిస్తూనే సంఘటిత రూపం దాల్చిన తీవ్రమైన కేసుల్లో నేర న్యాయవ్యవస్థను మరింత బలంగా అనుసంధానం చేయాలి. డబ్బులకు ఆశపడి విషపూరిత పదార్థాలను ఆహారంలో కలిపి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే కల్తీదారులను కేవలం నాణ్యతా ప్రమాణాల్లో స్వల్ప లోపాలకు బాధ్యులైన సాధారణ విక్రేతలతో చూడరాదు. అందుకు చట్టాలను పటిష్ఠం చేసి కల్తీదారులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి.

## ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో మా జోక్యం పరిమితం

సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిందని, ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యాలు, నిధుల లభ్యతవంటి అంశాలను ప్రభుత్వాలే నిర్ణయించాల్సి ఉంటుందని, కోర్టులు కాదని తేల్చిచెప్పిందని గుర్తు చేసింది. రైతుబంధు కింద నిధులు విడుదల చేయాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దుచేస్తూ ప్రభుత్వ అప్పీలును అనుమతించింది.

## కేరళలో భాజపాకు షాక్

– పార్టీ ఉపాధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి నటుడు దేవన్ రాజీనామా

రాష్ట్రానికి చెందిన పలువురు భాజపా నేతలు ఆ వేదికపై ఉన్న సమయం లోనే దేవన్ ఈ విషయాన్ని వెల్లడించారు.'కేరళ పీపుల్స్ పార్టీ' ఏర్పాటుతో రాజకీయాల్లోకి ప్రవేశించిన దేవన్.. 2020లో దీనిపేరును 'నవ కేరళ పీపుల్స్ పార్టీ'గా మార్చారు. 2021లో అమిత్ షాతో భేటీ అయిన వెంటనే తన పార్టీని భాజపాలో విలీనం చేశారు. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. అనంతరం పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించారు. ఈ క్రమంలో రెండు సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. శ్రీ నారాయణ గురు ఆదర్శాలను ప్రతిబింబించే రాజకీయాలనే తాను ఊహించుకున్నానని, ఐదేళ్లు పనిచేసినా దానిని సాధించలేకపోయానని దేవన్ అన్నారు. కొంతకాలంగా దీనిపైనే ఆలోచన చేశానని, చివరకు ఆత్మపరిశీలన చేసుకున్న తర్వాత రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

## మేధోమావోయిస్టులని విపక్షాలనుద్దేశించి అనలేదు

కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.ప్రధాని మోదీ వ్యాఖ్యల నేపథ్యంలో 'దిమాగీ నక్సల్ అయినందుకు గర్వంగా ఉంది'' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఓ పోస్ట్ పెట్టారు. దీనికి స్పందిస్తూ కిరణ్ రిజిజు పోస్ట్ పెట్టారు. "ప్రతిపక్ష నేతల్ని దిమాగీ నక్సల్స్ అని ప్రధాని మోదీ అనలేదు. 1. రాజ్యాంగాన్ని తిరస్కరిస్తు మావోయిస్టులకు మద్దతు ఇచ్చేవారు. 2.వేర్పాటు వాదాన్ని, ఆర్టికల్ 370ని సమర్థించేవారు. 4. భారత్ నుంచి ఈశాన్య రాష్ట్రాలను వేరు చేయాలని చూసేవారు మాత్రమే దిమాగీ నక్సల్స్" అని రిజిజు పేర్కొన్నారు. ఉపా కేసులో అరెస్టయిన శర్జీల్ ఇమామ్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2020లో దిల్లీలో జరిగిన అల్లర్ల ఘటనలో శర్జీల్ అరెస్టయ్యాడు.

ఇన్‌స్టాలో కొత్త పోస్టు... స్నేహితులతో ప్రధాని మోదీ..

రిజిజు వ్యాఖ్యలపై కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా విమర్శలు గుప్పించారు. 'సోదరా! ముందు మీరు నంబర్లు రాయడం నేర్చుకుని తర్వాత సమాధానాలు ఇవ్వండి. 1, 2 తర్వాత 3 వస్తుంది. 4 కాదు" అంటూ ఆయన పోస్ట్ పెట్టారు. "ఎంటైర్ పొలిటికల్ సైన్స్‌లో అంతే" అంటూ ఖేరా కామెంట్‌కు మరో కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ సెటైర్ వేశారు. అయితే, రిజిజు తన పోస్ట్‌ను తర్వాత సవరించి నంబర్‌ను సరిచేశారు.

## కాల్వలోకి దూసుకెళ్లిన కారు..

జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మీభానువికాస్ (18), నాగిరెడ్డి దుష్యంత్ సాయి(18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురంలోని చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలోని చింతపర్రుకి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) గల్లంతయ్యారు. ఆచంట మండలం వల్లూరుకి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయటపడ్డాడు.

**కొనసాగుతున్న గాలింపు**

వీరంతా పెరవలిలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పెరవలి నుంచి నరసాపురం బయలుదేరగా మార్గంమధ్యలోని ఓగిడిలో స్నేహితుడిని కలిశారు. అక్కడి నుంచి అయితంపూడి మీదుగా వెళ్తుండగా నరసాపురం వైపు తిరిగే క్రమంలో లాకుల వద్ద కారు అదుపు తప్పి ఎదుట పంట కాలువలోకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో వర్షం పడుతుండగా ప్రయాణ సమయంలో ఎదురుగా ఉన్న కాలువను గమనించకపోవడంతో కారు నేరుగా కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కాలువలో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో ప్రవాహ వేగానికి కారు సుమారు 100 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. సంతోష్ చెట్టు కొమ్మను పట్టుకోవడంతో స్థానికులు కాపాడారు. హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా అయితంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుష్యంత్ సాయి, మార్టేరు సమీపంలో సాయిసూర్యతేజ మృతదేహాలు దొరికాయి. రాజారాం చరణ్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. చరణ్ మినహా మిగిలిన వారంతా నరసాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అందరూ 20ఏళ్లలోపు యువకులే కావడంతో ఇరు జిల్లాల్లోనూ విషాదచాయలు అలుముకున్నాయి.

# ప్రతిపక్షనేత సభకు రావాలి

అహర్నిశలు కష్టపడుతున్నామని, కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ఆదాయం సరిపోతోందని రేవంత్ అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో విడతలవారీగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, విడతలవారీగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టే బా ధ్యత తనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మాయ మాటలు నమ్మి యువత మోసపోవద్దని, పోటీ పరీక్షలకు సన్నద్ధమై భవిష్యత్తును తీర్చిదిద్దుకోండని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు నుంచి హనుమకొండ వచ్చిన రేవంత్ రెడ్డి, పరకాలలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పరకాలలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కానిస్టేబుల్ పోస్టులకు విడతలవారీగా నోటిఫికేషన్లు ఇస్తామని, ఖాళీగా ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. యువత ఆత్మబలిదానాలు చేసి తెలంగాణ సాధించుకున్నారని అన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబం యువతను రెచ్చగొట్టిందని, మొన్న తెలంగాణ భవన్‌లో రక్తదాన కార్యక్రమం చేపట్టారని, రక్తదాన కార్యక్రమంలో కేటీఆర్, హరీశ్‌రావు చుక్క రక్తం ఇవ్వలేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు రక్తం ఇస్తే అమ్ముకొని కోట్ల రూపాయలు సంపాదించారని సీఎం రేవంత్?రెడ్డి ఆరోపించారు.పరకాలలో ప్రజాపాలన – ప్రగతిబాట కార్యక్రమానికి వేలాదిగా మహిళలు వచ్చారన్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాంత సమస్యల పరిష్కారానికి ఎన్నోసార్లు తనను, మంత్రులను కలిసేవారని గుర్తు చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి వల్లే ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని, వరంగల్ పోరాటాల గడ్డ అని సీఎం కొనియాడారు. ఈ ప్రాంతంలో ప్రజలకు చైతన్యం ఉందని, ఆలోచన ఉందన్నారు. యశస్విని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారని అభినందించారు.మట్టిలో కలిసినా, సరే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రోజుకు 18 గంటలు పని చేస్తున్నామని, 32 నెలల్లో మూడు రోజులైనా సెలవు తీసుకున్నానా అని అడిగారు. రైతు రుణమాఫీ చేస్తానని రెండుసార్లు కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. రైతురుణ విముక్తి కలిగిన రాష్ట్రంగా తెలంగాణను మార్చామని పేర్కొన్నారు. "కుట్టుమిషన్లతో పాటు స్కూల్ పిల్లలకు బట్టలు కుట్టే అవకాశం మహిళలకు కల్పించాం. ఆడబిడ్డలకు కష్టం వస్తే చూస్తు ఊరుకున్నానా?. రక్తం పంచుకు పుట్టకపోయినా సీతక్కను సొంత ఆడబిడ్డగా



చూస్తాం. ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే కేటీఆర్ బయటకు నెట్టారు. కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారు. సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే తండ్రి మౌనంగా ఉన్నారు" అని సీఎం రేవంత్ అన్నారు.

### రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయ అభివృద్ధి

వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు. రక్తం పంచుకు పుట్టకపోయినా మంత్రి సీతక్కను సొంత ఆడబిడ్డగా చూసుకుంటున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే బయటకు నెట్టారని విమర్శించారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా? అని ప్రశ్నించారు. కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారని, సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఆవిష్కరించిన సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రులతో కలిసి పరిశీలించారు. సీఎం సమక్షంలో కలెక్టర్ హేమంత్ బోర్ఖడే కొత్త కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ హేమంత్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

వనదేవతలను దర్శించుకున్న రేవంత్ రెడ్డి

అంతకు ముందు ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు.అనంతరం ఒంటరి మహిళలు, వితంతువుల కోసం ఉద్దేశించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మేడారం వేదికగా ప్రారంభించారు. ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం, పలువురికి కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మేడారం ప్రాంగణంలో మొక్కలు నాటిన రేవంత్ రెడ్డి మహిళలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం

మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.

ములుగును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం: మంత్రి సీతక్క

ముందుగా మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ,ములుగు జిల్లా, ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతమైన ములుగును హైదరాబాద్ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.నూతన కలెక్టరేట్ కార్యాలయ ప్రారం భోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్క?సారలమ్మ సన్నిధిని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం, ములుగు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పలుమార్లు ఈ ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ములుగు నియోజకవర్గానికి రాష్ట్రంలో అత్యధికంగా 5 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం ఈ ప్రాంతంపై ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.సాగునీటి రంగంలో పొట్లపల్లి ఎత్తిపోతల పథకం, రామప్ప?లక్నవరం అనుసంధాన పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సమ్మక్క?సారలమ్మ సన్నిధి అభివృద్ధితో పాటు జిల్లాలో విద్య, వైద్యం, పర్యాటకం, గృహ నిర్మాణం, సాగునీరు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కట్టుబడి పనిచేస్తున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య, మేడారం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి,ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## అది కమ్యూనికేషన్ గ్యాప్



పంచుకున్నారు. "తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదు. కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉంది" అని విమర్శించారు. వందేమాతరం పూర్తి గేయాన్ని ఎందుకు వేశారంటూ కార్యకర్తల్ని సోనియా ప్రశ్నించారని, అది ఎంతో సిగ్గుచేటు అని భాజపా అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ మండిపడ్డారు. భాజపా విమర్శలకు కాంగ్రెస్ వివరణిచ్చింది. వివాదమేమీ లేదని కొట్టిపారేసింది. ఎక్కువసేపు నిల్చొని ఉన్న ఖర్గేకు కుర్చీ వేయాల్సిందిగా సోనియా సైగ చేశారని, గేయాన్ని ఆపాలని కాదని స్పష్టం చేసింది.

## సోనియా వందేమాతరాన్ని అవమానపరిచారు

తరలించారు. ఈ అరెస్టులకు నిరసనగా వందల మంది కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఇదీ చదవండి: కాంగ్రెస్ కార్యాలయంలో పూర్తి వందేమాతరంపై వివాదం


## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ కుట్ర

రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. కల్యాణలక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ ఇప్పుడు ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో, ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కల్యాణలక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు. చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అవినీతి వంటి హైడ్రా వంటి అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీ మొత్తాలు చెల్లించి వాదించే ప్రభుత్వం, ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకాన్ని కాపాడుకునే విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రశ్నించారు.హైకోర్టు తీర్పును ఇప్పుడు సాకుగా చూపుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే కేసీఆర్ హయాంలో అమలైన పలు సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేసిన కాంగ్రెస్, ఇప్పుడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను కూడా రద్దు చేయాలని చూస్తోందని విమర్శించారు."ఆడబిడ్డ భారం కాదు.. భరోసా" అనే భావనకు కేసీఆర్ ప్రభుత్వం రూపమిచ్చిందని కేటీఆర్ అన్నారు. అలాంటి పథకాలను రద్దు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి తులం బంగారం వంటి హామీలతో ఓట్లు పొందిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని మరిచిపోయిందని మండిపడ్డారు.రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసనల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదింటి ఆడబిడ్డల పక్షాన తమ గళాన్ని వినిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. "కల్యాణలక్ష్మి ఏమైంది? షాదీ ముబారక్ ఏమైంది? ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?" అంటూ కాంగ్రెస్ నేతలను ప్రజలు ప్రశ్నించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆడబిడ్డల కోసం కేసీఆర్ చేసిన సంక్షేమ కార్యక్రమాలను కాపాడుకుందాం.. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించేలా ఒత్తిడి పెంచేందుకు పోరాడుదాంని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## షేక్ హసీనాను అప్పగించండి

### మరోసారి భారత్‌ను కోరిన బంగ్లా

ఢాకా(జనంసాక్షి):తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ మరోసారి భారత్‌ను కోరింది. బంగ్లా ప్రధాని తారిఖ్ రెహమాన్ దిల్లీ పర్యటనపై అనిశ్చితి నెలకొన్న వేళ ఈ అంశాన్ని మరోసారి లేవనెత్తింది. ప్రధాని పర్యటన ముందు అనుకూలమైన వాతావరణం కోరుకుంటున్నామని పేర్కొంది. పరోక్షంగా హసీనా అప్పగింత



అంశాన్ని ముడిపెట్టింది. త్వరలో దిల్లీ వేదికగా బ్రిక్స్ సమావేశానికి రెహమాన్ హాజరవ్వటంపై ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి షాహిదుల్ కరీమ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ప్రధాని రెహమాన్ భారత్ పర్యటనపై గత కొన్ని వారాలుగా ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. షేక్ హసీనా బహిరంగ సమావేశం వల్ల కొంత అడ్డంకి ఏర్పడింది. షేక్ హసీనాతో పాటు ఇతర నేరస్థులను ఢాకాకు అప్పగించాలని భారత్‌ను కోరుతున్నాం. ఢాకా ప్రతిపాదనలకు భారత్ సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం. పర్యటనకు ముందు అనుకూల వాతావరణం నెలకొనాలని భావిస్తున్నాం. భారత్ స్పందన కోసం ఎదురు చూస్తున్నాం" అని కరీమ్ పేర్కొన్నారు. ఇదే విషయంపై ఇటీవల భారత్ హై కమిషనర్‌ను రహమాన్ కలిశారు. దిల్లీ పర్యటనకు ఆయన రావడంపై స్పష్టత ఇవ్వలేదని సమాచారం.

# గాంధీనగరం గురుకులంలో ర్యాగింగ్!

- టెన్త్ విద్యార్థులపై ఇంటర్ విద్యార్థుల అఘాయిత్యం..
- అర్ధరాత్రి బట్టలు విప్పాలంటూ వెకిలి చేష్టలు..
- నిరాకరించినందుకు విచక్షణారహితంగా దాడి
- భయంతో అడవిలో తలదాచుకున్న విద్యార్థులు
- బాధితుల తల్లిదండ్రులు కళాశాల వద్ద ఆందోళన
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం..



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లాలో ర్యాగింగ్ భూతం పడక విప్పింది. సీనియర్లు అనే అహంకారం సాటి విద్యార్థుల పట్ల విషం చిమ్మింది. అడ్డు వచ్చిన అధ్యాపకులను సైతం పక్కకు నెట్టేసి కర్రలతో ఇంటర్ విద్యార్థులు సాగించిన విధ్వంసం గ్యాంగ్ వార్‌ను తలపించడం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని గాంధీపురం బాలుర గురుకుల పాఠశాల కళాశాల లో శనివారం అర్ధరాత్రి ర్యాగింగ్ కలకలం రేపింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అదే ప్రాంగణంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల గదిలోకి అర్ధరాత్రి ప్రవేశించారు. బట్టలు విప్పి చీరలు కట్టుకొని తమ ముందు డాన్స్ వేయాలంటూ ఒత్తిడి చేశారు. అందుకు ససేమిరా అన్న పదవ తరగతి విద్యార్థులపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడడం తీవ్ర వివాదంగా మారింది. అందుబాటులో ఉన్న కర్రలను, బెంచి బల్లాలను తీసుకొని దాడికి తెగబడడంతో భయాందోళనకు గురైన పదవ తరగతి విద్యార్థులు అరుపులు కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీశారు. ఆ క్రమంలో దాడిని అడ్డుకునేందుకు ఒకరిద్దరు టీచర్స్ ప్రయత్నించినప్పటికీ వారిని పక్కకు నెట్టేసినట్లు తెలిసింది. సీనియర్ల దాడితో బెంబేలెత్తిన జూనియర్లు అడవిలోకి పరుగులు తీసి తెల్లారే వరకు అక్కడే తలదాచుకున్నట్లు సమాచారం. ఉదయం దాడి ఘటన గురించి తెలుసుకున్న బాధితుల తల్లిదండ్రులు హుటాహుటిన కళాశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. అర్ధరాత్రి ఇంటర్ విద్యార్థులు దాడులకు తెగబడితే ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదంటూ నిలదీశారు. అసలు ప్రిన్సిపాల్ అక్కడికి వెళ్లారంటూ ప్రశ్నించారు. ఘర్షణ తీవ్రస్థాయికి చేరిన సమయంలో అందుబాటులో లేకపోవడం ముమ్మాటికీ బాధ్యత రాహిత్యమంటూ, తక్షణమే క్రమశి క్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాలలో తల్లిదండ్రుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు గురుకులం వద్దకు చేరుకొని ఇరు వర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది.

# రేషన్ కార్డుల పేరిట రూ.100 కోట్లు దుర్వినియోగం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే దాసోజు శ్రవణ్ ఆగ్రహం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలోని నిరుపేదల ఆకలి తీరే రేషన్ కార్డులను తమ సొంత రాజకీయ ప్రచార కరపత్రాలుగామార్చుకొని , పేదల రక్తం పంచుకున్న ప్రజాధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బరితెగించి దుర్వినియోగం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న ఆగస్టు 15న సంగారెడ్డితో పాటు 119 నియోజకవర్గాల్లో ప్రారంభించిన 1.05 కోట్ల లామినేటెడ్ రేషన్ కార్డుల పంపిణీ పేరిట జరిగిన భారీ దుబారాపై ఆయన ఘాటుగా స్పందించారు. మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె! రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడానికి నిధులు లేవని, ఉద్యోగుల పెన్షన్లు, గ్రాట్యుటీ బకాయిలు చెల్లించలేమని చేతులెత్తేసిన ఈ అసమర్థ ప్రభుత్వం.. ఇప్పటికే ఉన్న ఈ-కార్డులను రద్దు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫోటోలతో కూడిన లామినేటెడ్ కార్డుల కోసం ఏకంగా 100 కోట్ల రూపాయలు తగలేయడం సిగ్గుచేటు అని దాసోజు విమర్శించారు. క్లౌడ్ సర్వర్లు, స్పెషల్ వెబ్‌సైట్లు, ప్రింటింగ్, లామినేషన్, 33 జిల్లాల్లో రవాణా పేరిట ఒక్కో కార్డుకు దాదాపు 100 చొప్పున ప్రజల జేబులు కొట్టి సొంత డబ్బా కొట్టుకుంటున్నారు.

# 2027 జనాభా లెక్కల్లో సమగ్ర గణనకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలి

- ఓబీసీ, ఎస్ఈబీసీలకు న్యాయం చేయండి
- ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ




**హైదరాబాద్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** 2027 జనాభా లెక్కల్లో ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీ), సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు (ఎస్ఈబీసీ) జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రికి రాసిన లేఖలో ఓబీసీ, ఎస్ఈబీసీ వర్గాల కులగణనకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. వెనుకబడిన వర్గాల వాస్తవ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన విశ్వసనీయమైన సమాచారం అందుబాటులో ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యం వంటి విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఓబీసీ, ఎస్ఈబీసీలకు ప్రత్యేక కేటగిరీలు ఉన్నట్లుగానే జనాభా లెక్కల ప్రశ్నావళిలో వాదీజ/రాజుదీజలకు కూడా స్పష్టమైన ప్రత్యేక కేటగిరీని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. కేవలం వ్యక్తులు తమ కులం పేరును నమోదు చేయడం ద్వారా వాదీజ/రాజుదీజ గుర్తింపు అనంతరం అధికారిక వర్గీకరణపై ఆధారపడే పరిస్థితి రాకుండా ముందుగానే స్పష్టమైన విధానం రూపొందించాలని సూచించారు. 2011 సామాజిక-ఆర్థిక, కుల గణనలో కులాల పేర్లను ఓపెన్-ఎండెడ్ విధానంలో నమోదు చేయడం వల్ల స్పెల్లింగ్, స్థానిక పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాలు, ఉచ్చారణలోని తేడాలతో అనేక రకాల కులపేర్లు నమోదైన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. 2027 జనాభా లెక్కల్లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రమాణీకృత విధానాన్ని అవలంబించాలని కోరారు. తెలంగాణలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(ఎస్ఈఈపీసీ) 2024-25 ద్వారా ఇంటింటి స్థాయిలో నిర్మిత డేటా సేకరణ, కుల సమాచారాన్ని పద్ధతిగా నమోదు చేయడం, వెనుకబడిన వర్గాల వర్గీకరణలో అనుభవం లభించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ అనుభవాలను జాతీయ స్థాయిలో 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. దేశంలో సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, విద్యా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, లక్ష్యిత సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు విశ్వసనీయమైన కులవారీ జనాభా సమాచారం ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. జనాభా లెక్కల దశలోనే విధానపరమైన స్పష్టత లేకపోతే, భవిష్యత్తులో ఆ డేటా వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. 2027 జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభమయ్యే ముందే వాదీజ/రాజుదీజల గణనకు సంబంధించి అవసరమైన పద్ధతులు, సాంకేతిక ప్రమాణాలు, డేటా రక్షణ చర్యలను అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రిని కోరారు. ఈ చర్యల ద్వారా దేశంలోని వెనుకబడిన వర్గాల జనాభా వాస్తవికతను సమర్థవంతంగా నమోదు చేసి, భవిష్యత్ విధాన నిర్ణయాలకు ఉపయోగపడే శాస్త్రీయ డేటాను అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

# ఏటీసీలతో యువతకు ఉద్యోగావకాశాలు

- మారుమూల ప్రాంతాల యువతకు సైతం ఆధునిక సాంకేతిక విద్య
- మంత్రి జి. వివేక్ వెంకటస్వామి



**మహబూబ్‌నగర్, బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి ):** మారుమూల ప్రాంతాల్లోని యువతకు సైతం ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనులు, భూగర్భ శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం పల్లమడి గ్రామంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధునిక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పల్లమడి ప్రాంతానికి త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, తద్వారా చుట్టుపక్కల గ్రామాల యువత కూడా ఈ శిక్షణ కేంద్రానికి చేరుకుని నైపుణ్య శిక్షణ పొందే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు మారుమూల ప్రాంతాలకు చేరినప్పుడే అక్కడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. నిర్మాణ రంగంతో పాటు మేస్త్రీలు, టైల్స్ పనివారు, ఎలక్ట్రీషియన్లు వంటి వివిధ వృత్తి నిపుణులకు కూడా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని మంత్రి అన్నారు. సాధారణంగా రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వచ్చే ఉద్యోగాలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని అధిక వేతనాలు పొందేలా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ దిశగా ముందుకు సాగుతోందని, ఇప్పటికే సుమారు లక్ష ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. ఇందులో సుమారు 50 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు, వైద్య రంగంలో అవసరాలకు అనుగుణంగా సుమారు 10 వేల నర్సింగ్ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు వివరించారు.

### మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో యువత కూడా కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలని మంత్రి సూచించారు. ఒకప్పుడు వార్తల కోసం పత్రికలపై ఆధారపడగా, తర్వాత టెలివిజన్, ప్రస్తుతం సోషల్ మీడియా ప్రధాన సమాచార వేదికలుగా మారాయని అన్నారు అదేవిధంగా ఆటోమొబైల్ రంగంలో పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల దిశగా మార్పు జరుగుతోందని, ఈ మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

### రూ.4 వేల కోట్లతో 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.4 వేల కోట్ల వ్యయంతో 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ఉన్న 65 ఐటీఐలను కూడా ఆధునీకరించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, రోబోటిక్స్, జబీజ మెషిన్ ఆపరేషన్ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. వ్యవసాయ రంగంలోనూ ఆధునిక పద్ధతులు, అగ్రో ప్రాసెసింగ్ వంటి అంశాల్లో శిక్షణ పొందే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఆధునిక నైపుణ్యాలతో పాటు విదేశీ భాషలను నేర్చుకుంటే జర్మనీ, జపాన్, యూరప్ తదితర దేశాల్లో కూడా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని మంత్రి అన్నారు. ఆయా దేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలతో పాటు జర్మన్, జపనీస్ వంటి భాషల్లో శిక్షణ పొందాలని యువతకు సూచించారు. ఏటీసీ కేంద్రాల్లో శిక్షణ పొందిన యువతకు విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వచ్చే ఏడాది తాను తిరిగి ఈ ప్రాంతానికి వచ్చే సమయానికి కనీసం 100 మంది యువతకు శిక్షణ అందించి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. జపాన్‌లోనూ నైపుణ్యం కలిగిన ఇంజనీర్లకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏటీసీ కేంద్రాల్లో శిక్షణ పొందే విద్యార్థులకు ప్రభుత్వం నెలకు రూ.2,000 స్టైఫండ్ అందించాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు.

యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణను పూర్తి చేసి ఉద్యోగాలు పొందాలని, గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను నైపుణ్య శిక్షణ వైపు ప్రోత్సహించాలని ఆయన కోరారు. కష్టపడి చదివి, ఆధునిక నైపుణ్యాలు నేర్చుకుని, విదేశీ భాషలను అభ్యసిస్తే అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు పొందడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఏటిసి 100 మంది విద్యార్థులతో విజయవంతంగా నడిపిస్తే, వచ్చే సంవత్సరం మరొక ఏటీసీ సెంటర్ మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. అలాగే దేవరకద్ర నియోజకవర్గంలో బీడీ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వారి ఆరోగ్య పరిరక్షణ కొరకు ఈఎస్ఐ డిస్పెన్సరీ మంజూరు సంబంధించిన ప్రతిపాదనలు సంబంధిత శాఖ కార్యదర్శి కి పంపడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రాష్ట్ర ఉపాధి, శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేష్, జాయింట్ డైరెక్టర్ నరేష్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, జిల్లా ఉపాధి కల్పన అధికారి మైత్రి ప్రియ, సి సి. కుంట తహసిల్దార్ ఎల్లన్న, మహమ్మద్ అల్తాఫ్ అసిస్టెంట్ కమిషనర్ లేబర్, సి.సి. కుంట ఎం.పి.డి.వ.ఓ అనురాధ, పల్లెమర్రి సర్పంచ్ ఏ. లక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈజీ మనీ కోసం వరుస హత్యలు

- మరో నలుగురి హత్యకు పన్నాగం
- పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు
- వీడిన మహిళా హత్య కేసు మిస్టరీ.. తల్లి, కొడుకు అరెస్ట్







సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి) ఆగస్టు 16 : ఒంటరి మహిళలు, కుటుంబ సమస్యలతో ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారం కోసం హత్యలకు పాల్పడుతున్న తల్లి, ఆమె మైనర్ కుమారుడి వ్యవహారం సిద్దిపేట జిల్లాలో కలకలం రేపింది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామక్కపేట గ్రామ శివారులో కాలిపోయిన స్థితిలో లభించిన మహిళ మృతదేహం కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదివారం సీపీ కార్యాలయంలో ఏసీపీ రవీందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వారం రోజుల క్రితం రామక్కపేట గ్రామ శివారులో మహిళ మృతదేహం కాలిపోయిన స్థితిలో గుర్తించగా, ఆమెను అక్బర్‌పేట-భూంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన అధికం విజయ (45)గా గుర్తించినట్లు తెలిపారు.

### కిరాణా షాపులోనే హత్య

విజయ హత్యపై సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్ పోలీసుల బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేపట్టగా నమ్మలేని నిజాలు బయటపడ్డాయని సీపీ తెలిపారు. అదే డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న చాకలి రజిత తన మైనర్ కుమారుడి సహకారంతో విజయను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. గత ఆదివారం సాయంత్రం తన దుకాణానికి వచ్చిన విజయను కుమారుడి సహాయంతో గొంతు నులిమి హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని అపహరించినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని దుకాణంలోనే ఉంచి, బంగారాన్ని స్థానిక గోల్డ్ షాపులో విక్రయించినట్లు చెప్పారు. వచ్చిన డబ్బుతో పెట్రోల్ కొనుగోలు చేసి, రాత్రి సమయంలో మృతదేహాన్ని బ్యాగులో కుక్కి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై రామక్కపేట గ్రామ శివారుకు తీసుకెళ్లి తగులబెట్టినట్లు సీపీ వివరించారు.

### మరో మహిళ హత్యలోనూ ఇదే తల్లి, కొడుకు

విజయ హత్యతో పాటు గత మే నెలలో అదే డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన వివాహిత కుంట రేఖను కూడా ఇదే తల్లి, కొడుకు హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని సీపీ తెలిపారు. రేఖను కూడా దుకాణానికి వచ్చిన సమయంలో హత్య చేసి, మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా శివారులోని అచ్చుమాయపల్లి అటవీ ప్రాంతానికి తరలించి కాల్చివేసినట్లు పేర్కొన్నారు. రేఖ కుటుంబ సభ్యులు మిస్సింగ్ ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులను సైతం తల్లి, కొడుకు తప్పుదోవ పట్టించినట్లు సీపీ తెలిపారు.

### సర్పంచ్‌పై దాడి.. బంగారం అపహరణ

గత ఏడాది జూన్‌లో ప్రస్తుత భూంపల్లి సర్పంచ్ అన్నపూర్ణ వాకింగ్‌కు వెళ్తున్న సమయంలో ఆమె తలపై రాయితో దాడి చేసి బంగారం అపహరించినట్లు విచారణలో నిందితులు అంగీకరించినట్లు సీపీ వెల్లడించారు. ఇంతటితో ఆగకుండా డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మరో నలుగురిని హత్య చేసేందుకు కూడా తల్లి, కొడుకు పథకం సిద్ధం చేసుకున్నట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు.

### భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం

నిందితుల నుంచి రూ.1.03 లక్షల నగదు, 5.61 తులాల బంగారం, 53 తులాల వెండి, టీవీఎస్ ఎక్సెల్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. కేసులో నిందితురాలైన రజితను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు, ఆమె మైనర్ కుమారుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీపీ వివరించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్ పోలీసు బృందాలను పోలీసు అధికారులు అభినందించారు.

# అథ్లెటిక్స్ కోచ్ తిరుమల రావు బొరాడి అథ్లెట్లకు పతకాల పంట..



**హైదరాబాద్ (జనం సాక్షి) :** మేడ్చల్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన 37వ సౌత్‌జోన్ సెలక్షన్ కం టోర్నమెంట్-2026లో మేడ్చల్ జిల్లా అథ్లెట్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. 200 మందికి పైగా అథ్లెట్లు పాల్గొన్న ఈ పోటీల్లో పలు విభాగాల్లో పతకాలు సాధించారు. గణేష్ అండర్-18 హెప్టాథ్లాన్‌లో స్వర్ణం, అభినయశ్రీ 60 మీటర్లలో రజతం, లాంగ్‌జంప్‌లో స్వర్ణం సాధించారు. పి. నమృత్ జావెలిన్‌త్రోలో రజతం, బి. వెంకటేష్ ట్రయాథ్లాన్ 'సి'లో కాంస్యం, బి. సాత్విక్ డెకాథ్లాన్‌లో స్వర్ణం సాధించారు. డి. దినేష్, డి. సిద్దు హైజంప్‌లో స్వర్ణాలు సాధించారు. కె. కైలాష్ 400 మీటర్లలో, కె. ఇషాన్ వర్మ లాంగ్‌జంప్‌లో రజతాలు సాధించారు. ఎన్. చింటూ 1000 మీటర్లలో రజతం, 100 మీటర్లలో కాంస్యం సాధించారు. పి. ధనుష్ షాట్‌పుట్‌లో రజతం, ఎస్. అరుణ్ కుమార్ డిస్కస్ త్రో, హైజంప్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఎస్. లోకేష్ హైజంప్‌లో, డి. యోగి ట్రయాథ్లాన్ 'బి'లో 6వ స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఈ నెల 26, 27 తేదీల్లో జేఎన్ఎస్ హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మేడ్చల్ జిల్లా తరఫున పాల్గొననున్నారు. అథ్లెట్లు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోచ్ తిరుమల రావు బొరాడి ఆకాంక్షించారు.

# ప్రజావాణిలో మైనారిటీలు భాగస్వాములు కావాలి


**మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా పిలుపు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో మైనారిటీలు పెద్ద సంఖ్యలో భాగస్వాములై తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రతి మండలంలో మైనారిటీలకు స్మశాన వాటికలు, ఈద్గా ప్రార్థనా స్థలాలకు అవసరమైన స్థలాలను కేటాయించేలా అధికారులకు వినతిపత్రాలు అందించాలని సూచించారు. మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఆక్రమణ లకు గురైన వక్ఫ్ భూములను గుర్తించి, వాటిని రక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాలని తెలిపారు.

# నేడు డా॥ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభోత్సవం

**ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**



హైదరాబాద్: సనత్‌నగర్‌లో నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా. ఎంసీఆర్ టిమ్స్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డా. ఎంసీఆర్ టిమ్స్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్పిటల్ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్యశాఖ, పోలీస్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, సమాచార పౌర సంబంధాల శాఖ, ట్రాఫిక్ పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వైద్యులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు, ఇతర అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమ వేదిక, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సెక్యూరిటీ, ప్రజల రాకపోకలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ట్రాఫిక్ పోలీసులను మంత్రి ఆదేశించారు. వాహనాల పార్కింగ్, అతిథులు, ప్రజాప్రతినిధుల రాకపోకలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పోలీస్, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమ ప్రాంగణంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, బందోబస్తు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలను ముందుగానే పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా హాస్పిటల్ పరిసరాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. "డా. ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభోత్సవం తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో ఒక ముఖ్యమైన కార్యక్రమం. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డా. ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, అదనపు డీసీపీ (ట్రాఫిక్) వేణుగోపాల్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం.. టీజీ సేఫ్ అడ్డుకట్ట వేసేనా?

"అందు ఇందు ఇందు గలదని సందేహము వలదు.. ఎందెందు చూసినా అందందే గలదు" అని పోతన భగవంతుని సర్వవ్యాప్తిని కీర్తించాడు. నేటి సమాజంలో ఆ మాటలను మరో రకంగా అన్వయించాల్సిన దుస్థితి. ఎక్కడ చూసినా కల్తీ.. ఏది కొన్నా అనుమానమే!

బియ్యం నుంచి పాలు, నూనె నుంచి నిత్యావసర సరుకులు, పండ్లు నుంచి కూరగాయల వరకు.. కల్తీ వ్యాపారం విస్తరిస్తోంది. అసలేంటో.. నకిలీ ఏంటో.. కల్తీ ఏంటో గుర్తించలేని పరిస్థితిలో సామాన్యుడు తన కష్టార్జితాన్ని ఖర్చు చేసి, చివరికి ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నాడు.

ఇది కేవలం వ్యాపారుల దురాశతో ఆగిపోవడం లేదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, అవినీతి, పర్యవేక్షణ లోపాలు కల్తీ దందాకు మరింత బలం చేకూరుస్తున్నాయన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తనిఖీలు ఎక్కడైనా క్రమం తప్పకుండా సాగుతున్నాయా? లేక ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్నారా? దాడులు, నమూనాల సేకరణ, కేసులు.. ఆ తర్వాత మళ్లీ పాత కథేనా?

సంపాదకీయం

కల్తీ మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన వ్యవస్థే బలహీనపడితే, ప్రజలకు రక్షణ ఎక్కడ?

కల్తీ అంటే కేవలం మోసం కాదు.. అది ప్రజారోగ్యంపై దాడి. నాసిరకం లేదా కలుషిత ఆహారం దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. అయినా కొందరు అక్రమ వ్యాపారులు లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిలి'టీజీ సేఫ్'లిలిపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. నకిలీ, కల్తీ ఆహార పదార్థాల నియంత్రణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఏర్పాటైన ఈ వ్యవస్థ నిజంగా ఎంత ప్రభావవంతంగా పనిచేస్తుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

పేరు మారితే వ్యవస్థ మారదు. బోర్డు మారితే కల్తీ ఆగదు. అధికారుల పని తీరే మారాలి. టీజీ సేఫ్ కేవలం ఆకస్మిక దాడులు, ఫొటోలు, ప్రకటనల సంస్థగా మిగిలిపోకూడదు. కల్తీ ఎక్కడ జరుగుతుందో అక్కడికి నిరంతర నిఘా చేరాలి. నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపడంతోనే పని పూర్తయిందనుకోకూడదు. ఫలితాలు ఏమయ్యాయి? నిందితులపై ఏ చర్యలు తీసుకున్నారు? కేసుల పరిస్థితి ఏమిటి? ప్రజలకు తెలియాలి.

ముఖ్యంగా మామూళ్లకు అలవాటుపడిన నిఘా వ్యవస్థపై కూడా నిఘా ఉండాలి. కల్తీ వ్యాపారులతో కుమ్మక్కయ్యే అధికారులపై కూడా అదే స్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుంది.

కల్తీదారులకు జరిమానాలు చెల్లించి బయటపడే వెసులుబాటు ఉంటే ఈ దందా ఎప్పటికీ ఆగదు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే కల్తీని తీవ్రమైన నేరంగా పరిగణించి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు ఉండాలి.

టీజీ సేఫ్ ముందు ఇప్పుడు పెద్ద సవాలే ఉంది. కల్తీ మాఫియాపై నిజంగా కొరడా ఝుళిపిస్తుందా? అధికారుల అవినీతిపై కూడా ఉక్కుపాదం మోపుతుందా? లేక మరో కొత్త వ్యవస్థగా ఏర్పడి.. కొంతకాలానికి పాత వ్యవస్థలాగే మారిపోతుందా?

ప్రజలకు కావాల్సింది కొత్త పేరు కాదు.. నమ్మదగిన రక్షణ వ్యవస్థ.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ దందాకు టీజీ సేఫ్ నిజంగానే అడ్డుకట్ట వేస్తుందా? లేక ఇది కూడా మరో ప్రకటనగానే మిగిలిపోతుందా? కాలమే సమాధానం చెప్పాలి.

# ప్రశ్నగా పుట్టిన తరం



*ప్రశ్నగా పుట్టిన తరం చీకటిని చీల్చే వెలుగై*
*నేహా గొంతు నేడు నెత్తుటి నాడిని తట్టే గీతై*
*మౌనపు సంకెళ్లను తెంచి మైదానంలోకి వస్తున్న యువతరం – జవాబు అడిగే వేళ వచ్చింది*
*ఇక జవాబు చెప్పాల్సిందే!*

కొన్ని గొంతులు సభ అయిపోగానే సద్దుమణిగిపోతయ్. మరికొన్ని గొంతులు పేపర్ల హెడ్డింగుల్లో ఒకట్రెండు రోజులు మెరిసి మాయమై పోతయ్. కొన్ని గొంతులు మాత్రం మనం దాటవేయాలనుకున్న ప్రశ్నను పట్టుకొచ్చి మన ముంగిట నిలబెడతయ్. నేహా బోరా గొంతు అలాంటిదే. ఆమెను ఇష్టపడొచ్చు, ఆమెతో విభేదించొచ్చు, ఆమె రాజకీయాలను విమర్శించొచ్చు. కానీ, ఆమె అడిగే ప్రశ్నల్ని మాత్రం "అబ్బే... ఇవన్నీ మామూలే" అంటూ కొట్టిపారేయటం సాధ్యం కాదు. అవి నేహా ఒక్కదాని ప్రశ్నలు కావు కాబట్టి. అవి ఒక తరం గుండెల్లో గూడు కట్టుకున్న ప్రశ్నలు.

దేశంలో యువత గురించి మాట్లాడేటప్పుడు అధికారానికి ఒక విచిత్రమైన అలవాటు ఉంది. "యువతే దేశ భవిష్యత్తు", "యువతే దేశ బలం", "యువతే రేపటి భారత్" అంటది. అది బాగానే ఉంది. అదే యువత "అన్నా... ఉద్యోగం ఎక్కడ?" అంటే ముఖం చిట్లుతుంది. "ఫీజులు ఇంతెందుకు పెంచుతున్నరు?" అంటే అనుమానం. "పరీక్ష పేపర్ లీక్ అయితే మా గతి ఏంది?" అంటే రాజకీయ కుట్ర! "యూనివర్సిటీలో మా గొంతుకే చోటు లేదా?" అంటే దేశద్రోహం! ఇందులోనే అసలు మతలబు ఉంది. మాట్లాడని యువత అధికారానికి ముద్దుబిడ్డ లాంటిది. మాట్లాడే యువత మాత్రం "ఎక్కడో ఎవరో రెచ్చగొడుతున్నరు" అనే అనుమానపు కళ్లతో చూడబడుతుంది. అంటే ఏమిటి! గొంతు ఉంటే గండమేనా? ప్రశ్న ఉంటే పాపమేనా? ఇది బహిరంగ రహస్యం. నేహా బోరా ఈ వైరుధ్యాన్ని తన రాజకీయ ఉనికితోనే బయటపెడుతోంది. ఆమెను కేవలం 'ఫైర్‌బ్రాండ్' అని పిలిస్తే సరిపోదు. అది ఆ అమ్మాయిని ఒక వ్యక్తిగత ఇమేజ్‌లో బంధించడమే. అసలు ముచ్చట ఇక్కడుంది. ఒక విద్యార్థి నాయకురాలి మాటలు ఇంత దూరం ఎందుకు పోతున్నయ్? క్యాంపస్‌లో మొదలైన మాట జంతర్ మంతర్ దాకా ఎందుకు వస్తోంది? జంతర్ మంతర్‌లో వినిపించిన ప్రశ్న హైదరాబాద్ విద్యార్థి చెవుల్లో ఎందుకు మోగుతోంది? ఒక అమ్మాయి మైక్ పట్టుకొని అడిగిన ప్రశ్న ప్రభుత్వానికి రాజకీయ ప్రశ్నగా ఎందుకు మారుతోంది? దీనికి జవాబు నేహా ఒక్కదానిలో లేదు. ఆమె వెనకాల నిలబడి ఉన్న కాలంలో ఉంది.

ఈ తరం చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ప్రపంచం అరచేతిలో ఉంది. కానీ.. తమ భవిష్యత్తు మాత్రం చేతిలో లేదనే బెంగ ఉంది. డిగ్రీ ఉంది ఉద్యోగం లేదు. పోటీ పరీక్ష ఉంది నమ్మకం లేదు. నోటిఫికేషన్ వస్తుంది పరీక్ష వాయిదా. పరీక్ష రాస్తారు పేపర్ లీక్. ఏళ్ల తరబడి చదువుతారు ఫలితం గాల్లో. యూనివర్సిటీ ఉంది నిధులు లేవు. రిసెర్చ్ చేయాలనే తపన ఉంది అవకాశాలు తగ్గుతున్నయ్. ఇదంతా చూస్తూ యువత ఊరుకుంటదా? "ఎవరి కర్మ వాళ్లది" అని ఇంట్లో కూచుంటదా. లేదు. ఎందుకంటే కడుపు మండితే కుండ పగులుతుంది. భవిష్యత్తు మీద నమ్మకం కదిలితే ప్రశ్న పుడుతుంది. ప్రశ్న పుడితే అసంతృప్తి వస్తుంది. అసంతృప్తి ఒక్కొక్కరి గుండెల్లో ఉంటే అది బాధ. అదే వందల గొంతుల్లో వినిపిస్తే.. అది రాజకీయ శక్తి.

అధికారానికి నిరుద్యోగం ఒక సంఖ్య. యువకుడికి అది తన జీవితంలోని ఐదేళ్లు. అధికారానికి పరీక్షా అవకతవక ఒక వార్త. విద్యార్థికి అది ఇంట్లో వాళ్లు చేసిన అప్పు. అధికారానికి విశ్వవిద్యాలయ బడ్జెట్ ఒక ఫైలు. పరిశోధకుడికి అది తన కలల భవిష్యత్తు. పైన కూచున్నోడికి అంకె. కింద నిలబడ్డోడికి బతుకు. ఈ తేడా అర్థం కావాలి. సోషల్ మీడియాలో రెండు హ్యాష్‌ట్యాగులు పెట్టి "అంతే... జెన్-జెడ్ ట్రెండ్" అనుకుంటే సరిపోదు. మంట ఎక్కడ అంటుకుందో చూడకుండా పొగను తిట్టినట్టవుతుంది.

నేహా బోరా మాటల్లో మరో ప్రత్యేకత ఉంది. ఆమె భాష. అది పాత రాజకీయ సభల్లో వినిపించే రొటీన్ ఉపన్యాసం కాదు. ప్రశ్నను పుస్తకం నుంచి తీసి మన ఇంటి గడప మీద పెట్టే భాష. "ఉద్యోగం" అంటే కేవలం ఒక గణాంకం కాదు. నోటిఫికేషన్ కోసం ఫోన్ చూస్తూ కూర్చున్న యువకుడి ఎదురు చూపు. "విద్య" అంటే కేవలం తరగతి గది కాదు. ఫీజు కోసం తల్లిదండ్రుల్ని చూస్తున్న విద్యార్థి కళ్లలోని సంకోచం. "ప్రజాస్వామ్యం" అంటే పుస్తకంలో ఉన్న నిర్వచనం కాదు. మైక్ పట్టుకున్న విద్యార్థి గొంతు ఆపుతారా లేదా అన్న పరీక్ష. అదే రాజకీయ భాషకు అసలు కసి.

అయితే ఒక మాట. నేహాను దేవతగా నిలబెట్టడం కూడా సరికాదు. ఎవడైనా నాయకుడే అయినా "అన్నీ బాగానే చెప్పిండు" అని కళ్లుమూసుకుని నమ్మితే అది చైతన్యం కాదు. ప్రశ్నించే వాళ్లను కూడా ప్రశ్నించాలి. విద్యార్థి నాయకత్వాన్నీ ప్రశ్నించాలి. ప్రతిపక్షాన్నీ ప్రశ్నించాలి. మనకు నచ్చిన వాళ్లను కూడా ప్రశ్నించాలి. ఎందుచేత అంటే ప్రశ్న ఎవరి జాగీరు కాదు. అది ప్రజాస్వామ్యం మనకు ఇచ్చిన హక్కు. నేహా బోరా రాజకీయాల బలం కూడా ఇక్కడే తెలుస్తుంది. ఆమె మాటలు నిజమని గుడ్డిగా నమ్మడంలో కాదు. ఆమె వేసిన ప్రశ్నల్ని మన జీవితాలతో బేరీజు వేసుకోవడంలో ఉంది.

కొత్త తరానికి నాయకులు మాత్రమే కావడం లేదు. జవాబులు కావాలి. నినాదాలు మాత్రమే సరిపోవు. ఉద్యోగం కావాలి. సిద్ధాంతం మాత్రమే సరిపోదు. బతుకుతో సంబంధం ఉన్న రాజకీయాలు కావాలి. వాళ్లను "జెన్-జెడ్" అని పిలిచి మీమ్స్ చేసే, రీల్స్ చూసే పిల్లలుగా తేలిగ్గా తీసుకుంటే.. "చేతిలో ఫోన్ ఉంది కదా, ఏం చేస్తరు?" అనుకుంటే అది పెద్ద పొరపాటు. వాళ్లే మీమ్స్ చేస్తారు. వాళ్లే రీల్స్ చేస్తారు. వాళ్లే సోషల్ మీడియాలో చర్చిస్తారు. అవసరం వస్తే అదే చేతులతో ప్లకార్డులు పట్టుకుంటారు. అదే కాళ్లతో వీధిలోకి వస్తారు. మొబైల్ నుంచి మైదానం దాకా వాళ్ల ప్రయాణాన్ని అర్థం చేసుకోలేని రాజకీయాలకు ఈ తరం అర్థం కాదు.

అందుకే నేహా బోరా ఒక సంకేతం. ఆమె గెలిచిందా? ఓడిందా? ఇప్పుడే తీర్పు చెప్పాల్సిన పని లేదు. ఆమె సభకు ఎంతమంది వచ్చారు? ఎంతమంది చప్పట్లు కొట్టారు? అది కూడా అసలు కొలమానం కాదు. అసలు ప్రశ్న ఆమె అడిగిన తర్వాత ఎంతమంది తమను తాము అడుగుకున్నారు?

"నా భవిష్యత్తు ఏంది?"
"నా పిల్ల చదివి ఏం చేస్తడు?"
"నేను చదివిన ఈ డిగ్రీకి విలువ ఏంది?"
"పరీక్షలు ఇలా ఉంటే మా గతి ఏంది?"
"ఈ దేశంలో పరిశోధనకు చోటుందా?"

ఇలాంటి ప్రశ్నలు ఒకరి గుండెలో నుంచి మరొకరి గుండెల్లోకి వెళ్తే అక్కడే ప్రసంగం ఉద్యమంగా మారుతుంది.

అధికారానికి అసలు భయం నేహా బోరా ఒక్కదాని మీద ఉండాల్సిన అవసరం లేదు. అసలు భయం నేహాలుగా మారుతున్న వందలాది, వేలాది యువత మీద. ఒక నేహాను ఆపొచ్చు. ఒక సభను ఆపొచ్చు. మైక్ తీసేయొచ్చు. పోస్టర్ చింపొచ్చు. కానీ.. ఒక తరానికి వచ్చిన ప్రశ్నను ఏం చేస్తరు?
జైలులో పెడతారా?
ఫైల్లో దాస్తారా?
ప్రచారంతో మాయ చేస్తారా?
ఎంత చేసినా ప్రశ్న ఇప్పటికే బయటికి వచ్చేసింది. ఒక్కసారి నోటికి వచ్చిన మాటను గాలికి సంకెళ్లు వేయలేం.

ఇది నేహా బోరా కథ మాత్రమే కాదు. ఇది భారతీయ విద్యార్థి రాజకీయాల్లో వస్తున్న ఒక కొత్త మలుపు. ఒక వైపు కేంద్రీకృత అధికార ప్రభావం పెరుగుతోంది. మరోవైపు విద్య, ఉద్యోగం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం కోసం యువత గుండెలు రగులుతున్నయ్. ఈ రెండు ప్రవాహాలు ఢీకొనే చోటే కొత్త రాజకీయ భాష పుడుతోంది. ఆ భాషలో కోపం ఉంది. వ్యంగ్యం ఉంది. సాహసం ఉంది. కొంత తొందరపాటు ఉంది. కొన్ని అతిశయోక్తులు ఉండొచ్చు. కానీ ఒక్కటి మాత్రం లేదు మౌనం.

చరిత్రలో ప్రతి కొత్త తరం పాత తరానికి కొంత ఇబ్బందే. వాళ్ల భాష అర్థం కాకపోవచ్చు. వాళ్ల పద్ధతులు నచ్చకపోవచ్చు. వాళ్ల ప్రశ్నలు మనకు గుచ్చుకోవచ్చు. అయినా వాళ్లను తిట్టేసి పక్కకు నెట్టేస్తే పని అయిపోదు. "పిల్లగాండ్లు ఏం తెలుసు?" అని తీసిపారేస్తే రేపటి చరిత్ర ఎవరూ రాయకుండా ఉండదు. వాళ్ల ప్రశ్నల్ని వినాలి. వాళ్లతో వాదించాలి. వాళ్లను విమర్శించాలి. వాళ్లు కూడా మనల్ని విమర్శించే హక్కును అంగీకరించాలి. అక్కడే ప్రజాస్వామ్యం బతుకుతుంది. అక్కడే రాజకీయ చైతన్యం పెరుగుతుంది. ప్రశ్నకు జవాబు ఎవరు చెప్పాలి? ఒక మైక్ ముందు నేహా కనిపిస్తుంది. కానీ ఆమె వెనుక మైక్ పట్టుకోని లక్షల గొంతులు ఉన్నాయి. పరీక్షా హాలులో కూచున్న విద్యార్థి ఉంది. నోటిఫికేషన్ కోసం ఫోన్ చూస్తున్న నిరుద్యోగి ఉన్నాడు. ఫెలోషిప్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న పరిశోధకుడు ఉన్నాడు. ఫీజు కోసం అప్పు చేస్తున్న తండ్రి ఉన్నాడు. పిల్ల చదువు కోసం బంగారం తాకట్టు పెడుతున్న తల్లి ఉంది. క్యాంపస్‌లో తన గొంతు కోసం నిలబడుతున్న విద్యార్థి ఉన్నాడు. నేహా మాట్లాడితే వాళ్ల బతుకుల శబ్దం కూడా అందులో వినిపిస్తుంది. అందుకే ఆమెను కేవలం ఫైర్‌బ్రాండ్ అని పిలవడం సరిపోదు. ఆమె ఒక ముఖం. ప్రశ్న ఒక తరం. అసంతృప్తి ఒక సమాజం. పోరాటం ఇంకా రాయబడని భవిష్యత్తు. అధికారానికి అసలు సవాలు నేహా కాదు. నేహా అడిగిన ప్రశ్నను తమ ప్రశ్నగా చేసుకునే తరం. ఒక గొంతును మ్యూట్ చేయొచ్చు. ఒక మైక్ ఆపొచ్చు. ఒక సభను చెదరగొట్టొచ్చు. ఒక పోస్టర్ చింపొచ్చు. కానీ.. ఒక తరానికి వచ్చిన ప్రశ్నకు పోలీసు బందోబస్తు పెట్టలేరు. ఆ ప్రశ్న పుస్తకాల్లోకి వెళ్తది. క్యాంపస్‌ల్లోకి వెళ్తది. వీధుల్లోకి వస్తది. ఇళ్లల్లో చర్చ అవుతుంది. చివరకు ఓటు వేసే వేలికి కూడా చేరుతుంది. అందుకే నేహా బోరా కథ. ఒక విద్యార్థి నాయకురాలి కథగా మొదలై ఒక తరం రాజకీయ మేల్కొలుపు కథగా మారుతోంది. ఆమె అడుగుతున్నది "మా భవిష్యత్తు ఎక్కడ?" ఆ ప్రశ్నకు జవాబు చెప్పాల్సింది విద్యార్థి కాదు. యువత కాదు. నేహా కాదు. ఈ దేశాన్ని పాలిస్తున్న అధికారమే. ఆ జవాబు కోసం ఎదురు చూస్తున్నది ఒక తరం.

ఆ తరం ఇక సభలకు చప్పట్లు కొట్టడానికి మాత్రమే రావడం లేదు. "మా మాట ఏంది?" అని అడగడానికి వస్తోంది. "మా బతుకు ఏంది?" అని నిలదీయడానికి వస్తోంది. "మా భవిష్యత్తు ఎక్కడ?" అని లెక్క అడగడానికి వస్తోంది. అదే అసలు మార్పు. అదే నేహా బోరా వంటి గొంతుల రాజకీయ ప్రాధాన్యం. ప్రశ్న పుట్టింది. తరం మేల్కొంది. ఇక జవాబు తప్పదు!



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)
లిబరేషన్ తెలంగాణ

# హృదయ స్పందనలు




ప్రపంచీకరణ వర్ధమాన దేశాలసామాజిక ఆర్థిక రాజకీయ రంగాలను ప్రభావితం చేసినట్లుగానే సాంస్కృతిక రంగాన్ని కూడా సంక్షోభానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో సృజనాత్మక చైతన్యం గల కవులు రచయితలు తమ కళ్ళముందే జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ గ్రామాలన్నీ పట్టణీకరణ చెందుతూ సహజత్వాన్ని కోల్పోయి ఇటు అస్తిత్వాన్ని కాపాడుకోలేక అటు ఆధునికతను సంతరించుకోలేక సతమతమవుతున్న నేపథ్యంలో సగటు మనిషి పరివేదనను వస్తువుగా తీసుకొని తమ ఆవేదనకు, అనుభూతులకు, అనుబంధాలకు అక్షర రూపం ఇస్తూ పాలడుగు రత్నాకర రావు వెలువరించిన తాజా కవితా సంపుటి ఈ " హృదయ స్పందనలు".

ఇటీవల తెలుగు కవిత్వంలో పురాస్మృతి, గత వైభవ స్మరణ చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఒకనాడు పల్లెలు ప్రకృతికి ఆత్మీయ తా అనుభూతులకు ఆలవాలమై, కుల మతాల ప్రసక్తి లేకుండా ఐక్యతతో మనుగడ సాగించిన కాలాన్ని, తమ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ నాటి మధుర స్మృతులను తలపోస్తూ "ఆపాత మధు రంగా" రచనలు చేస్తున్నారు. చదివిన పాఠకులు కూడా దానితో మమేకమై"గుర్తుకొస్తున్నాయి" అంటూ అనుభూతి చెందుతున్నారు.

మారిన పరిస్థితులలో చదువు,ఉద్యోగం,ఉపాధి, వైద్య సదుపాయం తదితర కారణాలతో గ్రామాలలో తాత ముత్తాతల నుండి వారసత్వంగా వచ్చిన ఇళ్ళను, భూములను అమ్ముకొని నగరాలకు వలస వెళ్లిన అక్కడి "పేగు బంధాన్ని" తెంచుకోలేక"తరం అంతరించక ముందే అంతరంగాన్ని భద్రపరుచుకోవాలని" ఆకాంక్షిస్తూ పాలడుగు రత్నాకరరావు భవ్యమైన తన భావాలకు అక్షర రూపం ఇస్తూ హృదయ స్పందనను వినిపించారు. మాతృదేవోభవ అన్నది మన సంప్రదాయం కనుక"ఒంటి చేత్తో బరువు బాధ్యతల్ని ఎత్తుకొని, సునాయాసంగా ఒడ్డుకు చేర్చింది"అని సాకిన తల్లిని స్మరించాడు. కన్నతల్లి ఉన్న ఊరు అన్నట్లు చిన్ననాడు తను ఉన్న ఊరు తిరిగిన వీధులను గుర్తు చేసుకుంటూ"పుట్టిన ఇల్లు చెదరిపోయింది, అడుగిడిన నేల పరాయి దైపోయింది"అంటూ పరాయికరణ చెందిన పరిస్థితిని తలచుకొని వాపోయారు.

మమతా ను రాగాలకు మారుపేరైన మనవరాలు ఆరాధ్య జననంతో ఇంట్లో వసంతం వెల్లివిరిసిందని చెబుతూ ఆ పాప చేసే మారాముకు" ప్రతిరోజు హక్కులకై పోరాడుతుంది.. సాధికారత దిశగా నేటి నుండే అడుగులిడుతుందని", భావించడం భవిష్యత్తును దర్శించినట్లు అనిపిస్తుంది. రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నట్లు ఉదయం రాబోయే మధ్యాహ్నాన్ని సూచిస్తుంది కదా! కవి గడిచిన తన జీవిత కాలాన్ని నెమరు వేసుకుంటూ"కన్న కలలు సాకారం కాక, ఆత్మాభిమానంతో బతుకులు వెళ్ళదీసిన రోజులని కనుగొంటాను అంటూ పిండితే రాలిపడే, జ్ఞాపకాల చినుకులు"అంటాడు. కవితాభివ్యక్తిలో ఇలాంటి పదాలు కవి చెప్పదలుచుకున్న భావాలను సాంద్రపరుస్తున్నాయి. అలాగే తన మనసు మూలల్లో దాగున్న కనిపించని అసంతృప్తిని వ్యక్తం చేస్తూ"సగం రాసి ఆపేసిన కవిత లాగా ఉంది జీవితం"అని ఒకచోట"ఆశయం తీర్చుకోవడానికి, అవకాశం సన్నగిల్లుతున్నది" అని మరోచోట చెప్పడం భౌతికంగా వాస్తవిక తాత్వికతగా భావించవచ్చునేమో కానీ పాలడుగు లాంటి ప్రతిభావంతులకు నిర్వేదం తగదని ఆత్మీయంగా ఆశిస్తున్నాను.

పదవీ విరమణ పొందిన సగటు ఉద్యోగిలా విశ్రాంత జీవితాన్ని కాలక్షేపంగా కాకుండా కవిత్వాన్ని రాస్తూ, చరిత్రను శోధిస్తూ, అధ్యయనాన్ని సాగిస్తూ రచనలు చేస్తున్నారు. వాగర్థావివసంపృక్తౌ అన్నట్లు రత్నాకర రావు గారితో తన జీవితాన్ని పెనవేసుకున్న ఉత్తమ ఇల్లాలు అరుణ గారు ఆయన రచనా నేపథ్యాన్ని గుర్తుచేస్తూ" ఏదో ఒక నాటికి కవిత వాక్యంగా నైనా మిగలకపోతానా" అంటూ తన జీవితాన్ని కవిత ప్రవాహంలోకి నెట్టేసుకున్నారు" అన్న ఆమె ఆత్మావిష్కరణ మాటలు అక్షర వాస్తవాలు. ఇలా 80పుటల్లో 38 కవితలు రాసిన పాలడుగు రత్నాకర్ రావు గారు తన కవితా సంపుటిని ఆత్మీయులైన శ్రీ కానాల పూర్ణచంద్రరావు, శ్రీ రంగరాజు శ్రీనివాసరావు దంపతులకు అంకితం ఇచ్చారు.జీవనది వలె ఆయన కవితా ప్రవంతి నిరంతరం పరవళ్ళు తొక్కాలని ఆశిస్తూ అభినందిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

## స్వతంత్రం !

స్వతంత్రం వచ్చింది
పరతంత్రం పోలేదు!
విచిత్రంగా ఉందా?
అంతా సచిత్రమే!
దేశంలోవైషమ్యాలు
పెంచేవాళ్ళేమరి !
కులాలు మతాలు
అంటరానితనం
ఎగదోసే వాళ్ళే!
ముస్లిమ్స్ క్రిస్టియన్స్
వెళ్లిపోవాలంట!
ఇక్కడేపుట్టారువాళ్లు!
ఓటు బ్యాంక్ కోసం
ఎన్ని పాపాలకైనా
ఎప్పుడూ సిద్ధమే!
స్వాతంత్ర్యంవచ్చెననీ
సభలేచేసి
సంబర పడొద్దన్నాడు!
సంబరపడి అదే
విజయమనుకుంటే
పొరపాటన్నాడు!
అరవైయ్యేళ్ళ క్రితమే
సత్యం చెప్పిన
మహాకవి శ్రీశ్రీ!
ఖర్గే, కోవింద్
వీళ్ళనుకూడావదలని
అస్పృశ్యత!
వీళ్లు గుడికి వస్తే
ఆ స్థలం అపవిత్రం!
శుద్ధి చేస్తారు!
స్వతంత్రంవచ్చినట్టా!
ఏమన్నా మారారా?
ఇంకాఇదిపరతంత్రమే!
'పరులు' ఎవరోకాదు!
వేల సంవత్సరాలుగా
ఏడిపించిన వాళ్ళే!
తెల్లోడు'సంపదల'దొంగ
వీడు'భావ'దురాత్ముడు
వీడే ఎంతో ప్రమాదం!
వీడు జనాన్ని
ఎదగనివ్వలేదు!
ఇదివీడి సిద్ధాంతం!
ఎక్కడివాళ్ళక్కడే!
సూద్రపోళ్లంతా
నోరెత్తటానికిలేదు!
అదేవీడిబాధంతా
గీత దాటటం వల్లే!
ధర్మంచెడిపోయిందని!
జెన్ జీ లు ఆల్ఫాలు
ఎదిరించి పోరాడటం
సహించలేకపోతున్నాడు!
తీసుకుపోవాలి వీళ్ళని
వెనక్కితీసుకుపోవాలి!
అణగదొక్కేతంత్రం!
తంత్రాలు మంత్రాలు
వీళ్ళ కుతంత్రాలు!
ఇంకా ఎంతకాలం?
వీళ్లకుకాలంమూడింది
జనంఉద్యమిస్తున్నారు
'మనువుమరణం'ఖాయం!
అదుగో అరుణోదయం
అదే నవోదయం!
అందరికీ 'స్వతంత్రం'!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

నిన్నటి సంచిక తరువాయి

# దళితబహుజన ఐక్యవేదిక నిర్మాణం - తాత్విక ఘర్షణ

*యుగకర్త బి.ఎస్. రాములు*



ప్రథమ రాష్ట్ర మహాసభలు (1993): 1993 ఫిబ్రవరి 12, 13 తేదీలలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ కింద గల అంబేద్కర్ భవనంలో రెండు వేల మందితో ప్రథమ మహాసభలు జరిగాయి. ఇది వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో మైలురాయిగా నిలిచిపోయింది.

**ఐక్య ఇ౹దిక తాత్విక విజయాలు - వర్గ దృక్పథం వర్సెస్ కుల దృక్పథం**

దళితమే ఐక్య వేదిక సాహిత్య, సామాజిక రంగాల్లో ఒక స్పష్టమైన విభజన రేఖను గీసింది. అది సమాజంపై ప్రాథమిక తాత్విక ప్రశ్నలను సంధించింది: సాహిత్యానికి వర్గ దృక్పథం ఉన్నప్పుడు కుల దృక్పథం ఎందుకు ఉండకూడదు?

పీడిత వర్గ దృక్పథం లేదా కార్మిక వర్గ దృక్పథం అంటే కేవలం అగ్రకులాల పేదలు మాత్రమేనా? ఉత్పత్తి సంబంధాలలో నిత్యం నలిగిపోయే బీసీ, ఎస్సీ, ఎస్టీలు నిజమైన పీడిత వర్గం కాదా?

వామపక్షాలు తమ వర్గ దృక్పథాన్ని భారతీయ కుల దృక్పథంతో సమతులన చేస్తూ సవరించుకోవాలని ఐక్యవేదిక ఘంటాపథంగా వాదించింది. కన్యాశుల్కం నాటకంపై జరిగిన చర్చల ద్వారా సాహిత్య రంగంలో తీవ్ర పోలరైజేషన్ వచ్చింది. అంతవరకు అగ్రకుల, మధ్యతరగతి జీవితాలనే ప్రజా జీవితాలుగా చిత్రించిన క్రమాన్ని ఐక్యవేదిక తోసిపుచ్చింది. కుల వృత్తులను, కుల వివక్షను, శతాబ్దాల అణచివేతను ప్రతిబింబిస్తూ దళిత బహుజన సాహిత్యం సరికొత్త బాటలో దూసుకుపోయింది.

**సాహిత్య పురోగతి - సంస్థాగత విస్తరణ**

హుస్నాబాద్‌లో 4 రోజుల పాటు జరిగిన కథా వర్క్‌షాప్స్ ద్వారా ఎందరో యువ రచయితలు వెలుగులోకి వచ్చారు. రామచంద్రరావు, సాంబశివరావు, మాస్టర్ జీఆర్ నాగోని, కె. సీతారాములు, జూపల్లి సత్యనారాయణ, కదలి సత్యనారాయణ, వెంకటరత్నం, డాక్టర్ కె. లక్ష్మీనారాయణ, ఖాదర్ మొయినుద్దీన్, డాక్టర్ జయ సలోమి, అన్నవరం దేవేందర్ , కె రామ లక్ష్మణ్ వంటి ఎందరో నాయకులు సంస్థాగత నిర్మాణానికి తోడ్పడ్డారు. కొలకలూరి ఇనాక్, కత్తి పద్మారావు, బోయ జంగయ్య, ప్రొఫెసర్ చక్రధర్, కలేకూరి ప్రసాద్, జూలూరి గౌరీశంకర్, సతీష్ చందర్ వంటి మహామహులు ఈ ఉద్యమ పురోగతిలో భాగస్వాములయ్యారు. అలాగే శివసాగర్, కె.జి. సత్యమూర్తి, కొండా లక్ష్మణ్ బాపూజీ, బొజ్జా తారకం, పత్తిపాక మోహన్, టంకశాల అశోక్, బైస దేవదాస్, నల్లా సూర్య ప్రకాశ్, రాపోలు రాములు వంటి మిత్రుల సహాయ సహకారాలు ఎంతో దోహదం చేశారు.

రెండవ మహాసభలు (1995): 1995 మే నెలలో వరంగల్ మొగిలయ్య హాలులో దరకమే ఐక్యవేదిక రెండవ రాష్ట్ర మహాసభలు మహోత్తేజభరితంగా జరిగాయి. ఇందులో జయ సలోమి, సమసూన స్వామి, ఇంగి లాల, ఎండ్లూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**పభుత్వ విధానాలపై ప్రభావం - సామాజిక ప్రణాళికలు**

బి.ఎస్. రాములు కేవలం సిద్ధాంతకర్తగానే కాకుండా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన సామాజిక ప్రణాళికలను రచించారు.

**తెలంగాణ తల్లి రూపకల్పన:** తెలంగాణ సామాజిక, సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహం యొక్క తాత్విక రూపకల్పనలో ఆయన ఆలోచనలు కీలక పాత్ర పోషించాయి.

డబుల్ బెడ్‌రూమ్ పథకం: పేదలకు గౌరవప్రదమైన ఉచిత వసతి కల్పించే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకానికి ఆయన అందించిన సామాజిక సూచనలు పునాదిగా నిలిచాయి.

**గురుకుల పాఠశాలలు:** వెనుకబడిన, అణగారిన వర్గాల పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను అందించే గురుకుల పాఠశాలల స్థాపన వెనుక ఆయన సామాజిక దార్శనికత దాగి ఉంది.

**శతాధిక గ్రంథాల తాత్విక ప్రస్థానం**

1991లో వెలువడిన 'గతితర్క తత్వదర్శన భూమిక' గ్రంథం తెలుగునాట మౌలికమైన మార్పులకు దారితీసింది. భారతీయ చరిత్రను శూద్ర దృక్పథంతో విశ్లేషిస్తూ ఆయన రచించిన 'భారతీయ చరిత్ర సూద్ర దృక్పథం' గ్రంథం చరిత్ర నిర్మాణ రంగంలో సరికొత్త వెలుగును ప్రసరింపజేసి, ఒక మైలురాయిగా నిలిచింది. ఆయన కలం నుండి జారిన ప్రముఖ తాత్విక,

**సామాజిక గ్రంథాలు:**

గురజాడ కన్యాశుల్కాన్ని ఇప్పుడు ఎలా చూడాలి?
గతితర్కం అంబేద్కర్ మార్క్సిజం
ఇంటెలెక్ట్ సోషలిజం, బహుజనతత్వం
వ్యక్తిత్వ వికాసం సామాజిక నాయకత్వం
రాజ్యం ప్రజలు, సామాజిక న్యాయం అంటే ఏమిటి?
బీసీలు సాధికారత, బుద్ధుడు ప్రపంచంలోని తొలి సోషలిస్టు సమాజ నిర్మాత
భారతీయ ఫ్యూడల్ కుల వ్యవస్థ, పెట్టుబడి క్రమశక్తి నిర్వహణ సామర్థ్యం
స్వాతంత్రాంతర 60 ఏళ్ల తాత్విక సామాజిక పరిణామాలు సమగ్ర సామాజిక కథ
పాట పుట్టుక, ప్రేమ అంటే ఏమిటి?, 20 కథా సంపుటాలు ఆరు నవలలు. 50 ఏళ్ల తెలుగు కథ - తీరుతెన్నులు ఒ సాహిత్య చరిత్రను కొత్త చూపుతో తిరగరాయాలి. వీరి రచనలపై మూడు పిహెచ్డీ, ఆరు యం. ఫిల్ పట్టాలు అందుకున్నారు.

సామాజిక, సాహిత్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తూనే, మరోవైపు ఉద్యోగ హక్కుల కోసం కూడా ఆయన పోరాడారు. 1984 నాటి పాత కేసును తిరగదోడి, సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం 1993లో కోర్టు ద్వారా ఆ కేసును కొట్టివేయించుకున్నారు. ప్రభుత్వం ఆయన సస్పెన్షన్ కాలాన్ని 'ఇన్ డ్యూటీ'గా పరిగణించి, పూర్తి జీతభత్యాలు, ఇంక్రిమెంట్లతో ఉద్యోగంలోకి తిరిగి తీసుకుంది. సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగ సంఘాల ద్వారా 10 శాతం గ్రేడ్-1 అధికారుల కోటాను సాధించి, అనేక మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు.

దశాబ్దాల పాటు సాగిన బి.ఎస్. రాములు గారి నిరంతర కృషి ఆయనను కేవలం ఒక రచయితగానే కాకుండా, ఒక యుగకర్తగా, సామాజిక తాత్వికుడిగా, కథా చక్రవర్తిగా, శతాధిక గ్రంథకర్తగా మరియు భారతీయ సమాజ మార్గదర్శిగా చరిత్రలో నిలిపింది. ఇప్పుడు నడుస్తున్నది దరకమే ఐక్యవేదిక యుగం.

- జూజుల గౌరి

## పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే ఏకైక లక్ష్యం



**నిజాంపేట్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 296 దుండిగల్ తాండా 2-లో ఆదివారం బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 56 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. దుండిగల్ తండా 2 పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ నాయక్, నర్సింహారెడ్డి, గణేష్ నాయక్, ఆకాష్, కృష్ణ, మహేష్, సందీప్, రిజ్వాన్, టీమ్ బికెఆర్ సభ్యులు స్థానిక ప్రజలు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.

## వివాదాలు లేని భూములను 22ఏ నుంచి తొలగిస్తాం

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి



**చేవెళ్ల, ఆగస్టు 16 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలో వివాదాలు లేని భూములను 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఆదివారం చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ 22ఏ పరిధిలో ఉన్న భూ రికార్డులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 22ఏ పరిధిలో ఉన్న వివాదాస్పద భూములను పరిశీలిస్తున్నామని తెలిపారు. వివాదాస్పదంగా ఉన్న రెవెన్యూ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని చంద్రా రెడ్డి పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో పార్థసింహా రెడ్డి, తహసీల్దార్ బి.కృష్ణయ్యతో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




**గద్వాల, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఆశా వర్కర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బి ఆర్ టి యు జిల్లా ఇన్చార్జ్ గంజిపేట రాజు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు నెలకు రూ.18 వేల స్థిర వేతనం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.1,500 అదనపు ప్రోత్సాహకాన్ని ఇవ్వాలని కోరారు. బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ సౌకర్యాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే బి ఆర్ టి యు రాష్ట్రస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల్లో ఆశా వర్కర్ల పాత్ర కీలకమని, కరోనా సమయంలో వారు చేసిన సేవలను గుర్తుచేశారు. అయినా ఇప్పటికీ వారికి కనీస వేతనం, గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బి ఆర్ టి యు నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొని తమ సమస్యలను విన్నవించారు.

## తండాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**కొడంగల్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** తండాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తర్యా నాయక్ అన్నారు. తండాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కొడంగల్ మండలం టేకులకోడ్ అనుబంధ తండా మోత్కుల బండా తండా, బోనమ్మ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చిందని అన్నారు. ఆయా తండాల్లో చేపడుతున్న బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. తండాల ప్రజలకు మెరుగైన రహదారులు, బ్రిడ్జిలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. తండాల అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తండాల ప్రజలు రుణపడి ఉండాలని ఆయన కోరారు.

## హన్మకొండకు తరలిన న్యాయవాదులు




**నారాయణపేట, ఆగస్టు 16 (జనం సాక్షి) :** హన్మకొండలో ఆది వారం జరిగిన న్యాయవాద తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి నారాయణ పేట న్యాయవాదులు తరలివెళ్లి పాల్గొన్నారు. నారాయణపేట నుంచి పాల్గొన్న వారిలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ, కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది కుర్మన్న గౌడ్, న్యాయ వాదులు నర్సింలు యాదవ్, భరత్, క్రాంతి కుమార్ ఉన్నారు.

# కాలనీలపై 22ఏ ఉచ్చు తొలగించాలి

- నిషేధిత జాబితా నుంచి ప్రైవేటు భూములను వెంటనే మినహాయించాలని యూడీఎఫ్ డిమాండ్
- స్పందించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లు నిలిపివేసిన కాలనీలను వెంటనే జాబితా నుంచి తొలగించాలని అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం (యూడీఎఫ్) డిమాండ్ చేసింది. వివిధ కాలనీల ప్రతినిధులతో కమలానగర్‌లోని ఎన్‌వీ భాస్కరరావు భవన్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా యూడీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎం.శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు ఎన్.అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షల ఎకరాలను 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉన్నా, మొత్తం సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రైవేటు ఆస్తుల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చే ముందు సంబంధిత యజమానులకు నోటీసులు ఇవ్వాలని హైకోర్టు సూచించినప్పటికీ, ప్రభుత్వం ఆ నిబంధనలను పాటించడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పేరుతో ప్రజల భూములను వివిధ కారణాలతో నిషేధిత జాబితాలో చేర్చడం ఆందోళనకరమన్నారు. మున్సిపల్ అనుమతులు, హెచ్ఎండీఏ ఆమోదం పొందిన లేఅవుట్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదన్నారు. ఏఎస్‌రావునగర్, ఈసీ నగర్, బీఎన్‌రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కుటుంబ అవసరాలు, వివాహాలు, అత్యవసర ఖర్చుల కోసం కూడా తమ ఆస్తులను వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. యూడీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎన్.అంజయ్య మాట్లాడుతూ.. ఎప్పుడో ఏర్పడిన కాలనీలను ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చడం ప్రజలకు అన్యాయం చేయడమేనన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాలనీవాసుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూడీఎఫ్ మేడ్చల్ జిల్లా నాయకుడు పి.సత్యం, వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘం సభ్యులు సోమయ్యచారి, జి.వెంకటేశ్వరరావు, కె.వెంకటాచారి, జి.యాదగిరి రావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధికి పునాదులు వేసిన వాజ్‌పేయ్



**నారాయణపేట, ఆగస్టు 16 (జనం సాక్షి) :** రాజకీయ విలువలకు నిలువుటద్దంగా నిలిచి భారత దేశ అభివృద్ధికి బాటలు వేసిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి సేవలు చిరస్మరణీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ అన్నారు. వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని కావలసిన వాజ్ పేయి ఒక్క ఓటుతో రాజకీయాలకు విలువ ఇస్తూ ప్రధాని పదవిని తృణప్రాయంగా వదులుకున్న వ్యక్తిగా చరిత్ర పుటల్లో నిలిచి పోయారని అన్నారు. తరువాత పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చి ప్రధానిగా ఎన్నికై దేశ అభివృద్ధికి పునాదులు వేశారని అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రజల అవసరాల కోసం ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాలని గ్రామీణ సడక్ యోజన తీసుకువచ్చి నేడు ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించారని, అలాగే పేద ప్రజలు ఆకలితో అలమటించకుండా ఉండాలనే ఉద్దేశంతో అంత్యోదయ అన్న యోజన పథకం తీసుకువచ్చి దారిద్ర రేఖకు దిగువ ఉన్న ప్రజల ఆకలి తీర్చారన్నారు. ముఖ్యంగా రహదారుల సౌకర్యం ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అందుకోసం స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారులకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వాజ్ పేయి చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆపతకాలను ప్రస్తుత ప్రధాని కొనసాగిస్తూ దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్, జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్ రాములు, మైనార్టీ మోచ్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్, కౌన్సిలర్ ప్రభాకర్, మిర్చివెంకటయ్య, జి.ఆర్ .రెడ్డి, వడ్డేదత్తు, సూర్యకాంత్, సాదిక్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



**అల్వాల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** వజ్ర ఎన్‌క్లేవ్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి కాలనీవాసులంతా సమష్టిగా సహకరించాలని వజ్ర ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం, ఆలయ నిర్వహణను క్రమబద్ధీకరించడం, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు భక్తిశ్రద్ధలతో సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతినిధులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహకారం అందించాలని కోరారు. సమష్టి కృషితో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. ర్యక్రమంలో ఏ. మహిపాల్‌రెడ్డి, సీహెచ్ సంతోష్, శ్రీధర్, నాగేశ్వరరావు, టీవీ ప్రవీణ్‌కుమార్, సదాశివరావు, పూర్ణారావు, శ్రీనివాస్, మధుకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరామరెడ్డి సేవలు చిరస్మరణీయం

- పిఏసిఎస్ చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి



**కేశంపేట, ఆగస్టు 16 (జనం సాక్షి) :** దివంగత మాజీ కోత్వాల్ రాజా బహదూర్ వెంకటరామరెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొత్తపేట పిఏసిఎస్ చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహ ప్రతిష్టకు రెడ్డి సంఘం మండల అధ్యక్షులు తలసాని రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బీస కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... మండల కేంద్రంలో వెంకటరామిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యాదాత వెంకటరామిరెడ్డి అని కొనియాడారు. శతాబ్ది టౌన్షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రాంతంలో విద్యను అందించడానికి అనేక విద్యాసంస్థలు, వసతి గృహాలను స్థాపించారన్నారు. మహిళా అభ్యున్నతే లక్ష్యంగా కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర శ్రావణ్ రెడ్డి, గోగు వెంకట్ నారాయణ రెడ్డి, బుర్రి భూపాల్ రెడ్డి, బండెల రాజేందర్ రెడ్డి, కర్రెడ్ల నరసింహారెడ్డి, తలసాని పాండు రంగారెడ్డి, యారం భాస్కర్ రెడ్డి, పోచారం జగన్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, మన్మధ రెడ్డి, జగత్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అంజిరెడ్డి, జగన్ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నరసింహారెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుజీవన్ రెడ్డి, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, హరీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రవీందర్ రెడ్డి, పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టు వద్ద భారీగా ట్రాఫిక్ జాం



**ధరూర్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** వరుస సెలవుల నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు సందర్శనకు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం కావడంతో పాటు సెలవు దినాలు కొనసాగుతుండటంతో తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. పర్యాటకుల రద్దీ కారణంగా జూరాల ప్రాజెక్టు ప్రధాన ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల వద్ద వాహనాలు బారులు తీరాయి. దీంతో పలుచోట్ల భారీ ట్రాఫిక్ జాం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. జూరాల ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులతో ప్రాజెక్టు ప్రాంతం కళకళలాడింది. స్థానిక వ్యాపారులు, చిన్నచిన్న వ్యాపార కేంద్రాలు కూడా సందర్శకులతో రద్దీగా కనిపించాయి.

## డీఈఓపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన పి.ఆర్.టి.యు, టి.పి.యు.ఎస్ సంఘాలు

**యాచారం, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులను నిర్వహిస్తున్న జిల్లా విద్యాధికారిపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మందలించడాన్ని పి.ఆర్.టి.యు, టి.పి.యు.ఎస్ ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నేతలు తీవ్రంగా ఖండించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మిగులు ఉపాధ్యాయుల గుర్తింపు అనేది పూర్తిగా ప్రభుత్వ ఆదేశాలు, జీవో నెంబర్ 25 నిబంధనల మేరకే జరిగిందని వారు స్పష్టం చేశారు. మండల విద్యాధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి, సీనియారిటీ ప్రకారమే మిగులు ఉపాధ్యాయుల వివరాలను సేకరించారని పేర్కొన్నారు. ఆ నివేదికల ఆధారంగా, ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలలకు వారిని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ అధికారిక అనుమతితోనే జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ఈ ప్రక్రియలో జిల్లా విద్యాధికారి సొంతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని, కేవలం నిబంధనలను మాత్రమే అమలు చేశారని వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే, డీఈఓ ఇష్టానుసారంగా వ్యవహరించారని ఎమ్మెల్యే భావించడం, వారిని మందలించడం సరికాదని సంఘాల నేతలు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పనిచేసే అధికారులపై ఇలాంటి చర్యలు సమంజసం కాదని, ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల




**సంగారెడ్డి, ఆగస్టు 16 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు కేకే భవన్ లో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రం విడుదల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఖాళీ ఉన్న ప్రభుత్వ పోస్టులు భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 20న సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని కేంద్ర బీజేపీ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని అన్నారు. కేంద్రప్రభుత్వ శాఖల్లో 10లక్షలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలనారు. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్స్ ఇచ్చి భర్తీ చేయాలని అన్నారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసి, భర్తీ చేయాలని అన్నారు. డీఎస్సీ, జెఎల్, డీఎల్, గ్రూప్-1,2,3,4లతో పాటు, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు నెలకు రు.5000లు నిరుద్యోగ భృతి ఇవ్వాలని అన్నారు. ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవోలను తొలగించి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. స్థానిక పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగాలు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. రాజయ్య, మాణిక్, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, నాయకులు రమేష్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 ఆగస్టు 2026

# పామ్ ఆయిల్ సాగుపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి

- తన వ్యవసాయ పొలంలో సాగు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి) :** ఒకవైపు సమర్థవంతమైన ప్రజా పాలన కొనసాగిస్తూనే, మరోవైపు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన వ్యవసాయ పొలాన్ని కుమారుడు నవనీత్ రెడ్డితో కలిసి సందర్శించిన ఆయన, పామ్ ఆయిల్ తోట ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. పామ్ ఆయిల్ సాగుకు అనుకూలమైన పరిస్థితులు, తోట ఏర్పాటుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందితో ఎమ్మెల్యే చర్చించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ రైతులకు ఆదాయం పెంచే పామ్ ఆయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మామిడి తోటను పరిశీలించిన ఎమ్మెల్యే చెట్ల ఎదుగుదల, తోట ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెట్లకు అవసరమైన ఎరువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు



తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మామిడి దిగుబడి ఆశించిన స్థాయిలో రావాలంటే సరైన సమయంలో అవసరమైన పోషకాలను అందించడంతో పాటు, తెగుళ్లు, పురుగుల నివారణకు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. తోటను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చెట్ల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని సూచించారు. అనంతరం తనకు ఎంతో ఇష్టమైన ఆవుల బాగోగులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వాటి ఆరోగ్యం, సంరక్షణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని, స్వయంగా ఆవులకు అరటి పండ్లు తినిపించారు. ఆవులను జాగ్రత్తగా సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.

### నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి పట్టణంలోని కళ్యాణ సాయి గార్డెన్స్‌లో నిర్వహించిన వివాహ వేడుకకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశి రమేష్ యాదవ్, దేశి జయమ్మ దంపతుల కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పరస్పర అనురాగంతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ




**మెదక్ టౌన్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** మెదక్ హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ లెవల్ కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. త్నమాందో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయస్థాయి పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్-10 టీమ్ కటాస్ విభాగంలో మెదక్ పట్టణానికి చెందిన సహాస్, ప్రణయ్, జున్ను అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. దీంతో మెదక్ పట్టణానికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రెంజుకి షోటోకన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షులు మాస్టర్ నగేష్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో కరాటేలో శిక్షణ పొందుతూ జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్‌తో పాటు కరాటే మాస్టర్లు నవీన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు, కరాటే అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతు బీమా, కల్యాణలక్ష్మి పథకాలపై ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ నిరసన

- బెజ్జంకి మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**బెజ్జంకి, ఆగస్టు 16 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ కూడలి వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు బీమా,కల్యాణ లక్ష్మి పథకాలపై ప్రభుత్వం వైఖరిని పై నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీఆర్ఎస్ మండల నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతు బీమా ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.రైతుల సంక్షేమాన్ని విస్మరించకుండా వెంటనే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే పేద కుటుంబాలకు అండగా నిలిచే కల్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని కోరారు.రైతులు,పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదూ అనీ అన్నారు.వెంటనే స్పందించి రైతు బీమా,కల్యాణ లక్ష్మి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న,నాయకులు లింగాల లక్ష్మణ్,కనగండ్ల తిరుపతి,కచ్చు రాజయ్య,ముక్కిస తిరుపతి రెడ్డి,ఉప సర్పంచ్ దుమాల మహేష్,ఎల శేఖర్ బాబు, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల నర్స,ఎలుక దేవయ్య,వంగల నరేష్ పటేల్,అయిలేని నరసింహారెడ్డి,బండి రమేష్,పరశు రాములు,శివ,మహేష్వెంకటేష్,బాబుమియా,శంకర్,మాషం బాబు,రామ్ రెడ్డి,లింగాల బాబు,గణపురం మల్లయ్య,బొమ్మిడి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి

- ఎస్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు పులిపాటి లక్ష్మణ్

**మల్దకల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో ఎస్ టియుటిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారంజిల్లా అధ్యక్షులు పులిపాటి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ డీఏలు విడుదల చేస్తామని, పి ఆర్ సిని అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయకపోవడం చాలా బాధాకరమని,ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఆరు డీఏలు విడుదల చేయాలని,పిఆర్ సిని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి ఈ హెచ్ ఎస్ కు 1.5% జీతం కట్ అయిన ఇంతవరకు హెల్త్ కార్డ్స్ ఇవ్వకపోవడం, పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం చాలా దారుణమైన విషయమని అన్నారు.ఎస్ టి యు టి ఎస్ సంఘ తరపున త్వరలో పోరాటం చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని, అలాగే ఏర్పడిన ఖాళీలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్



చేశారు.సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధించాలన్నారు. డీఎస్సీ- 2008 ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులరైజేషన్ చేసి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సంఘ సభ్యత్వంను చురుకుగా చేయించాలని, సంఘ 80వ వసంతోత్సవాలను ఘనంగానిర్వహించుటకు సంఘ సభ్యులు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి.యూనుస్ పాష,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ నాయక్,జిల్లా ఆర్థిక కార్యదర్శి విజయభాస్కర్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేష్,భీమన్న, సురేందర్రావు, మండలాల అధ్యక్ష కార్యదర్శులు,ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మండలం పరిధిలో మేకలసోంపల్లి, కుర్తిరావులచెరువు గ్రామాలలో ఆదివారం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరు కాగామేకల సోంపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరికుఇల్లు,కుర్తిరావులచెరువు గ్రామానికి చెందిన సువార్తమ్మనిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగిందని దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్నత్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డికి,గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి, కృతజ్ఞతలు



తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిసారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో మంత్రికి, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,సర్పంచ్ రాముడు, నాయకులు రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్,వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,శివ, అహ్మద్,భాస్కర్ గౌడు, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల సాధనకు కృషి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కార్యవర్గ నియామకం
- కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా పోలె లక్ష్మయ్య




**ఉర్కొండ, ఆగస్టు 16 (జనం సాక్షి) :** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కల్వకుర్తి నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన పోలె లక్ష్మణ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షులు దైనంపల్లి మల్లికార్జున్ లు ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వికలాంగుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమం, వికాసానికి లక్ష్మణ్ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జాతీయ, రాష్ట్ర నాయకులు ఆకాంక్షించారు. అనంతరం నూతన అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన జాతీయ, రాష్ట్ర , జిల్లా కమిటీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వికలాంగుల సమస్యల పరిష్కారానికి, వారి న్యాయమైన హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని, సంస్థ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్



**మక్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణ కేంద్రంలోని నెహ్రూగంజ్ ఆవరణలో గల షాప్ నంబర్-6 వద్ద ఆదివారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు ముఖ్య అతిథిగా హాజరై కార్డులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్న బియ్యం, నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, సీనియర్ నాయకులు కట్టా సురేష్, కౌన్సిలర్లు శ్రీవిద్య నీలగౌడ్, రహీం పటేల్, నీలప్ప, మహేష్ కుమార్, వెంకటేష్, సరిత గోవింద్ రావ్, పీకే నర్సింహా, డీలర్ అమర్ రెడ్డి, ఆర్ఎంపీ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ ఫయాజ్, ఎం. శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు షంషోద్దీన్, ఉసాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- ట్రిబుల్ ఐటీ విద్యార్థులకు ద్యాప నిఖిల్ రెడ్డి ఆర్థిక చేయూత

**ఉర్కొండ, ఆగస్టు 16 (జనం సాక్షి) :** మండలంలోనీ గ్రామాలలో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయము అందిస్తున్న మాదారం మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ద్యాప నిఖిల్ రెడ్డి మరోసారి తమ సేవ గుణాన్ని చాటుకున్నారు.చదువులో ప్రతిభ కనబరచిన పేద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ద్యాప నిఖిల్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. ఉర్కొండ మండలంలోని ఉర్కొండ పేట జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన నౌషిన్ బేగం, సిరిగిరి ఇందులు ట్రిబుల్ ఐటీ బాసరలో సీట్లు సంపాదించారు. వారి ఉన్నత విద్యకు అండగా నిలిచేందుకు నిఖిల్ రెడ్డి ఒక్కొక్కరికి 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం, స్థానిక సర్పంచ్ రషీద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్, వార్డుసభ్యులు, గ్రామస్తులు వహిదోద్దీన్, పాఠశాల




ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేధించాలని, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ట్రిబుల్ ఐటీలో సీటు రావడం గ్రామానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు నిఖిల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## అప్రమత్తతో సైబర్ నేరాలను అడ్డుకోగలం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోవాలని జిల్లా ఎస్పీ వినీత్ కుమార్ అన్నారు.ప్రస్తుత సమా జంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో ఆయన ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తత తోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియా లలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోస గాళ్ల చేత మోసపోయి నట్లయితే వెంటనే గోల్డెన్ హవర్ లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబ ర్ క్రైమ్ నేరస్తులు వినియో గిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సై ట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు.సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యం గా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వె స్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# వాజ్‌పేయ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం

- జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 16 (జనం సాక్షి) :** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ 8వ వర్ధంతి సందర్భంగా బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్. లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పాయ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రధానమంత్రిగా ఆయన గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ కోసం స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టు, టెలిఫోన్ కనెక్టివిటీ, గ్యాస్ కనెక్షన్ల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సుదీర్ఘకాలం ప్రతిపక్ష నేతగా కొనసాగిన వాజ్‌పాయ్ 1996లో తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 13 రోజుల పాటు, 1998లో రెండోసారి ప్రధానమంత్రిగా 13 నెలల పాటు కొనసాగారని గుర్తుచేశారు. అనంతరం కేవలం ఒక్క ఎంపీ ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఏర్పడినప్పటికీ, రాజకీయ



భేరసారాలకు పాల్పడకుండా రాజీనామా చేసి హుందాగా ఎన్నికలకు వెళ్లిన మహానేతగా వాజ్‌పాయ్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. సుమారు ఐదు దశాబ్దాల పాటు పార్లమెంటరీ రాజకీయాల్లో కొనసాగి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో శాంతి కోసం వాజ్‌పాయ్ చేపట్టిన బస్సు యాత్రను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అయితే అనంతరం పాకిస్థాన్ కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడగా, భారత సైన్యం ధైర్యసాహసాలతో ఎదుర్కొని విజయం సాధించిందన్నారు. అంతర్జాతీయ ఒత్తిళ్లను లెక్కచేయకుండా పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిన దూరదృష్టి కలిగిన పరిపాలనాదక్షుడని కొనియాడారు. వాజ్‌పాయ్ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించిందని తెలిపారు. అనారోగ్య కారణాలతో అవార్డును స్వీకరించేందుకు ఆయన వెళ్లలేని పరిస్థితిలో అప్పటి రాష్ట్రపతి స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి భారతరత్నను అందజేశారని గుర్తుచేశారు. అనంతరం అనారోగ్య సమస్యలతో 2018 ఆగస్టు 16న ఢిల్లీలో వాజ్‌పాయ్ తుదిశ్వాస విడిచారని అన్నారు. వాజ్‌పాయ్ ఆశయాలు, దేశసేవా స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలని ఆర్. లోకనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. అనుజ్ఞా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బాసెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కటమోని కృష్ణ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, పట్టణ కార్యదర్శి చినరాయుడు, కంటెస్టెడ్ కౌన్సిలర్ గంధం బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు పండుగకు వెళ్తుండగా విషాదం

- బైక్‌ను ఢీకొన్న లారీ
- యువతి మృతి.. తల్లిదండ్రులకు గాయాలు



రాయపర్తి, ఆగస్టు16 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో ఉంటున్న ఓ కుటుంబం తమ స్వగ్రామానికి బోనాల పండుగకు వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందగా,తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం నస్కూర్ గ్రామానికి చెందిన గూబ సురేష్,గూబ ఉమారాణి దంపతులు హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో నివాసం ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.తమ స్వగ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహిస్తుండటంతో బంధువుల ద్వారా తెలుసుకున్న సురేష్ తన భార్య ఉమారాణి,కుమార్తె శ్రావణి (30)తో కలిసి తమ టూ వీలర్‌పై స్వగ్రామానికి బయలు దేరారు.ఈ క్రమంలో మేడ్చల్ బైపాస్ రోడ్డుపై ఓ లారీ అజాగ్రత్తగా,అతివేగంతో వచ్చి వీరు ప్రయాణిస్తున్న టూవీలర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో శ్రావణి అక్కడికక్కడే మృతి చెందగా,సురేష్,ఉమారాణికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో నస్కూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



గూడూరు, ఆగస్టు 16 (జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో శనివారం రాత్రి పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు లక్ష్మీపురం గ్రామంలోని సిద్ధి వినాయక రైస్ మిల్ వద్ద ఎస్ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అక్కడ అశోక్ లేలాండ్ వాహనం నెం.టి ఎస్ -08-యుజె - 7989లో అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. 25 క్వింటాళ్లు,విలువ సుమారు రూ.75,000 వేలు ఉంటుందని, అనంతరం వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొర్రా వెంకన్న (24) చిర్రకుంటతండా, అ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా పొనుగోడు గ్రామానికి చెందిన మేడి మల్లేశం తండ్రి శంకరయ్య, వయస్సు 49 సం,,లు. పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలించినట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని సిద్ధి వినాయక రైస్ మిల్ యజమానులు సామ వెంకట్ రెడ్డి,షేక్ అంకుష్లకు అప్పగించేందుకు తీసుకువచ్చారాని విచారణలో వెల్లడైంది. అనంతరం సంబంధిత వ్యక్తులపై విచారణ కొనసాగిస్తున్నామని, పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసిన,నిల్వ చేసిన , రవాణా చేసిన లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

## జైనూరు కేజీబీవీ, హాస్టల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



జైనూర్, ఆగస్టు16(జనం సాక్షి) : జైనూరు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీ బీవీ) జిల్లా కలెక్టర్ కే.హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని తరగతి గదులు, వంటగది, పరిసరాలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం అధికారులకు, హాస్టల్ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. హాస్టల్ ప్రాం గణంతో పాటు వంటగది, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత చదువులపై ప్రత్యేకంగా మాట్లాడారు. లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై పలు సలహాలు, విలువైన మార్గదర్శకాలను అందించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గొండ్వానా ఆధ్వర్యంలో మహా పాదయాత్ర

- ఏదిరనుండి భద్రాచలం వరకు..
- జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర



నూగూర్ వెంకటాపురం ఆగస్టు 16(జనం సాక్షి) : ఆదివారం నాడు గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మరియు భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని ఆగస్టు 17 నుండి ఏదిర గుట్టల శ్రీ సమ్మక్క సారక్క ప్రాంగణం నుండి భద్రాచలం ఐటీడీఏ వరకు గోండ్వానా మహా పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసి ఎమ్మెల్యేలందరూ వర్షాకాల అసెంబ్లీ సమావేశంలో తీర్మానాలు చేయాలని లేదంటే తన జాతికే ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారని ఆయన అన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో బూర్జువ రాజకీయ పార్టీలే 1/7శీ చట్టంపై దాడులు చేస్తున్నారని అందుకే బూర్జువ రాజకీయ పార్టీలను ఏజెన్సీ ప్రాంతాల నుండి తరిమికొట్టాలని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు చట్టానికి విరుద్ధంగా భూములు అక్రమంగా కొనుగోలు చేయడం ప్రభుత్వ భూములను దౌర్జన్యంగాక్రమించుకోవడం ఇది చట్టానికి విరుద్ధమని అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల నుండి గిరిజనేతర్లను మైదాన ప్రాంతానికి తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసి యువతకు ఆదివాసి చట్టాలపై జీవోలపై అవగాహన ఉంటుందని లేదంటే ఏజెన్సీ ప్రాంతం మొత్తం బూర్జువ రాజకీయ పార్టీల చేతిలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని అందుకే గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని జీఎస్పీ డిమాండ్ చేస్తుందని, రాజకీయ పార్టీలను ఏజెన్సీ ప్రాంతం నుండి ఎప్పుడైతే బహిష్కరిస్తామో అప్పుడే ఆదివాసి చట్టాలు జీవోలు అమలు అవుతాయని ఆయన అన్నారు. ఆదివాసి యువతకు న్యాయ విద్య ఉంటేనే ఆ యువత రాజకీయ పార్టీలను ఎదురుకుంటారని అన్నారు.ఏజెన్సీ ప్రాంతాలలో జీవో నెంబరు 3 నీ పునరుద్ధరించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు.జీవో నెంబర్ 3 లేక ఆదివాసి యువత నిరుద్యోగులు గా ఉన్నారని అన్నారు.జీవో నెంబర్ 3 రద్దు కావడానికి కారణం ఈ ప్రభుత్వాలేనని ఆయన మండిపడ్డారు. జీవో నెంబర్ 3 రద్దు చేయాలంటే ఏజెన్సీ ప్రాంతాలలో నిజ నిర్ధారణ చేసే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ఆయన ప్రశ్నించారు.నిజ నిర్ధారణ లేకుండానే జీవో నెంబర్ 3 ని రద్దు చేయడం ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా అని ఆయన ప్రశ్నించారు.జీవో నెంబర్ 3 ని తక్షణమే చట్టం చేసి ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రేపు జరగబోయే గోండ్వానా మహా పాదయాత్రను జయప్రదం చేయాలని మీడియా ద్వారా ఆదివాసులకు పిలుపునిచ్చారు.

# ములుగు సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, ఆగస్టు 16(జనంసాక్షి) : ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వం లో ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన నిధులు కేటాయించి పనులను వేగవంతం చేస్తోందని పేర్కొన్నారు. ములుగు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరైన సందర్భంగా మంత్రి సీతక్క వారికి ఘన స్వాగతం పలికారు.

### ములుగు నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు

ములుగు నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా గృహ నిర్మాణానికి సంబంధించి ములుగు నియోజకవర్గానికి 5,000 ఇళ్లను కేటాయించడం ప్రభుత్వానికి ఈ ప్రాంత అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సాగునీటి రంగంలో రూ.200 కోట్లతో పోట్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప-లక్నవరం అనుసంధాన పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రైతులకు సాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు వ్యవసాయ రంగానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. సమ్మక్క-సారలమ్మ సన్నిధి అభివృద్ధితో పాటు జిల్లాలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీతక్క తెలిపారు. నర్సింగ్ కళాశాలల ఏర్పాటు, వైద్య విద్యా సదుపాయాల విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ములుగు ప్రాంత ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచేలా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

### తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు

గత పాలకులు ఎన్నికల సమయంలో శంకుస్థాపనలు చేయడం, ఆ తర్వాత నిధులు కేటాయించకుండా పనులను నిలిపివేయడం జరిగిందని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను విడుదల చేసి, నిలిచిపోయిన పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, ప్రజలు వాస్తవాలను గమనించాలని మంత్రి సీతక్క కోరారు. ములుగు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## పంకెనలో ఉచిత రేషన్ పథకాలు వర్తించవా?

- తలుపులు మూసిన రేషన్ షాపు.. ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలు
- ఒకటో తారీఖు దాటినా అందని బియ్యం.. అధికారులు వెంటనే స్పందించాలి




పలిమెల, ఆగస్టు 16 (జనం సాక్షి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పలిమెల మండలం పరిధిలోని అత్యంత మారుమూల గ్రామైన పంకెనలో నిరుపేదల ఆకలి కేకలు నింగినంటుతున్నాయి. ప్రభుత్వం ప్రతినెలా అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం కోసం గ్రామ ప్రజలు కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురుచూస్తున్నారు. ప్రతినెలా ఒకటో తారీఖునే అందాల్సిన బియ్యం, రోజులు గడుస్తున్నా లబ్ధిదారులకు అందకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం, వేదన వ్యక్తం చేస్తున్నారు.

### నేమ్ బోర్డు లోపల పెట్టి తాళం వేశారా..?

గ్రామంలో రేషన్ షాపు ఉన్నప్పటికీ నిత్యం తాళం వేసే ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. రేషన్ షాపు నేమ్ బోర్డును సైతం బయట పెడితే ఎవరైనా ఎత్తుకెళ్తారనే నెపంతో లోపల పెట్టి తాళం వేశారా? లేక లబ్ధిదారులకు సమాచారం తెలియకుండా ఉండేందుకు ఇలా చేస్తున్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. షాపు ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియక కూలీ పనులు మానుకుని చుట్టూ తిరగాల్సి వస్తోందని నిరుపేదలు ఆవేదన చెందుతున్నారు.

### మా గ్రామానికి సంక్షేమ పథకాలు వర్తించవా..?

"మిగతా ప్రాంతాల్లో రేషన్ బియ్యం సక్రమంగా అందుతుంటే.. మా పంకెన గ్రామానికి వచ్చేసరికి ఎందుకీ నిర్లక్ష్యం? మాకు ఉచిత సంక్షేమ పథకాలు వర్తించవా?" అని పంకెన గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు బియ్యం రాక తీవ్ర అవస్థలు పడుతున్నాయి.

### ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి!

ఈ గ్రామంలో నిరుపేదల ఆకలి గోడును ఆలకించే నాథుడే లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు తక్షణమే స్పందించాలి. పంకెన గ్రామంలో నిలిచిపోయిన రేషన్ బియ్యాన్ని వెంటనే పంపిణీ చేయించి, షాపు నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## సీఎంకు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (జనంసాక్షి) : పరకాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు నుంచి పరకాలకు హెలికాప్టర్‌లో సాయంత్రం చేరుకున్నారు. సీఎం అయిన తర్వాత మొదటిసారిగా పరకాల కు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అద్దూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క,టీపీసీసీ అధ్యక్షుడు శ్ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

## బోనాల వేడుకల్లో కొలుకొండ సందడి..

- అమ్మవారిని దర్శించుకున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఆగస్టు 16 (జనం సాక్షి): జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కొలుకొండ గ్రామంలో బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని బోనం ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పత్రికా విలేకరిపై జరిగిన దాడి మానవ హక్కుల ఉల్లంఘనే

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే..
- నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు మంగళంపల్లి హుస్సేన్



పెద్దవంగర, ఆగస్టు 16 (జనం సాక్షి) : పత్రికా విలేఖరి పై జరిగిన దాడి ముమ్మాటికి మానవ హక్కుల ఉల్లంఘనేనని నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయాధ్యక్షులు మంగళంపల్లి హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలో కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మంగళంపల్లి హుస్సేన్ మాట్లాడుతూ వడ్డే కొత్తపల్లి గ్రామంలో ఇటీవల పత్రిక విలేకరు కుమ్మరి రామ్మూర్తిపై జరిగిన దాడి ని తీవ్రంగా ఖండించారు. కుమ్మరి రామ్మూర్తి జర్నలిస్టుగా మరియు మానవ హక్కుల సంఘం లో పనిచేస్తూ వివిధ సేవలు చేసినటువంటి వ్యక్తి అని అలాంటి వ్యక్తిని పట్టుకొని దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. పత్రికా విలేకరులు జీతం లేకుండా ప్రజాస్వామ్యంలో సోషల్ వర్కర్ గా పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాలకు తెలియపరుస్తూ ఉంటారని అలాంటి వారి పై దాడి చేసి సెల్ ఫోన్ లాక్కోవడం పత్రిక స్వేచ్ఛను హరించడమేనని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరులపై జరుగుతున్న దాడులపై ధర్నాలు నిరసనలు ఆందోళన చేయడానికి వెనకాడబోమని దాడి చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుమ్మరి రామ్మూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇరువర్గాల మధ్య ప్లెక్సీ చించుకున్నారని సమాచారంతో ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తుండగా ప్లెక్సీని ధ్వంసం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశబోయిన సుభాష్, బొల్లు ఉషయ్య, దంతాలపల్లి రవి, బండారి వెంకన్న, లు నాపై ఆకారణంగా దాడి చేసి , నా దగ్గర ఉన్న ఫోన్ లాక్కొని ,భయభ్రాంతులకు గురిచేసారని మండల కేంద్రంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనకు జరిగిన అన్యాయాన్ని గురించి వివరించాడు. నా మీద చేసిన కాంగ్రెస్ నాయకులపై చట్టరీత్య చర్య తీసుకోవాలని తీసుకోవాలని, నాపై దాడి చేసిన వారు ఇసుక దందాలు భూమాఫ్యాయాలు గ్రామంలో ప్రజలను బెదిరించే ప్రయత్నాలు ఎన్నో చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నటువంటి వారిని వెంటనే శిక్షించాలని అన్నారు.



# పెద్ది సేవలు చిరస్మరణీయం

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

నల్లబెల్లి, ఆగస్టు 16 ( జనంసాక్షి): తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పెద్ది స్వగృహంలో కుటుంబ సభ్యులను హుస్సేన్ నాయక్ పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని వారికి భరోసానిచ్చాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో కృషి చేసిన నాయకుడని అన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో పెద్ది కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి నర్సంపేట ప్రాంత ప్రజలకు, ఆయన అభిమానులకు, రాజకీయ వర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- సమన్వయంతో విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు ప్రతినిధి, ఆగస్టు 16(జనంసాక్షి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం మేడారం నుంచి ములుగు వరకు నిర్వహించిన ముఖ్యమంత్రి పర్యటనలో వివిధ కార్యక్రమాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించారని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మేడారంలో సమ్మక్క-సారలమ్మ వనదేవతల దర్శనం, ప్రత్యేక పూజలు, చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీతో పాటు ములుగులో గ్రామీణ రహదారుల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, తెలంగాణ తల్లి విగ్రహం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల ను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన అధికారులను అభినందించారు. పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐటీడీఏ, వైద్య ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రతినిధులు, జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమిష్టి కృషి, సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని, విధుల్లో పాల్గొన్న ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 ఆగస్టు 2026

# ఖమ్మం ప్రజలకు తుమ్మల ఏం చేశారో చెప్పాలి

**● మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అరాచకాలను ప్రోత్సహిస్తున్నారు గతంలో తనపై కాశీం రజ్వీ అంటూ తప్పుడు ప్రచారం చేసిన వారు, ప్రస్తుతం తుమ్మలతో పాటు ఆయన కుమారుడి పక్కన ఉంటూ అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇసుక, మట్టి, భూములు దోచుకంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు కల్పించినా బీఆర్ఎస్ పార్టీతోనే కార్యకర్తలు ఉన్నారు పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి జరిగింది ఖమ్మం అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకునే విధంగా ఏం చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అనని తుమ్మలను కేసీఆర్ మంత్రిని చేశారు తుమ్మల ఏ పార్టీలో ఉన్నా మంత్రి పదవిని అనుభవించారు కానీ ఖమ్మం ప్రజలకు మాత్రం ఏమి చేశారో చెప్పాలి. తాను ఖమ్మం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తాను అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు నాలుగు దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబానికి ఖమ్మం నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. అసలు పాత కాంగ్రెస్ కంటే కొసరు కొత్త కాంగ్రెస్ నాయకులే ఎక్కువ హడావుడి చేస్తున్నారు ఇదే విషయాన్ని కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు.



సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి నిర్మాణం పూర్తయిన ఏడాదికే కాలువ సీసీ లైనింగ్ కూలిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన దేవరపల్లి--ఖమ్మం జాతీయ రహదారికి క్రెడిట్ తీసుకునేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరాటపడుతున్నారు. ఆ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి, రోజుకో ప్రమాదం చోటుచేసుకుంటున్నప్పటికీ ప్రజల భద్రతపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు. మున్నేరుపై తీగల వంతెన, రక్షణ గోడలు, ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణాలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది వాటికి నిధులు విడుదల చేసి, జీవోలు జారీ చేసింది నాటి కేసీఆర్ ప్రభుత్వమే మున్నేరు వరద బాధితులకు శాశ్వతంగా అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నాం ఖమ్మం బస్‌స్టాండ్‌ను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తే, దానిపై అనేకమంది విమర్శలు చేశారు గోళ్లపాడు చానల్‌ను సుందరంగా తీర్చిదిద్దింది కూడా కేసీఆర్ ప్రభుత్వమే ఎవరి ఉడత ఊపులకు భయపడేది లేదు తగిన సమాధానం చెప్పే బాధ్యత తాను తీసుకుంటాను అసలు వడ్డీతో సహా చెల్లిస్తాం వచ్చేది మన ప్రభుత్వమే..

వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల సంఘం నేడు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ని కలిసి, తమ బాధలను విన్నవించి, ఆదుకోవాలని కోరారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగుమట్ల భుదాన్ భూముల్లో ఇళ్ళను కూల్చివేసి రోడ్డున పడేసి జైళ్ళలో పెట్టిన వారికి బాధితులకు అండగా నిలబడి భోజనం, మంచినీళ్లు,మెడికల్ క్యాంపులు పెట్టి ఆదుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి బాధితుల సంఘం కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇళ్ళు కోల్పోయిన బాధితుల తరపున పోరాడి మరలా ప్రభుత్వం దిగివచ్చి ప్లాట్లు ఇచ్చేవరకు అండగా ఉన్నందుకు ధన్యవాదములు తెలిపారు. మరలా రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఇళ్ళు కోల్పోయిన వారికి పక్క ఇళ్ళు నిర్మించి ఇస్తామని పువ్వాడ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ విందుకు హాజరైన సీఎం



**నిజాంసాగర్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె జొనిట వివాహ విందు వేడుకకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఘన స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. వివాహ విందు వేడుకలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుటుంబ సభ్యులను ఆత్మీయంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి హాజరుతో జొనిట వివాహ విందు వేడుకకు ప్రత్యేక శోభ చేకూరింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్‌కుమార్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ విందు సందర్భంగా రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో కార్యక్రమం ఘనంగా, సందడిగా సాగింది.

## జాతీయ జెండాకు అవమానం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (జనం సాక్షి) :** కమ్మర్ పల్లి మండలంలోని హాసకొత్తూరు (పేట) గ్రామంలో శనివారం రోజున స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలలో జాతీయ జెండాను ఎగరవేశారు. సాయంత్రం ఐదు గంటలకు జాతీయ జెండాను నిష్క్రమణ చేయాల్సిన నిబంధనలు ఉండగా హాస కొత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రోజున మధ్యాహ్నం వరకు జాతీయ జెండాను నిష్క్రమించకుండా జాతీయ జెండాను అవమానించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే జాతీయ జెండాను అవమానిస్తే ఇక విద్యార్థులకు వీరు జాతీయ జెండా గురించి దేశం గురించి తరగతి గదిలో ఏం నేర్పుతున్నారని విమర్శ వస్తుంది. జాతీయ జెండాను అవమానించిన వారిపై విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కొండమల్లేపల్లి బస్టాండులో అపరిశుభ్రం


**● దుర్వాసనతో ప్రయాణికుల అవస్థలు..**
**● పైపుల లీకేజీతో మరింత ఇబ్బందులు**
**● వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల డిమాండ్**

**కొండమల్లేపల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి బస్టాండ్‌లో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్టాండులోని మూత్రశాలలు అపరిశుభ్రంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శలు వస్తున్నాయి. మూత్రశాలల్లో పరిశుభ్రత లోపించడంతో దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలోని కొన్ని పైపులు సక్రమంగా లేకపోవడంతో మూత్ర విసర్జన సమయంలో నీరు, మూత్రం తిరిగి కాళ్లపై పడుతున్న పరిస్థితి ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులతో ప్రయాణించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మూత్రశాలలను ఉపయోగించిన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన వాష్ బేసిన్, నీటి పైపుల వ్యవస్థ కూడా సరిగా పనిచేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో చేతులు కడుక్కోవడానికి సరైన నీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో బకెట్లలో నీటిని ఉంచుతున్నప్పటికీ అవి పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రజారోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. మూత్రశాలల పరిశుభ్రత, నీటి సరఫరా, పైపుల మరమ్మతులు వంటి



కనీస సౌకర్యాలను వెంటనే మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండులోని మూత్రశాలల దుస్థితిపై గతంలోనే సంబంధిత డీఎంకు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని ప్రయాణికులు చెబుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్టాండులో ఇలాంటి పరిస్థితి నెలకొనడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మూత్రశాలలను పూర్తిస్థాయిలో శుభ్రపరచడంతో పాటు దెబ్బతిన్న పైపులు, నీటి సరఫరా వ్యవస్థ, వాష్ బేసిన్లను మరమ్మతు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. బస్టాండులోని ప్రజా సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రయాణికులకు కనీస పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ప్రయాణికులకు డిమాండ్ చేస్తున్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్టులో 12.238 టీఎంసీల నీటి నిల్వ



**నిజాంసాగర్, ఆగస్టు 16 (జనం సాక్షి) :** నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం ఉదయం 6 గంటల 24 గంటల సగటు లెక్కల ప్రకారం ప్రాజెక్టు నీటిమట్టం 1400.80 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం (ఫీ=ూ) 1405 అడుగులు కాగా, ప్రస్తుతం 12.238 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి నీటిమట్టం 1396.25 అడుగులు, నీటి నిల్వ 7.803 టీఎంసీలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం నిల్వ గణనీయంగా పెరిగింది. గత 24 గంటల్లో ప్రాజెక్టులోకి సగటున 467 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి స్పిల్‌వే గేట్లు, జెన్‌కో, ప్రధాన కాలువ, ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేయడం లేదు. ఆవిరి రూపంలో సుమారు 200 క్యూసెక్కుల నీరు నష్టం జరుగుతోంది. దీంతో మొత్తం ఔట్‌ఫ్లో 200 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట ఆలయం



**యాదగిరిగుట్ట టెంపుల్ ఆగస్టు 16 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ఆలయానికి విచ్చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పట్టింది. ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకు న్నారు భక్తులు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నిత్యా కల్యాణం,లడ్డు ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండక్రింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.

## బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లేలా కృషి చేస్తాం

**● కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి హామీ**

**సూర్యాపేట, ఆగస్టు 16 (జనంసాక్షి) :** ప్రతిష్టాత్మకమైన శంషాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను జాతీయ రహదారి65 వెంట ఉన్న ప్రధాన పట్టణాల మీదుగా, సూర్యాపేట జిల్లా కేంద్రం గుండా కొనసాగించాలని కోరుతూ సూర్యాపేట అఖిలపక్ష నాయకుల బృందం ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అఖిలపక్ష నాయకులు కేంద్ర మంత్రిని కలిసి సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాల్సిన ఆవశ్యకతను వివరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి 65పై కీలక ప్రాంతంలో ఉండటంతో పాటు హైదరాబాద్ విజయవాడ మార్గంలో ప్రధాన వాణిజ్య, వ్యవసాయ కేంద్రంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ నడిపితే ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ సాధించాలనే డిమాండ్‌తో అఖిలపక్ష నాయకులు గత నెల రోజులుగా వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. విద్యార్థులు, ఉద్యోగులు,



వ్యాపారులు, రైతులు, ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యం అందించడంతో పాటు సూర్యాపేట ప్రాంత అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అఖిలపక్ష బృందం సమర్పించిన వినతి పత్రాన్ని స్వీకరించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. శంషాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్ జాతీయ రహదారి65 వెంట, సూర్యాపేట పట్టణం మీదుగా సాగేలా తన వంతు పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి గ్రీవెన్స్ డే

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రతి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య, విద్య, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖ, ఫారెస్ట్, అంగన్వాడీ తదితర శాఖల అధికారులు విధిగా హాజరవుతారని తెలిపారు. ఆయా మండలాలకు చెందిన గ్రామ ప్రజలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ యొక్క సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి



**భద్రాచలం, ఆగస్టు 16 (జనంసాక్షి) :** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులను సమర్పించాలని పీఓ సూచించారు. సంబంధిత యూనిట్ అధికారులు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరై, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను స్వీకరించి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల డివిజన్ అధికారులు సకాలంలో హాజరు కావాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సబ్ కలెక్టర్ కోరారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులు వెంటనే స్వీకరించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# నిజామాబాద్ జిల్లాలో పోక్సో కేసుల దర్యాప్తుపై పోలీస్ కమిషనర్ సమీక్ష

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లాలో చిన్నారులపై లైంగిక నేరాలకు సంబంధించిన పోక్సో (ూూజూూ) కేసుల దర్యాప్తు , కేసుల పురోగతిపై ఆదివారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ని మినీ కాన్ఫరెన్స్ హల్ యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చిన్నారులపై లైంగిక దాడులు,లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేసుల్లో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు , నిందితుల గుర్తింపు , అరెస్టులు , సేకరించిన ఆధారాలు , సాక్షుల వివరాలు , బాధిత చిన్నారుల వాంగ్మూలాలు , కేసుల ప్రస్తుత స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందనే విషయాన్ని క్షుణ్ణంగా సమీక్షించి , పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించారు. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడం , బాధిత చిన్నారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయడంపై పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. పోక్సో కేసుల్లో చిన్నారుల భద్రత , గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , బాధితుల పట్ల సున్నితమైన వైఖరితో వ్యవహరించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ,



అవసరమైన ఎఫ్ఎస్ఎల్ పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయించి నివేదికలు పొందాలని ఆదేశించారు. అదేవిధంగా బాధితులు, నిందితులకు సంబంధించిన మెడికల్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కేసుల్లో లభించిన సీసీటీవీ ఫుటేజీ , మొబైల్ ఫోన్లు , డిజిటల్ ఆధారాలు , ఇతర సాంకేతిక ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించి , వాటిని దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సాక్షుల వాంగ్మూలాలు , ఇతర కీలక ఆధారాలను పకడ్బందీగా నమోదు చేసి కేసులు కోర్టులో బలంగా నిలిచేలా దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. అలాగే ఎఫ్ఎస్ఎల్ నివేదికలు , మెడికల్ రిపోర్టులు , ఇతర దర్యాప్తు ప్రక్రియలు పూర్తయిన వెంటనే చార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. పోక్సో కేసుల్లో చార్జ్‌షీట్ ఫైలింగ్‌లో ఎలాంటి అనవసర జాప్యం ఉండకూడదని , సాధ్యమైనంత తక్కువ సమయంలో దర్యాప్తును పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి పోక్సో కేసును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని , దర్యాప్తులో ఏవైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేసుల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించి , బాధిత చిన్నారులకు సత్వర న్యాయం అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులపై జరిగే లైంగిక నేరాల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని , నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా వేగవంతమైన , శాస్త్రీయ , నాణ్యమైన దర్యాప్తు చేపట్టడమే లక్ష్యమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్,వెంకటేశ్వర రెడ్డి , శ్రీనివాస్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి , మల్లేషం , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య మరియు సిఐలు ఐటి కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుప్పు పట్టిన సలాకతో నిర్మాణం నిలిచేనా..?



**గంభీరావుపేట, ఆగస్టు 16 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పీజీ కళాశాల భవన నిర్మాణ పనులపై నాణ్యతకు సంబంధించి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ తుప్పు పట్టిన సలాకలు, నాణ్యత లేని ఇసుకను వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సి ఉండగా, తుప్పు పట్టిన ఇనుప సలాకలను వినియోగించడం, నాణ్యత లేని ఇసుకను ఉపయోగించడం వల్ల భవనం పటిష్ఠతపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కళాశాల భవన నిర్మాణంలో ఇలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని వారు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే నిర్మాణ పనులను పరిశీలించి, సలాకలు, ఇసుకతో పాటు ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి నాణ్యతను పరీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవు

ప్రభుత్వ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణ పనుల నాణ్యతపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.




## రూ.45,000 కోట్ల మూలధనం కోసం

### బ్యాంకులతో వొడాఫోన్ ఐడియా చర్చలు

**న్యూఢిల్లీ:**తమ రూ.45,000 కోట్ల మూలధన ప్రణాళిక అమలు కోసం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం నుంచి రుణాలు తీసుకునేందుకు వొడాఫోన్ ఐడియా చర్చలు జరుపుతోందని సీఈఓ అభిజిత్ కిశోర్ వెల్లడించారు. కంపెనీ ఇప్పటికే రూ.6,400 కోట్లు సమీకరించిందని తెలిపారు. ఇందులో వారెంట్ల ద్వారా వచ్చిన రూ.1,183 కోట్లతో పాటు ఈసీబీ, ప్రైవేట్ బ్యాంకుల రుణాలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎస్‌బీఐ నేతృత్వంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులతో చర్చలు జరుపుతున్నామని, మరికొన్ని రుణ మార్గాల్లోనూ ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. నెట్‌వర్క్ విస్తరణ కోసం కంపెనీ తాజాగా సుమారు రూ.9,100 కోట్ల ఆర్డర్లు ఇచ్చినట్లు వెల్లడించారు. 4జీ సైట్లు నెలకు సగటున 3,500 నెలకొల్పాలని చూస్తున్నట్లు కిశోర్ చెప్పారు. 40.8 కోట్ల నుంచి 19.31 కోట్లకు: వొడాఫోన్, ఐడియా సంస్థలు విలీనమైనప్పుడు 40.8 కోట్ల మంది చందాదారులతో దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా వొడాఫోన్ ఐడియా (వీఐ) ఉండేది. అయితే రిలయన్స్ జియో అతితక్కువ టారిఫ్ విధానాలకు తోడు, నెట్‌వర్క్ విస్తరణ చేయలేకపోవడంతో చందాదారుల సంఖ్య ప్రస్తుతం 19.31 కోట్లకు పరిమితమైంది. 2024 సెప్టెంబరు నుంచి నెట్‌వర్క్ విస్తరణ, 5జీ సేవలపై దృష్టి పెట్టడంతో.. చాలాకాలం తరవాత 2026 జూన్ త్రైమాసికంలో వీఐ చందాదారుల సంఖ్యలో మళ్లీ వృద్ధి నమోదైంది. ప్రస్తుతం సంస్థకు 5జీ సైట్లు 16,000 ఉన్నాయి. రెండు త్రైమాసికాల్లో మరో 200కు పైగా నగరాలకు ఈ సేవలను విస్తరించాలని భావిస్తున్నామని కిశోర్ తెలిపారు.

## మనదేశంలోనూ ఐఫోన్ 18 ప్రో సిరీస్ తయారీ

### అత్యధికం అమెరికా, ఐరోపాలకే

**న్యూఢిల్లీ:**అమెరికా టెక్ దిగ్గజ సంస్థ యాపిల్, ఈ ఏడాది విడుదల చేయనున్న ఐఫోన్ 18 సిరీస్‌లో ప్రీమియం మోడళ్లు ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ఉత్పత్తిని మనదేశంలో ప్రారంభించింది. సెప్టెంబరులో ఈ ఫోన్లను సంస్థ అంతర్జాతీయంగా ఆవిష్కరించనుంది. వీటికి అధిక గిరాకీ లభిస్తుందని భావిస్తున్న అమెరికా, ఐరోపా మార్కెట్లలో విడుదల చేయడానికి వీలుగా, వీటి తయారీని మన దేశంలోని ప్లాంట్లలో ఉత్పత్తి చేస్తోందని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. ఇక్కడ తయారయ్యే ఐఫోన్ 18 ప్రో సిరీస్ ఫోన్లలో అత్యధికం అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి కానున్నాయి. దేశీయంగా కొన్నింటిని విక్రయించనున్నారు. ఐఫోన్ల తయారీలో ఫాక్స్‌కాన్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ ఏడాది టాటా ఎలక్ట్రానిక్స్ కూడా తమ ప్లాంట్లలో ఐఫోన్ల ఉత్పత్తి పెంచుతోంది. ఇంతకుముందు ఐఫోన్ బేస్ మోడళ్ల తయారీ టాటా ప్లాంట్లలో సాగింది. ఈసారి ప్రో మోడళ్ల తయారీలోనూ సంస్థ దూసుకెళ్లనుంది. అంతర్జాతీయ సరఫరా కోసం ఐఫోన్ల తయారీ బాధ్యతలను తమిళనాడులోని ఫాక్స్‌కాన్ ప్లాంట్ చూసుకోనుంది. వచ్చే నెల (2026 సెప్టెంబరు)లో యాపిల్ నిర్వహించే వార్షిక కార్యక్రమంలో ఐఫోన్ 18 సిరీస్‌తో పాటు తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# పండగల వేళ 'క్విక్' కొలువులు..

### 3 లక్షల వరకూ తాత్కాలిక నియామకాలు

### దేశవ్యాప్తంగా రూ.95,000 కోట్లకు చేరిన క్విక్-కామర్స్ మార్కెట్




**హైదరాబాద్:** దేశంలో రిటెయిల్ రంగాన్ని క్విక్ కామర్స్ (నిమిషాల్లో డెలివరీ) వేగంగా మార్చేస్తోంది. నగరాలు, పట్టణాల్లో ఇప్పుడు ఇది కొత్త అలవాటుగానూ మారింది. ఈ మార్కెట్ విలువ ప్రస్తుతం మన దేశంలో రూ.95,500 కోట్లకు చేరిందని అంచనా. ఈ నేపథ్యంలో రాబోయే సుదీర్ఘ పండగ సీజన్‌ను పురస్కరించుకొని, ఈ రంగంలో మునుపెన్నడూ లేని విధంగా నియామకాల జోరు సాగుతోంది. గతేడాదితో పోలిస్తే, ఈసారి ఏకంగా 35 శాతం నుంచి 40 శాతం వరకూ అదనపు నియామకాలతో, సుమారు 3 లక్షల వరకూ కొత్త గిగ్ ఉద్యోగాలు లభించనున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉద్యోగ నియామకాల సంస్థ టీమ్‌లీజ్.. 'ఫెస్టివ్ సీజన్ వర్క్‌ఫోర్స్-2026' నివేదిక ప్రకారం ఈ పండగల వేళ తాత్కాలిక నియామకాలు 20 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా తాత్కాలిక నియామకాల్లో ఒక్క క్విక్ కామర్స్ రంగమే దాదాపు 60 శాతం వాటా ఉంటుందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ త్రైమాసికంలో దేశ వ్యాప్తంగా దాదాపు 20 లక్షల మందికి పైగా గిగ్ వర్కర్లుగా సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొంటున్నాయి. దేశీయ క్విక్ కామర్స్ రంగంలో మార్కెట్ వాటా కోసం ప్రధాన కంపెనీల మధ్య పోటీ విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విక్రయాల్లో బ్లింకిట్ 46 శాతం మార్కెట్ వాటాతో కొనసాగుతోంది. జొమాటో అండ ఉన్న ఈ సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా 408 నగరాలకు విస్తరించింది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 24 శాతం వాటాతో రెండో స్థానంలో ఉండగా, 22 శాతంతో జెప్టో గట్టి పోటీని ఇస్తోంది. టాటా గ్రూపు యాజమాన్యంలోని బిగ్‌బాస్కెట్ 5-7 శాతం వాటాతో ఉంది. మరోవైపు ఇ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్ నౌ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ప్రవేశంతో మార్కెట్లో మరింత పోటీ పెరిగింది. ముఖ్యంగా ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ప్రతి నెలా సగటున 100 డార్క్ స్టోర్లను ప్రారంభిస్తూ.. ఇతర సంస్థలపై ఒత్తిడిని పెంచుతోంది.

**డార్క్ స్టోర్ల విస్తరణతో**

త్వరిత డెలివరీల కోసం కంపెనీలు ఏర్పాటు చేసే చిన్న గిడ్డంగులైన డార్క్ స్టోర్ల నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తోంది. జులై 2026 నాటికి అయిదు ప్రధాన సంస్థల పరిధిలో దేశవ్యాప్తంగా మొత్తం 5,625 డార్క్ స్టోర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో బ్లింకిట్ అత్యధికంగా 1,955 కేంద్రాలతో అగ్రస్థానంలో ఉంది. మెట్రో నగరాల్లో అద్దెలు, నిర్వహణ ఖర్చులు అధికంగా ఉండటంతో క్విక్-కామర్స్ సంస్థలు రెండు, మూడో శ్రేణి నగరాలపై దృష్టి సారించి, మౌలిక వసతులను వేగంగా విస్తరిస్తున్నాయి.

**నియామకాల ధోరణి మారుతోంది**

ఈసారి నియామకాల ధోరణిలోనూ విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. కేవలం పెద్ద సంఖ్యలో సాధారణ డెలివరీ సిబ్బందిని నియమించుకోవడం కాకుండా, నిర్ణీత నైపుణ్యాలున్న సిబ్బందిని ఎంపిక చేసుకునే విధానానికి ఈ కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. ఈ తాత్కాలిక నియామకాల్లో మెట్రో నగరాల వాటా గతేడాది 38.2% ఉండగా, ఈసారి 40.5 శాతానికి చేరుతుందని అంచనా. అంతేకాకుండా, ఈ రంగంలో పనిచేసే సిబ్బంది సగటు వయసు గతేడాది 28.2 ఏళ్లుండగా, ఈ ఏడాది 26.7 ఏళ్లకు తగ్గింది. ఇందులో పురుషులు 85%, మహిళలు 15 శాతంగా ఉన్నారు.

**సవాళ్ల బాటలో..**

క్షేత్రస్థాయిలో డెలివరీ భాగస్వాముల నుంచి సవాళ్లు ఎదురవుతుండటం సంస్థలకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక డెలివరీకి చేసే చెల్లింపులు గతంలో ఉన్న రూ.35 నుంచి ప్రస్తుతం రూ.10-15కి పడిపోయాయి. ఇంధన ధరలు పెరగడం, సామాజిక భద్రత లేకపోవడం గిగ్ కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది. సంప్రదాయ కిరాణా దుకాణాలు దశాబ్దాలుగా ఉన్న వ్యక్తిగత సంబంధాలు, నమ్మకంతో కూడిన అప్పు సౌకర్యంతో వినియోగదారులకు చేరవయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) ద్వారా డిజిటల్‌లోకి మారి, ఈ కంపెనీలకు గట్టి సవాలు విసురుతున్నాయి. పండగ సీజన్‌ను అందుకోవడానికి, పెరిగిన నిర్వహణ వ్యయాలను అదుపులో ఉంచుకుంటూ, స్థానిక దుకాణాలతో కలిసి పనిచేసినప్పుడే ఈ సంస్థలకు లాభాలు కనిపిస్తాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# ఈ వారం ఐపీఓలు..7

### కంపెనీలు ద్వారా రూ.6400 కోట్లు

**న్యూఢిల్లీ:**దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. ఈ వారం కూడా పలు కంపెనీల ఐపీఓలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఏడు కంపెనీలు సంయుక్తంగా రూ.6,400 కోట్ల నిధులను సమీకరించనున్నాయి. లలితా జువెలరీ, హొరైజన్ ఇండస్ట్రియల్ వంటి పలు కంపెనీలు ఇందులో ఉన్నాయి. మరి వాటి వివరాలు పరిశీలిస్తే.. బ్లాక్‌స్టోన్ మద్దతు కలిగిన హొరైజన్ ఇండస్ట్రియల్ పార్క్ కంపెనీ ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.2,600 కోట్ల నిధులను సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.57-60గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ నిధులను కంపెనీ రుణాల చెల్లింపునకు ఉపయోగించనుంది. ప్రముఖ ఆభరణాల తయారీ కంపెనీ లలితా జువెలరీ కూడా రూ.1700 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.190-201గా కంపెనీ నిర్ణయించింది. రూ.1200 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.500 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. శంకేశ్ జువెలర్స్ రూ.367 కోట్లు నిధుల సమీకరణతో ఆగస్టు 18న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ధరల శ్రేణి రూ.88-93గా కంపెనీ నిర్ణయించింది. 2.95 కోట్ల తాజా షేర్లు, కోటి షేర్లు ఆఫర్ల ఫర్ సేల్ రూపంలో విక్రయానికి ఉంచుతున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల లక్ష్యంతో ఆగస్టు 18న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.342-360 కంపెనీ నిర్ణయించింది. 48 లక్షల తాజా షేర్లు, 30.37 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. గాజా క్యాపిటల్ బ్రాండ్‌కు చెందిన గాజా అసెట్ మెనేజ్‌మెంట్ రూ.550 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 19న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.152-160 గా కంపెనీ నిర్ణయించింది. రూ.450 కోట్ల తాజా షేర్లు, రూ.100 కోట్ల ఆఫర్ ఫర్‌సేల్ రూపంలో ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఇండియా) ఆగస్టు 20న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.95 కోట్ల తాజా షేర్లు, రూ.1.85 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి. గోల్డ్ అండ్ సిల్వర్ ప్లాట్‌ఫాం అగ్మోంట్ ఎంటర్‌ప్రైజెస్ రూ.825 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 21న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.620 కోట్ల తాజా షేర్లు, రూ.205 కోట్ల ఆఫర్ ఫర్‌సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణిని కంపెనీ వెల్లడించలేదు. స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ కంపెనీ కూడా రూ.583 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 24న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఆగస్టు మొదటి అర్ధభాగంలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు కొనుగోళ్ల వైపు నిలిచారు. ఈ మధ్య కాలంలో నికరంగా రూ.16,621 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేశారు. జులైలోనూ దాదాపు రూ.20,200 కోట్ల భారత ఈక్విటీ షేర్లను ఎఫ్‌పీఐలు కొనుగోలు చేసినట్లు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ డేటా పేర్కొంది.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹ 1,54,236 (22 క్యారెట్లు)
₹ 1,67,180 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 2,40,000

# యుద్ధం నేర్పిన పాఠం..

- హర్మూజ్ సమస్యతో భారత్ ప్లాన్ బి!
- దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తికి టార్గెట్లు



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఏర్పడిన అలజడి మన వంట గదిపై ప్రభావం చూపింది. హర్మూజ్ మూసివేతతో వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌పీజీ ఉత్పత్తికి పబ్లిక్, ప్రైవేట్‌రంగ రిఫైనరీలకు, చమురు వెలికితీసే కంపెనీలకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రభుత్వం ఇలా లక్ష్యాలు నిర్దేశించడం ఇదే తొలిసారి. దేశీయంగా అవసరాలకు సరిపడా నిల్వలు వీలైనంత వరకు ఇక్కడే సమకూర్చుకోవడం ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ మేరకు తాజాగా పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 21 కంపెనీలకు రోజుకు 63,810 టన్నులు ఎల్‌పీజీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించింది.

**రోజుకు 91వేల టన్నులు**

దేశీయంగా ఎల్‌పీజీ వినియోగం భారీగా పెరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో దాదాపు అన్ని ఇళ్లలో వంట గ్యాస్ వినియోగిస్తున్నారు. ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని భారత్ వినియోగించింది. అంటే రోజుకు సగటున సుమారు 91 వేల టన్నులన్నమాట. అందులో కేవలం 13.1 మిలియన్ టన్నులు, అంటే రోజుకు 35,900 టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అయ్యింది. మిగిలిన 21.3 మిలియన్ టన్నులు (రోజుకు 58,400 టన్నులు) గ్యాస్‌ను విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నదే. 64 శాతం దిగుమతులపై ఆధారపడనిదే స్టవ్ వెలగని పరిస్థితి ఉండటం గమనార్హం.

**రిలయన్స్‌కు అత్యధికంగా**

దేశీయంగా సరిపడా ఉత్పత్తి ఉంటే ఇలాంటి పరిస్థితులు తలెత్తేవి కాదని భావించిన ప్రభుత్వం.. రిఫైనరీలు, చమురు వెలికి తీసే కంపెనీలకు ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. మొత్తం 18 ప్రభుత్వరంగ రిఫైనరీలకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాలని రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్‌కు అత్యధికంగా 18 వేల టన్నులను టార్గెట్‌గా పెట్టింది. నయారా ఎనర్జీకి 4,480 టన్నులు, మహారత్నకు చెందిన ఓఎన్‌జీసీ, గెయిల్ కంపెనీలకు 6,460 టన్నులు ఉత్పత్తి చేయాలని తెలిపింది. ప్రతి ఆరు నెలలకు జనవరి 1న, జులై 1న దేశీయ అవసరాలను అనుసరించి కొత్త లక్ష్యాలను నిర్దేశిస్తామని ప్రభుత్వం తన ఉత్తర్వులు పేర్కొంది.

**హర్మూజ్ నేర్పిన గుణపాఠం**

అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి మూతపడింది. దేశీయ అవసరాలకు దిగుమతి చేసుకునే ఎల్‌పీజీలో 90 శాతం ఈ జలసంధి ద్వారానే వస్తోంది. ఈ కీలక రవాణా మార్గం మూతపడడంతో దేశీయంగా వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. అప్పటికప్పుడు దేశీయ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలకు ప్రభుత్వం ఆదేశించింది. కమర్షియల్ సిలిండర్ విక్రయాలపై ఆంక్షలు పెట్టింది. గృహ వినియోగ సిలిండర్ బుకింగ్ గడువునూ పెంచింది. పైప్డ్ గ్యాస్‌ను ప్రోత్సహించింది.

# టాటా సన్స్ ఏజీఎం ఈ వారం లేనట్లే

**ఢిల్లీ:** మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నియంత్రణ ఆంక్షల కారణంగా టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీలో కీలక వాటాదారు అయిన 'సర్ రతన్ టాటా ట్రస్ట్' తన ప్రతినిధిని నామినేట్ చేయలేకపోవడంతో, ఈ నెల 18న జరగాల్సిన టాటా సన్స్ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) నిర్వహించే అవకాశం లేదని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరిలో తన ప్రస్తుత పదవీ కాలం ముగిసిన తర్వాత మరోసారి ఆ పదవిని చేపట్టకూడదని నిర్ణయించుకున్న టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ డైరెక్టర్‌షిప్ అంశంతో పాటు ఇతర విషయాలను పరిశీలించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే టాటా సన్స్ నిర్ణయించిన ఏజీఎం తేదీలో మార్పు గురించి వాటాదార్లకు తెలియజేయలేదు. ఈ సమావేశాన్ని నిర్వహించాలని కంపెనీ యోచిస్తున్నప్పటికీ, అవసరమైన కోరమ్ (కనీస సభ్యుల హాజరు) లేకపోతే దాన్ని వాయిదా వేసే అవకాశం ఉందని తాజా సంకేతాలు సూచిస్తున్నాయని సదరు వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ) బోర్డు సమావేశం జరగకపోవడంతో, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ (ఎస్‌డీటీటీ)తో కలిసి ఒక ప్రతినిధిని నామినేట్ చేయడం ఎస్ఆర్‌టీటీకి సాధ్యపడటం లేదు. టాటా సన్స్ 'ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్' ప్రకారం ఏజీఎంకు అవసరమైన కోరమ్‌ను పూర్తి చేయడానికి ఈ ప్రక్రియ తప్పనిసరి కానుంది.

# ప్రత్యామ్నాయ మార్కెట్లవైపు దృష్టిసారించాల్సిందే.

**న్యూఢిల్లీ:**అమెరికా ఇటీవల విధించిన 10% అదనపు సుంకం కారణంగా భారత రత్నాభరణాల పరిశ్రమ ఇబ్బందులను ఎదుర్కోనుంది. సహజ వజ్రాల ఎగుమతులకు ఇది అడ్డంకిగా మారనుంది. సాధ్యమైనంత త్వరగా ఆ దేశంతో ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకుంటేనే ఎగుమతిదార్లపై ఒత్తిడి తగ్గుతుందని రత్నాభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి ఛైర్మన్ కిరీట్ భన్సాలీ అంటున్నారు. అధిక పసిడి ధరలు, చైనా వంటి దేశాలతో పోటీ, ఎమ్ఎస్ఎమ్ ఈలకు రుణ వ్యయాలు వంటి సవాళ్లు ఉన్నాయని చెబుతున్నారు. ఈ సారి టారిఫ్‌ను విధించింది. అయితే భారత రత్నాభరణాల రంగంలో అటువంటిదేమీ లేదు. ఆ ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చుతున్నాం. టారిఫ్ విషయానికొస్తే భారత్‌పై విధించిన 10% సుంకం సవాలే. అయితే చైనా, హాంకాంగ్, థాయ్‌లాండ్, తుర్కియే, యూఏఈ, ఇజ్రాయెల్, వియత్నాం వంటి దేశాలపై విధించిన 12.5% సుంకంతో పోలిస్తే 2.5% మేర పోటీపరంగా ప్రయోజనం లభిస్తుంది.




భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే ఎగుమతిదార్లపై ఉన్న ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నాం. అధిక సవాలును సహజ వజ్రాలు ఎదుర్కోవాల్సి రావొచ్చు. బెల్జియం సహా యూరోపియన్ యూనియన్ దేశాలకు అదనపు సుంకం లేకపోగా, భారత వజ్రాలపై 10% సుంకం పడుతోంది. అయితే ఆభరణాల విభాగంలో పరిస్థితి సానుకూలంగా ఉంది. చైనా, థాయ్‌ల్యాండ్, తుర్కియేతో పోలిస్తే 2.5% ప్రయోజనం వల్ల మనకు పోటీ సామర్థ్యం పెరిగింది. ఇంకోవైపు బ్రిటన్, ఒమన్, యూఈఏతో కుదిరిన ఒప్పందాలు, త్వరలో అమల్లోకి వచ్చే ఈయూ, న్యూజిలాండ్ ఒప్పందాలు కొత్త అవకాశాలను సృష్టిస్తాయి. ప్రపంచంలో పాలిష్ చేసే ప్రతీ 15 వజ్రాల్లో 14 భారత్‌లోనే కట్, పాలిష్ అవుతున్నాయి. ఉత్పత్తి సామర్థ్యం, నైపుణ్యం, డిజైన్, తయారీ మౌలిక సదుపాయాలపై భారత్‌కు ప్రత్యేక ఆధిపత్యం ఉంది. ప్రభుత్వానికి మావైపు నుంచి డిమాండ్లు: భారత్-అమెరికా ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేయాలి. సహజ వజ్రాలు, రంగురాళ్లను ముడిసరుకుగా గుర్తించి సుంకం నుంచి మినహాయింపునివ్వాలి. ఎమ్ఎస్ఈఎమ్ఈ ఎగుమతిదార్లకు వడ్డీ రాయితీనివ్వాలి. ఎస్ఈజడ్ యూనిట్లకు డీటీఏ (డొమెస్టిక్ టారిఫ్ ఏరియా) విక్రయాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. బంగారం ధరలు రికార్డు స్థాయి ధరలకు చేరడంతో లాభాల మార్జిన్లు తగ్గుతున్నాయన్న మాట వాస్తవమే. అయితే ఇదే పరిస్థితి అధిక విలువ కలిగిన డిజైన్ ఆధారిత ఆభణాలకు గిరాకీ పెంచుతోంది. ఇది అవకాశంగా మారుతోంది. ఇక అధిక వడ్డీ రేట్లు ఎమ్ఎస్ఎమ్ఈలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ల్యాబ్‌లో తయారయ్యే వజ్రాలు సహజ వజ్రాలకు ప్రత్యామ్నాయం కావు. వేర్వేరు కొనుగోలుదార్ల అవసరాలను తీర్చే ఉత్పత్తులు. ఈ రెండు రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. భారత రత్నాభరణాల పరిశ్రమపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. యూకే, ఒమన్‌లో అమల్లోకి వచ్చిన వాణిజ్య ఒప్పందాలు, త్వరలో కుదరనున్న ఈయూ, న్యూజిలాండ్ ఒప్పందాలు మద్దతునివ్వనున్నాయి. ప్రస్తుతం బ్రిటన్‌తో 754 మి. డాలర్ల(సుమారు రూ.7000 కోట్లు) ఎగుమతులుండగా, సున్నా సుంకం కారణంగా మూడేళ్లలో 2.5 బి. డాలర్లకు చేరవచ్చు. అదే సమయంలో ఈయూ ఒప్పందం వల్ల ఐరోపాకు మా వాణిజ్యం రెట్టింపై 10 బి. డాలర్లకు చేరొచ్చు. భారత్-అమెరికా ఒప్పందం, ఎమ్ఎస్ఎమ్ఈలకు వడ్డీ రాయితీ, సహజ వజ్రాలకు సుంకం మినహాయింపు, మౌలిక వసతులు అభివృద్ధి వంటి కీలక సంస్కరణలు అమలైతే 2047 నాటికి 100 బి. డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమే.

## చిన్న పన్ను చెల్లింపుదార్లకు విదేశీ ఆస్తుల వెల్లడి పథకం అమల్లోకి

ఢిల్లీ: చిన్న పన్ను చెల్లింపుదార్లు 60 శాతం పన్ను చెల్లించి, తమ వెల్లడిచేయని కొన్ని విదేశీ ఆస్తులు, ఆదాయ వివరాలను ప్రకటించడానికి అనుమతించే ఒక కొత్త స్వచ్ఛంద వెల్లడి పథకాన్ని ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది. అర్హులైన పన్ను చెల్లింపుదార్లను అదనపు జరిమానాలు లేదా ప్రాసిక్యూషన్‌కు గురి చేయకుండా, వారి విదేశీ ఆస్తులను పన్ను పరిధిలోకి తీసుకొని రావాలన్నదే దీని వెనక ప్రభుత్వ ఉద్దేశం. బడ్జెట్లో ప్రకటించిన చిన్న పన్ను చెల్లింపుదార్ల విదేశీ ఆస్తుల వెల్లడి పథకం (ఫాస్ట్-డీఎస్) ఆగస్టు 16 నుంచి (నేడు) అమల్లోకి వచ్చిందని, ఆన్‌లైన్ డిక్లరేషన్‌ల సదుపాయం 2026 డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంటుందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఎవరికంటే..: విదేశీ ఆస్తులు, ఆదాయాలను వెల్లడించడంలో విఫలమైన విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు, టెక్నాలజీ ఉద్యోగులు, భారత్‌కు తిరిగొచ్చిన ప్రవాసులే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. పన్ను చెల్లింపుదార్లు ఏదైతే వెల్లడించని విదేశీ ఆస్తి లేదా ఆదాయాన్ని ప్రకటించారో, ఆ ఆస్తి లేదా ఆదాయ విలువపై 30 శాతం పన్నుతో పాటు, దానికి సమానమైన అదనపు మొత్తాన్ని చెల్లించాలి. అంటే మొత్తం పన్ను 60 శాతానికి చేరుతుందన్నమాట. ఆస్తుల సహేతుక మార్కెట్ విలువను 2026 మార్చి 31 నాటికి ఉన్న దాని ప్రకారం నిర్ధారిస్తామని సీబీడీటీ తెలిపింది. నిర్దిష్ట పన్ను లేదా రుసుము చెల్లించడం ద్వారా పన్ను చెల్లింపుదార్లు తదుపరి పన్ను లేదా జరిమానా నుంచి, బ్లాక్ మనీ (వెల్లడించని విదేశీ ఆదాయం, ఆస్తులు), పన్ను విధింపు చట్టం- 2015 కింద చేపట్టే విచారణ నుంచి మినహాయింపు పొందుతారని వెల్లడించింది.

## మార్చి కల్లా డాలర్ .. రూ.94



**వాషింగ్టన్:**అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి బలపడుతుందని కోటక్ సెక్యూరిటీస్ కమొడిటీ-కరెన్సీ రీసెర్చ్ విభాగాధిపతి అనైంద్య బెనర్జీ అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డాలర్ విలువ రూ.95.33గా ఉండగా, వచ్చే మార్చి చివరకు రూ.94 స్థాయికి పరిమితం కావచ్చని పేర్కొన్నారు. ముడిచమురు బ్యారెల్ ధర 80 డాలర్లుగా ఉండి, విదేశీ పెట్టుబడులు - రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద విదేశీ మారకపు ద్రవ్యం స్థిరంగా కొనసాగడం ఇందుకు కీలకమన్నారు. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 10 డాలర్ల చొప్పున పెరిగితే, దేశీయ వార్షిక దిగుమతి బిల్లు భారం 13-15 బిలియన్ డాలర్ల (రూ.1.23-1.42 లక్షల కోట్లు) మేర అధికమవుతుంది. ముడిచమురు ధర 100 డాలర్ల కంటే తక్కువగా ఉంటే, భారత ఆర్థిక పరిస్థితి నియంత్రణలో ఉంటుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడిచమురు ధర బ్యారెల్ 110 డాలర్ల పైకి వెళ్లినా, అమెరికా వడ్డీ రేట్లు పెరిగినా, విదేశీ పెట్టుబడులు తగ్గినా.. డాలర్ విలువ రూ.96-97 మధ్య ఉండొచ్చని పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ కోసం ప్రవేశపెట్టిన ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్లు ఈ ఏడాది రూపాయికి గణనీయ మద్దతు ఇచ్చాయి. జులై 31 నాటికి స్వాప్ సౌకర్యం ద్వారా మొత్తం 40.82 బిలియన్ డాలర్లు వచ్చాయి. మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు కూడా పెరుగుతున్నాయని బెనర్జీ వివరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 ఆగస్టు 2026

# కల్వకుర్తి కేఎల్ఐ కాల్వకు జలకళ

- వర్షాల ప్రభావంతో కృష్ణా జలాల రాక.. రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఎండుతున్న పంటలకు ఊరట.. వరి నార్లకు ఇక నీటి ఇబ్బంది ఉండదన్న ధీమా



**కల్వకుర్తి,ఆగస్టు 16,(జనంసాక్షి):** వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు కేఎల్ఐ నీరు చల్లని కబురు అందిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో కృష్ణా జలాలు కేఎల్ఐ వ్యవస్థలోకి చేరుతుండటంతో కల్వకుర్తి ప్రాంతంలోని కాల్వలకు జలకళ సంతరించుకుంటోంది. సాగునీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోతుండటం, వరి నార్లకు సరిపడా నీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్న వేళ కేఎల్ఐ ద్వారా నీటి రాక రైతులకు ఊరటనిస్తోంది.

కృష్ణా నదిపై శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని ఎత్తిపోసి కరువు ప్రాంతాలకు సాగునీరు అందించడమే మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్ఐఎస్) ప్రధాన ఉద్దేశం. మూడు దశల్లో నీటిని సుమారు 298 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. అధికారిక ప్రాజెక్టు వివరాల ప్రకారం 25 టీఎంసీల నీటిని వినియోగించి సుమారు 3.65 లక్షల ఎకరాలకు సాగునీరు, మార్గమధ్యంలోని గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో పథకం రూపొందింది.

### మూడు దశల్లో ఎత్తిపోత

కేఎల్ఐలో మూడు లిఫ్ట్ దశలు ఉన్నాయి. మొదటి దశలో నీటిని యెల్లూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వైపు, తదుపరి దశల్లో సింగోటం, జొన్నలబొగుడు, గుడిపల్లిగట్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు తరలిస్తారు. అక్కడి నుంచి ప్రధాన కాల్వలు, పంపిణీ కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటిని అందిస్తారు.

### నార్లకు నీరందితే సాగు ఊపందుకున్నట్టే..

ప్రస్తుతం కల్వకుర్తి పరిసరాల్లో సాగు పనులు ఊపందుకుంటున్నాయి. వరి నార్లు పోసిన రైతులు వాటిని కాపాడుకునేందుకు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పటికే పొలాల్లో వేసిన పంటలకు కూడా తేమ అవసరం ఏర్పడింది. ఈ సమయంలో కేఎల్ఐ కాల్వలకు నీరు చేరుతుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కాల్వల్లో నీటి ప్రవాహం కొనసాగితే నార్ల పెంపకం, నాట్ల ప్రక్రియకు ఇబ్బందులు తగ్గుతాయని రైతులు ఆశిస్తున్నారు.

### "నీరు రావడంతో ధైర్యం వచ్చింది"

"వర్షాలు ఆలస్యం కావడంతో పంటల పరిస్థితిపై ఆందోళన చెందాం.నార్లు ఎండిపోకుండా కాపాడుకోవడం కష్టంగా మారింది. ఇప్పుడు కేఎల్ఐ కాల్వలో నీరు రావడంతో కొంత ధైర్యం వచ్చింది"అని కల్వకుర్తి జీడిపల్లి గ్రామానికి చెందిన రైతు మంగ విగ్నేష్,పి చిన్న నారాయణ, చాకలి లక్ష్మయ్య, కుమ్మరి రాములు, నిరంజన్ గౌడ్, తెలిపారు."బోర్లపై ఆధారపడి పంటలను కాపాడుకోవాల్సి వస్తుందని భయపడ్డాం. కాల్వలో నీటి ప్రవాహం ఇలాగే కొనసాగితే సాగుకు ఎంతో మేలు జరుగుతుంది" అని రైతు నంబు ఇస్తారు వెంకటాపూర్ గ్రామం పేర్కొన్నారు.

### "వరి నాట్లకు నీరు అవసరం.

కేఎల్ఐ నీరు అందితే పంటలను సకాలంలో సాగు చేసుకోవచ్చు. వర్షాలు కూడా తోడైతే ఈసారి రైతులకు మంచి రోజులు వస్తాయి" అని రైతు శశిధర్ ఎల్లికల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### వర్షాలతో తోడైతే మరింత మేలు

కేఎల్ఐ నీటికి వర్షాలు తోడైతే ఈ సీజన్‌లో సాగుకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.ఇటీవల వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో భూమిలో తేమ తగ్గి పంటలు వాడిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు బోర్లు, బావులపై ఆధారపడాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల పరిస్థితి వంటి అంశాలు రైతులకు అదనపు భారంగా మారాయి. ఈ తరుణంలో కాల్వలకు నీరు చేరడం సాగుదారులకు కొంత ఊరటనిస్తోంది.

ఆయకట్టుకు వరంకరువు ప్రాంతాల సాగు అవసరాలను తీర్చడంలో కేఎల్ఐ కీలకంగా నిలుస్తోంది.శ్రీశైలం జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసి ఎత్తైన ప్రాంతాలకు తరలించడం ద్వారా సాగునీటిని అందించే ఈ పథకం ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంలోని రైతులకు ఎంతో ప్రాధాన్యమైనది. ఈ పథకం ద్వారా కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంతో పాటు మార్గమధ్య గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పించే లక్ష్యం ఉంది.

### రైతుల్లో పెరిగిన ధీమా

మొత్తంగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు కేఎల్ఐ నీటి రాక ప్రస్తుతానికి చల్లని కబురుగా మారింది.కాల్వల్లో నీటి ప్రవాహం మరింత పెరిగి ఆయకట్టుకు సమృద్ధిగా చేరితే ఈ ఖరీఫ్ సాగుకు గట్టి ఊతం లభించనుంది.

## ప్లాట్ల మోసం... మాజీ సొసైటీ అధ్యక్షుడిపై కేసు

**బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన మేడిపల్లి పోలీసులు**

**బోడుప్పల్, జనంసాక్షి :** ఒకే ప్లాటును పలుమార్లు వేర్వేరు వ్యక్తుల పేరిట రిజిస్టర్ చేయించి మోసానికి పాల్పడిన ఘటనపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన గైనీ కాలాధర్ (44) పర్వతాపూర్ రెవెన్యూ సలార్‌జంగ్ కంచలో గల ప్లాట్ నెం. ఇ/173ను కాలాధర్ 2013లో డాక్యుమెంట్ నెం. 4744/2013 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని కొనుగోలు చేశారు. అయితే ఈ ప్లాటు గతంలోనే పలుమార్లు చేతులు మారి, చివరకు శ్రీ రమణ కోఆపరేటివ్ సొసైటీ నుంచి మొదలైనట్లు వెలుగులోకి వచ్చింది. ఈ సొసైటీ 1982లోనే తన సభ్యురాలు సుమతి పేరిట ఈ ప్లాటును తొలిసారి రిజిస్టర్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2001లో సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కారెడ్ల మాల్లారెడ్డికి ఈ ప్లాట్లు గతంలోనే రిజిస్టర్ అయిన విషయం తెలిసినప్పటికీ, ప్లాట్ నెం. ఇ/173తో సహా ఇతర ప్లాట్లను కూడా వేర్వేరు వ్యక్తుల పేరిట ఫిర్యాదుదారు కాలాధర్ పేరిట సైతం మరోసారి రిజిస్టర్ చేయించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో నిజమైన కొనుగోలుదారులు మోసపోయానని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నామని సీఐ డీ.జలంధర్ రెడ్డి తెలిపారు.

## అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 56 క్యూసెక్కుల వరద ప్రవాహం

**ఇల్లంతకుంట, ఆగస్టు 16 (జనంసాక్షి):** అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి 56 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, క్యాచ్‌మెంట్ నుంచి కూడా 56 క్యూసెక్కుల నీరు చేరుతోంది. రిజర్వాయర్ నీటిమట్టం ౦389.01 మీటర్లుగా నమోదైంది. పూర్తి స్థాయి నీటిమట్టం 397.00 మీటర్లుగా ఉంది. రిజర్వాయర్ సామర్థ్యం 1.525/3.50 టీఎంసీలుగా నమోదైంది. ప్రస్తుతం ఎంఎంఆర్, ప్యాకేజీ-11, సర్‌ప్లస్ వీర్, మెయిన్ కెనాల్ ద్వారా నీటి విడుదల లేదు. ఆవుట్‌ఫ్లో కూడా నిల్‌గా ఉంది. ఆవిరి, ఇతర అవసరాల కోసం సుమారు 10 క్యూసెక్కుల నీరు వినియోగమవుతోంది. అన్నపూర్ణ పంప్‌హౌస్‌లో ప్రస్తుతం ఎలాంటి పంపులు నడవడం లేదు. రిజర్వాయర్‌కు వస్తున్న నీటి ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## షిరిడీ సహా పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 16, ( జనం సాక్షి):** శ్రావణమాసం సందర్భంగా కరీంనగర్-1 డిపో నుంచి షిరిడీ, నాసిక్, త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, గృశ్నేశ్వర్ జ్యోతిర్లింగం, సప్తశృంగి దేవిగఢ్ శక్తిపీఠం, శని శింగణాపూర్ పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఐ. విజయ మాధురి తెలిపారు.ఈ ప్రత్యేక తీర్థయాత్ర బస్సు ఆగస్టు 23న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి బయలుదేరి, పుణ్యక్షేత్రాల దర్శనాలు పూర్తిచేసుకుని ఆగస్టు 27న సాయంత్రం కరీంనగర్ చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ.5,000, పిల్లలకు రూ.3,750గా ఛార్జీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 7382849352, 9959225920 నంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ సూచించారు.

## కుటుంబ కలహాలతో భర్త ఆత్మ హత్య



**అల్లాదుర్గం ఆగస్టు 16 (జనంసాక్షి) :** భార్య భర్తలు డబ్బుల విషయంలో గొడవపడి కుటుంబ కలహాలతో భర్త నాయి కోటి రాజు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని చిల్వేర్ గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల, కుటుంబీకుల కథనం ప్రకారం చిల్వర్ గ్రామానికి చెందిన నాయకోటి రాజు (33) ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య ఒక కూతురు ఉంది. భార్య రాణి 50, వేలు పని నిమిత్తం భర్తకు ఇచ్చింది. మర్నాడు తాను ఇచ్చిన డబ్బులో 20,వేలు తక్కువగా ఉండడంతో ఎక్కడ ఖర్చు చేశావు అని భార్య, రాజును నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. అనంతరం భార్య రాణి పనికి వెళ్లడంతో మనస్థాపం చెందిన భర్త రాజు బెడ్ రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏ ఎస్సై దయానంద్ తెలిపారు. భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వివరించారు.



## గంజాయి విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్ట్


- 230 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**జమ్మికుంట, ఆగస్టు 16 (జనంసాక్షి):** జమ్మికుంట పట్టణంలో గంజాయి అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. నిందితుల నుంచి 230 గ్రాముల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పోలీసుల వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన నాగిరెడ్డి హరిప్రసాద్ (26), దుర్గం కార్తిక్ (19) గంజాయి సేవించే అలవాటుకు గురై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆగస్టు 15న మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తి నుంచి 230 గ్రాముల గంజాయిని రూ.11,400కు కొనుగోలు చేసి రైలులో మందమర్రికి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆగస్టు 16న గంజాయిని తీసుకుని జమ్మికుంటకు చేరుకుని ఎఫ్‌సీఐ గోడౌన్ పరిసరాల్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని గుర్తించారు. పోలీసులను చూసి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన ఇద్దరినీ అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి, రెండు సెల్‌ఫోన్లు లభించినట్లు సీఐ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.11,400 ఉంటుందని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జమ్మికుంట పోలీసులు సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణ గౌడ్ స్పష్టం చేశారు.

## నారెగూడా అంగన్వాడి టీచర్ రాజీనామా

- ఎస్ఐఆర్ ప్రక్రియకు డుమ్మా.. బిఎల్ఓ విధుల నుంచి తొలగింపు
- ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిశాక విధుల్లో చేరుతానని పైరవీలు
- రాజీనామా ఆమోదించకపోవడంపై పలు అనుమానాలు
- పొంతన లేని సమాధానాలు చెబుతున్న అధికారులు
- రాజీనామా ఆమోదించి కొత్తవారిని నియమించాలంటున్న గ్రామస్తులు
- పౌష్టికాహారానికి దూరమైన చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు




**నవాబుపేట్ ఆగస్టు 16 ( జనం సాక్షి) :** నవాబుపేట్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో చేపట్టిన అంగన్వాడి సెంటర్లు సమయపాలన లేకుండా మా సెంటర్ నా ఇష్టం మేము ఎప్పుడైనా వస్తాము ఎప్పుడైనా వెళ్తాము అన్నట్లు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నడుస్తున్న అంగన్వాడి సెంటర్ల పరిస్థితులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఓటరు సవరణ కార్యక్రమానికి ముందే నవాబుపేట మండలం నారె గూడ గ్రామ అంగన్వాడీ టీచర్ ఎల్లమ్మ తన పదవికి రాజీనామా చేశారు. దాంతో అంగన్వాడి టీచర్ కు అదనంగా ఉన్న బిఎల్ఓ పోస్టును తొలగించి.. అదే గ్రామానికి చెందిన గంగ్యాడ కృష్ణను బిఎల్‌వోగా నియమిం చారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కొత్తగా నియమించిన బిఎల్‌వో కృష్ణతో ఓటరు సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయించి నట్లు తహసిల్దార్ బుచ్చయ్య పేర్కొన్నారు. అకస్మాత్తుగా ఎస్ఐఆర్ కు డుమ్మా కొట్టిన అంగన్వాడీ టీచర్ ఎల్లమ్మ విషయమై ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసిల్దార్ తెలిపాడు.

### ఓటరు సవరణ ముగిశాక విధుల్లో చేరుతానని పైరవీలు..

ఓటర్ సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ముందు అకస్మాత్తుగా తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన అంగన్వాడీ టీచర్ ఎల్లమ్మ. ఓటర్ సవరణ పూర్తి అయిన అనంతరం తాను మళ్లీ అంగన్వాడి టీచర్‌గా పని చేస్తానని తనను విధుల్లోకి తీర్చుసుకోవాలని అధికారుల చుట్టూ తిరుగుతు న్నట్లు సమాచారం. ఆమె రాజీనామా చేసి రెండు నెలలు అవుతున్న ఐసిడిఎస్ అధికారులు రాజీనామాను ఆమోదించక పోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పొంతనలేని సమాధానాలు చెబుతున్న అధికారులు

రెండు నెలల క్రితం స్వతంత్రంగా అంగన్వాడీ టీచర్ రాజీనామా చేసింది. అయినా ఐసిడిఎస్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజీనామా విషయమై సిడిపిఓ శ్రీలతను సంప్రదిస్తే రాజీనామా విషయమై డి డబ్ల్యూ ఓ కాంతారావు నివేదించినట్లు పేర్కొంటున్నారు. బి డబ్ల్యు ఓ ను సంప్రదిస్తే రాజీనామా విషయం. రాజీనామా లెటర్ సిడిపిఓ మనకు ఇంకా పంపలేదని పేర్కొనడం గమనార్ధం. బాధ్యత గల అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పడం పలు అనుమానాలకు తవిస్తుంది.

అంగన్వాడీ టీచర్ రాజీనామా చేయడంతో గత రెండు నెలలుగా అంగన్వాడీ కేంద్రం మూతపడింది. దాంతో కేంద్రానికి వచ్చే పిల్లలకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారం అందకుండా పోయింది. పాలు, గుడ్లు, బాలామృతం తదితరవ వస్తువులు ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజీనామా చేసిన అంగన్వాడి టీచర్ పలువురి తో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు రాజీనామాను ఆమోదించకుండా, కేంద్రానికి కొత్త టీచర్‌ను నియమించకుండా గ్రామస్తుల కు అన్యాయం చేస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకొని గ్రామానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కంకర టిప్పర్‌ను డికొన్న ద్విచక్ర వాహనం ఒకరి మృతి

**ముస్తాబాద్ ఆగస్టు 16( జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలం గూడెం, అవునురు గ్రామ శివారులో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది, టిప్పర్ ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందగా, మరో వ్యక్తి ప్రాణస్థితిలో ఉన్నట్టు సమాచారం, గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై సిరిసిల్లకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనట్లు తెలుస్తుంది, ఈ ప్రమాదంలో సుల్తానీ యాదిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం మరో వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమన్నట్లు తెలిసింది, ఘటన స్థలానికి కి స్థానిక ఎస్సై జి జ్యోతి చేరుకొని పూర్తిస్థాయిలో పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి చర్యలు చేపట్టారు.

## డ్రగ్స్ వద్దు.. జిమ్ ముద్దు

- యువత ఆరోగ్యమే దేశ భవిష్యత్తు
- ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు అగస్టు 16(జనంసాక్షి) :** తాండూరులోని హౌస్ అఫ్ చాంపియన్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫిట్‌నెస్ పోటీల కార్యక్రమం యువతలో ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమానికి ఆర్బీఓఎల్ సీఈఓ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువతకు విలువైన సందేశం ఇచ్చారు. ఈ రోజుల్లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల బారిన పడి చాలా మంది యువత జీవితాలు నాశనం అవుతున్నాయి. వాటికి పూర్తిగా దూరంగా ఉండండి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోండి. ప్రతిరోజూ వ్యాయామం చేయండి. ముఖ్యంగా జిమ్‌కు వెళ్లడం ద్వారా శారీరకంగా దృఢంగా, మానసికంగా స్థిరంగా ఉండొచ్చని ఆయన అన్నారు.పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించి, మీ కష్టం, పట్టుదల భవిష్యత్తులో మరిన్ని విజయాలకు దారి తీస్తుంది. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగండని ఆకాంక్షించారు.కార్యక్రమానికి విచ్చేసిన బిఎస్ఆర్ కు హౌజ్ ఆఫ్ చాంపియన్ జిమ్ యజమాని పట్లోళ్ల ప్రశాంత్ రెడ్డిఘన స్వాగతం పలికి, శాలువా, పూలమాలతో సన్మానించారు. యువతను ఫిట్‌నెస్ వైపు నడిపించే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, జిమ్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.




## మహిళల్లోని శక్తిని వెలికితీస్తే.. అద్భుతాలు

**భారతీయ సంస్కృతి ప్రపంచానికి మార్గదర్శకం: గవర్నర్ శివప్రతాప్ శుక్ల**

**శేరిలింగంపల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి):** సనాతన ధర్మంలో మహిళలకు విశిష్టమైన స్థానం ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల అన్నారు. విశాఖ శారదా పీఠం నేతృత్వంలో చందానగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'స్త్రీ శక్తి-సనాతన శక్తి' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవని, నేటికీ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. భారతీయ సంస్కృతి పట్ల అనేక దేశాలు ప్రత్యేక గౌరవాభిమానాలు చూపుతున్నాయని, మన చరిత్రలో ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలు లేని సమాజాన్ని ఊహించడం అసాధ్యమని, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని పిలుపునిచ్చారు. మహిళల్లో దాగి ఉన్న శక్తిని వెలికితీస్తే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీ రాజశ్యామలాదేవి దర్బారు సేవలో గవర్నర్ పాల్గొన్నారు. అనంతరం విశాఖ శ్రీ శారదా పీఠం తరపున ఆయనకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయలక్ష్మి, రమా విశ్వనాథన్, వాణి సక్కుబాయి, వారణాసి రాధిక, పల్లా రాధిక, మౌనిక సుంకర తదితరులు మహిళల చైతన్యం, అభ్యున్నతిపై ప్రసంగించారు. విశాఖ శారదా పీఠం పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ మహిళలను గౌరవ స్థానంలో నిలిపిన దేశాల్లో భారతదేశం ముందువరుసలో ఉంటుందని అన్నారు. నదులు, పర్వతాలకు సైతం మహిళల పేర్లు పెట్టి పూజించే సంప్రదాయం సనాతన సంస్కృతిలోనే ఉందని పేర్కొన్నారు. భారతమాతగా దేశాన్ని మహిళా మూర్తి రూపంలో కొలుచుకుంటున్నామని గుర్తుచేశారు. ఉత్తరాధికారి స్వాత్మా నరేంద్ర స్వామి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి భారతీయ సంస్కృతిలో ఉన్నత స్థానం ఉందని తెలిపారు. విశాఖ శారదా పీఠం వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తోందని వివరించారు. ఆలయ కమిటీ అర్చకులు, శ్రేయోభిలాషులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. నాట్య వేద కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకోగా, వారణాసి శ్రీకృష్ణ రాఘవ సంగీత ప్రదర్శన ఆహుతులను అలరించింది.

# పోక్సో కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు

- చిన్నారులకు సత్వర న్యాయం అందేలా చర్యలు
- శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యం
- నిజామాబాద్ జిల్లాలో పోక్సో కేసుల దర్యాప్తుపై పోలీస్ కమిషనర్ ఫోకస్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాలో చిన్నారులపై లైంగిక నేరాలకు సంబంధించిన పోక్సో కేసుల దర్యాప్తు, కేసుల పురోగతిపై ఆదివారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ని మినీ కాన్ఫరెన్స్ హల్ యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చిన్నారులపై లైంగిక దాడులు,లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులను ఒక్కొక్కటిగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా కేసుల్లో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, సేకరించిన ఆధారాలు, సాక్షుల వివరాలు, బాధిత చిన్నారుల వాంగ్మూలాలు, కేసుల ప్రస్తుత స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందనే విషయాన్ని క్షుణ్ణంగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించారు.నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడం, బాధిత చిన్నారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయడంపై పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. పోక్సో కేసుల్లో చిన్నారుల భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితుల పట్ల సున్నితమైన వైఖరితో వ్యవహరించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన ఎఫ్ఎస్ఎల్ పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయించి నివేదికలు పొందాలని ఆదేశించారు. అదేవిధంగా బాధితులు, నిందితులకు సంబంధించిన మెడికల్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు.కేసుల్లో లభించిన సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, ఇతర సాంకేతిక ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించి, వాటిని దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సాక్షుల వాంగ్మూలాలు, ఇతర కీలక ఆధారాలను పకడ్బందీగా నమోదు చేసి కేసులు కోర్టులో బలంగా నిలిచేలా దర్యాప్తు చేపట్టాలని తెలిపారు.అలాగే ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, మెడికల్ రిపోర్టులు, ఇతర దర్యాప్తు ప్రక్రియలు పూర్తయిన వెంటనే చార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. పోక్సో కేసుల్లో చార్జ్‌షీట్ ఫైలింగ్‌లో ఎలాంటి అనవసర జాప్యం ఉండకూడదని, సాధ్యమైనంత తక్కువ సమయంలో దర్యాప్తును పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు.

పెండింగ్‌లో ఉన్న ప్రతి పోక్సో కేసును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, దర్యాప్తులో ఏవైనా సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేసుల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించి, బాధిత చిన్నారులకు సత్వర న్యాయం అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులపై జరిగే లైంగిక నేరాల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా వేగవంతమైన, శాస్త్రీయ, నాణ్యమైన దర్యాప్తు చేపట్టడమే లక్ష్యమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయనకు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్,వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేషం, సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య మరియు సిఐలు ఐటి కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం

- ఐదు గ్యారంటీలు అమలు చేశాం
- ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల సాయం
- వేములవాడ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

**చందుర్తి, ఆగస్టు 16 (జనం సాక్షి):** పేదల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 24 వేల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందిస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు చెప్పారు. అర్హులకు పెన్షన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఆశిరెడ్డిపల్లితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, కొచ్చేరు చెరువు అభివృద్ధికి గతంలో కృషి చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం చెరువులోకి నీటిని తీసుకురావడానికి కాలువ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని, భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. చెరువుల్లో నీటి నిల్వ పెంచితే మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు మెరుగుపడతాయన్నారు. వేములవాడ నియోజకవర్గంలో మూడో వంతెన, రోడ్ల విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

చందుర్తి మండలానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం గర్వకారణమన్నారు. ఎన్నికల తర్వాత రాజకీయాలకు అతీతంగా ప్రజల అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆది శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జ మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీలు పొద్దుపొడుపు లింగారెడ్డి, నాగం కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొట్టె ప్రభాకర్, నాయకులు, సర్పంచులు, మహిళలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆగస్టు 17 నుంచి మండల స్థాయిలో ప్రజావాణి

- ప్రజలు తమ దరఖాస్తులను మండల స్థాయిలోనే అందజేయాలి
- ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదు
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 16 (జనంసాక్షి) :** ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 17వ తేదీ నుంచి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహిస్తున్నందున, తమ సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండలంలో ఏసీ ఎల్బీ, అశ్విని తానాజీ, మానకొండూర్లో ఏసీ రెవెన్యూ, శ్రీనివాస్ రెడ్డి సైదాపూర్లో ట్రైని కలెక్టర్, చిగురుమామిడిలో డీపీఓ ప్రత్యేక అధికారిగా హాజరుకానున్నారు. హుజూరాబాద్ డివిజన్లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పాల్గొంటారు. అదేవిధంగా సంబంధిత మండలాల నుంచి సీఈఓ, డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : కాలె యాదయ్య

**శంకర్ పల్లి, ఆగస్టు 16(జనం సాక్షి) :** అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని చేవెళ్ల శాసనసభ్యుడు యాదయ్య తెలిపారు. శంకర్పల్లి మండలం తంగుటూరు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో గడ్డం అరుణ ఇంటిని ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటి స్థలం ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రస్తుతం రేషన్ కార్డులు కలిగి ఉన్న వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయడం జరుగుతుందని



తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి మున్సిపల్ అధ్యక్షుడు చంద్రమౌళి, టంగుటూరు గ్రామ సర్పంచ్ హరిత కృష్ణారెడ్డి, పిల్లిగుండ్ల సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి,ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో గంభీరావుపేట యువ శాస్త్రవేత్త ఘనత

**అంతర్జాతీయ జర్నల్లో రాకేష్ నారాని పరిశోధన వ్యాసం ప్రచురణ**

**గంభీరావుపేట ఆగస్టు 16 జనం సాక్షి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామానికి చెందిన యువ శాస్త్రవేత్త రాకేష్ నారాని పర్యావరణ పరిరక్షణ రంగంలో చేసిన పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. నీటి కాలుష్యానికి కారణమవుతున్న ప్రమాదకర రసాయనాలను గుర్తించే అత్యాధునిక సాంకేతికతపై ఆయన నేతృత్వంలో రూపొందించిన పరిశోధనా వ్యాసం ప్రతిష్టాత్మక అమెరికన్ కెమికల్ సొసైటీకి చెందిన 'జర్నల్లో ప్రచురితమైంది. పీఎఫ ఏఎస్, రసాయనాల గుర్తింపుపై పరిశోధన పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి ముప్పుగా మారిన 'ఫరెవర్ కెమికల్స్'గా పిలిచే పిఎఫ్ఏ ఎస్/పిఎఫ్ఓఏ, రసాయనాలను నీటిలో గుర్తించేందుకు రాకేష్ నారాని బృందం సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేసింది. ప్రత్యేకమైన బ్లాక్ కోపాలిమర్ల సాయంతో కాంప్లెక్స్ ఎమల్షన్ల ఆధారిత సెన్సింగ్ పద్ధతిని రూపొందించారు. అలాగే మైక్రోఫ్లూయిడ్ చిప్స్తో మెషిన్ లెర్నింగ్ మోడల్ను అనుసంధానం చేసి నీటిలోని కాలుష్య తీవ్రతను సుమారు 93 శాతం ఖచ్చితత్వంతో త్వరితగతిన అంచనా వేయగల విధానాన్ని పరిశోధనలో నిరూపించారు.



క్షేత్రస్థాయిలోనే వేగవంతమైన ఫలితాలు సాధారణంగా ఇలాంటి ప్రమాదకర రసాయనాలను గుర్తించేందుకు ఖరీదైన ప్రయోగశాల పరికరాలు, ప్రత్యేక సదుపాయాలు, ఎక్కువ సమయం అవసరమవుతుంది. అయితే రాకేష్ నారాని అభివృద్ధి చేసిన విధానం ద్వారా క్షేత్రస్థాయిలోనే నేరుగా, వేగంగా, తక్కువ ఖర్చుతో నీటి కాలుష్యాన్ని అంచనా వేసే అవకాశం ఏర్పడుతుందని పరిశోధన సూచిస్తోంది. గంభీరావుపేటకు చెందిన రాకేష్ నారాని పరిశోధన అంతర్జాతీయ స్థాయిలోని ప్రతిష్టాత్మక జర్నల్లో ప్రచురితం కావడం పట్ల స్థానికులు, కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. రాకేష్ నారానికి అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని పరిశోధనల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కొరకరాని కొయ్యలా మారిన ఎఫ్ఎఫ్ఎస్ ఎరువుల యాప్

- వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు తీస్తున్న రైతులు
- ఆధార్ కార్డు ఆధారంగా నేరుగా ఎరువుల పంపిణీ చేయాలని రైతుల డిమాండ్

**మర్పల్లి ఆగస్ట్ 16 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా యూరియా, డీఏపీ, ఎన్పీకే కాంప్లెక్స్, ఎంఓపీ తదితర అన్ని ఎరువుల ఎఫ్. ఎఫ్. ఎస్. యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని ఉద్దేశంతో యాప్ ను ప్రవేశపెట్టారు.. రైతులకు ఎరువులను యాప్తో బుక్ చేసుకోవాలంటే తప్పనిసరిగా ఫార్మర్ ఐడి కలిగి ఉండాలి, ఐడి లేకపోతే ఆధార్ తో నమోదు చేసుకోవాలి. ఆధార్ పట్ట పాస్ బుక్ పాస్ పుస్తకం అనుసంధానమై మొబైల్ నెంబర్ వచ్చే ఓటీపీ ద్వారా ధ్రువీకరణ చేయాలి. రైతుల భూమి విస్తీర్ణం సాగు చేసే పంటల ఆధారంగా ఎరువుల కోటాను యాప్ లోనే ప్రదర్శిస్తుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ టెక్నాలజీ రైతులకు పనులు సులువుగా చేయకపోగా ఇబ్బందులను మరింత పెంచుతుంది. ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులకు సంకటంగా మారుతోందని, రిటైల్ డీలర్లు యూరియాను విక్రయించకపోవడం, సహకార సంఘంలో తగినంత నిలువలు లేకపోవడంతో యాప్ బుకింగ్ పై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. యాప్ అమల్లో క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో యూరియా నిలువలు ఎక్కువగా లేకపోవడం వల్ల ఎప్పుడు వస్తుందో ఎప్పుడు బుక్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వచ్చిన యూరియా రైతులకు వచ్చింది అని తెలిసేలోపే ఆన్లైన్లో పూర్తిగా బుక్ అయిపోతుంది. స్మార్ట్ఫోన్ లేని రైతులు మాత్రం కష్టాలు తప్పడం లేదు. కనీసం ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి గ్రామస్థాయిలో ఎరువుల యాప్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు కోరుకుంటున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం రోజు
# మున్సిపల్ కార్మికులకు సెలవు లేదా!

- బోడుప్పల్లో 391వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- అసైన్డ్ భూముల యాజమాన్య హక్కు డిక్లరేషన్ కోసం ధర్నా కరపత్రం విడుదల
- తెలంగాణ భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 31న ఇంద్ర పార్క్ వద్ద ధర్నా




**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 391వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కు డిక్లరేషన్ కోసం ఆగస్టు 31 సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజు మున్సిపల్ కార్మికులకు సెలవు ఇవ్వకుండా అధికారులు వారితో పని చేయిస్తున్నారని, అందరితో సమానంగా ఆగస్టు 15 జనవరి 26న స్వచ్ఛ సెలవు దినంగా ప్రకటించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశాడు. అదేవిధంగా దళితుల ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ హయాంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు భూములు కేటాయించిందని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని తెలంగాణ భూ రక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్, రఘురూపుల మల్లేష్, రాజేష్ , పవన్, వి రామకృష్ణ, చిల్ల అంజయ్య, జె శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# విధుల నిర్లక్ష్యంపై అంగన్వాడీ టీచర్ సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అంగన్వాడీ సేవల అమలులో నిర్లక్ష్యంపై శాఖాపరమైన సూపర్వైజర్ నివేదిక ఆధారంగా చర్యలు

**పెద్దపల్లి, ఆగస్టు 16 (జనం సాక్షి):** ఓదెల-2 అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్గా పనిచేస్తున్న జె. ప్రమీలను విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అంగన్వా డీ కేంద్రం నిర్వహణలో లోపాలు, ప్రభుత్వ సేవల అమలులో నిర్లక్ష్యం తదితర ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు లిజిల్లా కలెక్టర్ మరియు ఇంచార్జ్ మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి కోయ శ్రీహర్షలి తెలిపారు. అంగన్వాడీ టీచర్గా పనిచేస్తున్న జె. ప్రమీల విధుల నిర్వహణకు సంబంధించి పలు ఆరోపణలు పేర్కొన్నట్లు కలెక్టర్ తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందించాల్సిన సేవల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు, ముందస్తు సమాచారం లేకుండా అంగన్వాడీ కేంద్రాన్ని మూసివేసినట్లు తెలిపారు. ఆరోపణల తీవ్రత, లబ్ధిదారుల ప్రయోజనాలు, అంగన్వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వ సేవలు నిరంతరాయంగా కొనసాగా ల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, విషయం పూర్తిగా పరిశీలించబడే వరకు జె. ప్రమీలను అంగన్వాడీ సేవల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు లిజిల్లా కలెక్టర్లి తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ఓదెల-2 అంగన్వాడీ కేంద్రం సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత సూపర్వైజర్ అందుబాటులో ఉన్న అంగన్వాడీ టీచర్కు కేంద్రం పూర్తి బాధ్య తలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. సీడీపీవో, సంబంధిత సూపర్వై జర్ ఉత్తర్వులను తక్షణమే అమలు చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, గుడ్లు, ఇతర సంక్షేమ సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అంగన్వాడీ సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.



# విద్యుత్ వాహనాలతో ఖర్చు తగ్గింపు.. కాలుష్యానికి చెక్

**నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి**

**పెద్ద శంకరంపేట ఆగస్టు 14. (జనం సాక్షి):** పెద్దశంకరంపేటలో మండల కేంద్రమైన రాజన్న ఈవీ మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్స్ షోరూమ్ను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ ప్రొప్రైటర్ కనకరాజు గౌడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భూపాల్రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే విద్యుత్ వాహనాల నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటంతో పాటు, వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో ఇవి దోహదపడతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన వ్యయాన్ని తగ్గించుకోవాలనుకునే వారికి ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగితే భవిష్యత్లో కాలుష్య నియంత్రణకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ప్రజలు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ పర్యావరణహిత రవాణా వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జంగం శ్రీనివాస్, సురేష్ గౌడ్,శంకర్ గౌడ్, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్బండ్పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు అభినందనీయం

- సీఎం రేవంత్రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు
- 18న గ్రామగ్రామాన జయంతి వేడుకలు నిర్వహించాలి
- పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి
- జనగామను సర్వాయి పాపన్న జిల్లాగా ప్రకటించాలి



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 16 (జనం సాక్షి):** ట్యాంక్బండ్పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరుశురాం గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్లోని తారక హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని గౌడ బాంధవులకు, బహుజనులకు పిలుపునిచ్చారు. విగ్రహం లేని ప్రాంతాల్లో సర్వాయి పాపన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించాలని కోరారు. కరీంనగర్ మానేరు బ్రిడ్జిపై ఉన్న సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గత 20 ఏళ్లుగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆడిటోరియంలో, సంఘం ఆధ్వర్యంలో విగ్రహం వద్ద వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నందున ఇకపై విగ్రహం వద్దే ఒకే చోట జయంతి వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కోరినట్లు చెప్పారు. ఈ విషయాన్ని గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో రూ.1.03 కోట్లు మంజూరైనా ఇప్పటివరకు విడుదల కాలేదని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోడూరి పరుశురాం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, పెండింగ్లో ఉన్న ఎక్స్గ్రేషియా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కలర్ సత్తన్న, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బుర్ర పర్శరాములు గౌడ్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు గోడిశల రమేశ్ గౌడ్, రాంపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని కన్నయ్య, కార్యదర్శి వొల్లాల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు దుర్గం సంపత్ గౌడ్, రాంపూర్ గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు పర్శురాం గౌడ్ పాల్గొన్నారు.




# పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థుల ఉచిత ఆరోగ్య శిబిరం

**కరీంనగర్ అర్బన్ ఆగస్టు 16 (జనంసాక్షి) :**

స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రజల్లో ఆరోగ్యం పై అవగాహన పెంపొందించడంతో పాటు, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఆదివారం స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పాఠశాల సైన్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నర్సింగ్ ఆఫీసర్ పర్యవేక్షణలో విద్యార్థులు స్టేడియానికి వచ్చిన వాకర్స్, వివిధ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు బీపీ, షుగర్, బిఎంఐ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల ప్రాధాన్యతను వివరిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన ఈ శిబిరానికి అంబేద్కర్ స్టేడియానికి వచ్చిన వాకర్స్, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు ఆసక్తిగా శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పాఠశాల లో పొందుతున్న జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా ఆచరణలో పెట్టడం ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్ రావు తెలుపుతూనే ఉత్సాహవంతంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

ఆరోగ్యం పై అవగాహన ప్రతి ఒక్కరి హక్కు ఆరోగ్య చైతన్యాన్ని సమాజానికి అందించడం మనందరి బాధ్యత అనే సందేశంతో నిర్వహించిన ఈ ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, సైన్స్ విభాగం ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జవాన్ల సంక్షేమానికి.. మోదీ ప్రభుత్వం పెద్దపీట

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ఇబ్రహీంపట్నం ఎస్ఎస్బీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 48 ప్రత్యేక నివాస గృహాల ప్రారంభం

**రంగారెడ్డి, ఆగస్టు 26 (జనంసాక్షి) :** దేశ సరిహద్దుల్లో మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, మానవ అక్రమ రవాణా, అక్రమ వలసలు, ఇతర వ్యవస్థీకృత నేరాలను సమర్థవంతంగా అడ్డుకుంటున్న సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్బి) జవాన్ల సేవలు ప్రశంసనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. విపత్తుల సమయంలోనూ ఎస్ఎస్బీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని ఎస్ఎస్బీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 48 ప్రత్యేక కుటుంబ నివాస గృహాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి నూతన గృహ సముదాయాలను పరిశీలించి, జవాన్లకు కల్పిస్తున్న వసతులు, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరిహద్దుల్లో దేశ భద్రతను కాపాడుతున్న జవాన్ల కుటుంబాలు సురక్షితంగా, గౌరవంగా, సౌకర్యవంతంగా



జీవించేలా చూడటం ప్రభుత్వ బాధ్యతన్నారు. జవాన్లకు కుటుంబ భద్రత, సౌకర్యాలపై ఆందోళన లేకుండా ఉంటే దేశ భద్రతపై మరింత సమర్థవంతంగా దృష్టి పెట్టగలరని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో నిఘా సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేసేందుకు డ్రోన్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, జీపీఎస్ ఆధారిత గస్తీ, సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, జీఐఎస్ ఆధారిత ప్రణాళిక వంటి ఆధునిక సాంకేతికతలను ఎస్ఎస్బీ వినియోగిస్తోందని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సరిహద్దు నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపడుతున్న ఎస్ఎస్బీని అభినందించారు. విపత్తుల్లోనూ సేవలు ఎస్ఎస్బీలోని 18 సహాయక, రక్షణ బృందాలు వివిధ అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని బండి సంజయ్ తెలిపారు. విపత్తుల సమయంలో ప్రజలకు సహాయం అందిస్తున్న సిబ్బందిని అభినందిం చారు. భవిష్యత్తులోనూ ఇదే అప్రమత్తత, సేవాభావం, మానవతా దృక్పథంతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంశాఖ మార్గదర్శకత్వంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల ఆధునీకరణతో పాటు జవాన్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. జవాన్ల కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆధునిక గృహ వసతి, పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జవాన్లు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేలా సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్మించిన 48 కుటుంబ నివాస గృహాలు కేవలం భవనాలు మాత్రమే కాకుండా జవాన్లు, వారి కుటుంబాల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీకలని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్బీ డైరెక్టర్ జనరల్ సంజయ్ సింఘాల్తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## మండల ప్రజావాణి నిర్వహణకు రైతు వేదికలను ఉపయోగించుకోవాలి

- నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం మండల ప్రజావాణి
- ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి మొట్ట మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరాన్ని బట్టి రైతు వేదికలను ఉపయోగించుకోవాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ఎంపీడీవోలకు ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రంలో పలు మండలాలలో ఎంపీడీవో కార్యాలయాలలో తగినంత చోటు లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి రైతు వేదికలలో మండల ప్రజావాణి నిర్వహణకు అనుమతించాలని కోరిన వెంటనే మంత్రి అందుకు సమ్మతిని తెలిపారని చిన్నారెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలో మండల ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని అవసరమైన వారు రైతు వేదికలను మండల ప్రజావాణి కోసం ఉపయోగించుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల ఎంపీడీవోలకు ఇటీవల ప్రజా భవన్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సూచించిన విధంగా అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని దరఖాస్తుదారులకు అన్ని రకాల కనీస సౌకర్యాలు కల్పించాలని, మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.

## కమాండోల సేవలు భేష్: బండి సంజయ్



హైదరాబాద్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్జీ) 28వ స్పెషల్ కాంపోజిట్ గ్రూప్‌ను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్జీ అధికారులు, సిబ్బందితో మాట్లాడిన ఆయన.. గ్రూప్ ఆపరేషనల్ సన్నద్ధత, సామర్థ్యాలు, ప్రత్యేక నైపుణ్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉగ్రవాద దాడులు, బాంబు పేలుళ్ల సమయాల్లో ఎన్ఎస్జీ అందించే సేవలకు సంబంధించిన రిహార్సల్స్‌ను సిబ్బంది ప్రదర్శించారు.



## ఇల్లు ఇప్పించండి అయ్యా!

- మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన బుచ్చమ్మ..
- తనకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఎంకు విన్నవించిన వృద్ధురాలు
- ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం..
- ఇళ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి

ములుగు బ్యూరో,ఆగస్టు16(జనం సాక్షి): మేడారం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని బుచ్చమ్మ కలిశారు.ఈ సందర్భంగా తన పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించి, తనకు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఇల్లు మంజూరు చేయాలని కోరారు. బుచ్చమ్మ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆమెకు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

అంతేకాకుండా బుచ్చమ్మకు ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నారు. పేదలు, నిరాశ్రయులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు.

ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. బండ్ల గణేష్‌తో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. అనేక సందర్భాల్లో, రాజకీయ కార్యక్రమాల్లోనూ ఆయన తనకు ఎంతో ఆత్మీయంగా అండగా నిలిచారని గుర్తు చేశారు. బండ్ల గణేష్‌కి, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నూతన వధూవరుల దాంపత్య జీవితం ప్రేమానురాగాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో చిరకాలం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

– హైదరాబాద్ (జనంసాక్షి)
































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370